ఇండియా బ్లాక్‌కే బీహార్‌లో అత్యధిక స్థానాలు
- ఈ ఎన్నికలు పెట్టుబడిదారీ విధానం, ప్రజాస్వామ్యం మధ్య పోరాటం
- నితీష్ కుమార్ సైద్ధాంతిక విధేయతలేని వ్యక్తి
- సిపిఎం బీహార్ రాష్ట్ర కార్యదర్శి లాలన్ 4

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 272 | విజయవాడ, మంగళవారం 7 మే 2024 | 18 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 7 May 2024 | Rs



పారిస్ ఒలింపిక్స్‌కు 4x400మీ. రిలే జట్లు అర్హత 8

కీలకాంశాలపై మౌనం

హోదా, విభజన హామీలపై నోరు విప్పని మోడీ ● విశాఖ ఉక్కుపైనా అదే తీరు ● జగన్ పేరు ప్రస్తావించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు

- సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకువెళ్లని టిడిపి, జనసేన అధినేతలు



ఉగ్గినపాలెం సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన నేత నాగేంద్రబాబు తదితరులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం, అనకాపల్లి ప్రతినిధులు

ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాష్ట్రానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి రాష్ట్ర ప్రజలకు నిరాశనే మిగిల్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలోనూ, అనకాపల్లి జిల్లా కశింకోట మండలం ఉగ్గినపాలెంలోనూ నిర్వహించిన రెండు సభల్లోనూ ఆయన రాష్ట్రానికి సంబంధించిన కీలకాంశాలపై మౌనం దాల్చారు. ఇటీవల జరిగిన చిలకలూరిపేట సభలో ప్రధాని ప్రత్యేకహోదా, విభజనహామీలు, విశాఖ ఉక్కు, అమరావతి అభివృద్ధి అంశాలను ప్రస్తావించని సంగతి తెలిసిందే. ఈ వైఖరిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినప్పటికీ ప్రధాని తీరులో ఇసుమంత కూడా మార్పురాలేదు.

తాజా సభల్లోనూ ఆ అంశాలనన్నింటిని ఆయన విస్మరించారు ప్రత్యేకహోదాతో పాటువిభజన చట్టంలోని హామీలను నెరవేర్చే విషయమై ఆయన రాష్ట్ర ప్రజలకు ఎటువంటి హామీ ఇవ్వలేదు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంగా మారిన విశాఖ ఉక్కు అంశాన్ని కూడా మోడీ పట్టించుకోలేదు. సంవత్సరాల తరబడి ఉక్కు కార్మికులు చేస్తున్న ఆందోళన తనకు తెలియనట్టుగా ఆయన వ్యవహరించారు. రెండుచోట్ల సుదీర్ఘ ఉపన్యాసాలు చేసిన మోడీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరును ప్రస్తావించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, మూడు రాజధానుల పేరుతో మోసం చేసిందని చెప్పారు. అయితే, అమరావతి అభివృద్ధిపై ఎటువంటి హామీ ఇవ్వలేదు. దీంతో ప్రధాని వ్యూహాత్మకంగానే జగన్ పేరును ప్రస్తావించకపోవడంతో పాటు, రాజధాని అంశంపై ఎటువంటి హామీ ఇవ్వలేదు. సభల్లో పాల్గొన్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ప్రత్యేకహోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు అంశాలను తమ ప్రసంగాల్లో ప్రధాని దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయలేదు. మోడీని పొగడడానికి, జగన్‌ను విమర్శించడానికి మాత్రమే వారు పరిమితమైనారు.

ప్రధాని ఏం చెప్పారు...?

రెండు సభల్లోనూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని రాజకీయ అవినీతిని అరికట్టేందుకు కొత్త చట్టాలు తెచ్చేందుకు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని ప్రధాని మోడీ తెలిపారు. దోచుకున్న వారి నుంచే సొమ్ములను వసూలు చేస్తామన్నారు. ఎపిలో ఇసుక, మద్యం మాఫియా కోరలు చాస్తోందని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి మోడీ గ్యారంటీ, చంద్రబాబు నాయకత్వం, పవన్ విశ్వాసం ఉన్నాయన్నారు. అవినీతిని అరికట్టడానికి తాము ప్రయత్నిస్తుంటే ఇండియా ఫోరమ్ నాయకులు ఇడి, ఇడి అంటూ కేకలు పెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికడతామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు ఇలా..

ముఖ్యమంత్రి జగన్ పేరు ప్రస్తావించకుండా మోడీ వైసిపి పాలనలో రాష్ట్రం అవినీతి, అక్రమాల్లో ముందుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం మిగతా 2లో

గిరిజనంపై బిజెపి దాడి
- ప్రజా వ్యతిరేక చట్టాలపై నోరు మెదపని వైసిపి, టిడిపి
- ఎన్నికల ప్రచార సభల్లో బృందా కరత్ 18

మోడీ, జగన్, బాబు మోసకారులు
- ఎన్నికల్లో ఆ ముగ్గురిని ఓడించాలి
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి : బివి 2

కేజ్రీవాల్‌పై ఎన్‌ఐఎ విచారణ
- ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు 7



డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా



డిజిపిగా బాధ్యతలు చేపడుతున్న హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ అనంతపురం క్రైం

రాష్ట్ర డిజిపిగా 1992 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన హరీష్‌కుమార్ గుప్తాను కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ మేరకు తక్షణం బాద్యతలను చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో ఆదేశించడంతో సోమవారం సాయంత్రం మంగళ గిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఇంచార్జీ డిజిపి శంఖబ్రత బాగ్చీ నుండి ఆయన బాద్యతలను స్వీకరించారు. రాష్ట్ర డిజిపిగా వున్న కెవి రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆదివారం బదిలీ చేస్తూ సోమవారం ఉదయానికంతా ముగ్గురు అధికారులతో జాబితాను పంపాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ద్వారకా తిరుమలరావు, మాదిరెడ్డి ప్రతాప్, హరీష్‌కుమార్ గుప్తా పేర్లను ప్రతిపాదించారు. ఈ మూడు పేర్ల నుండి హరీష్‌కుమార్ గుప్తా పేరును డిజిపిగా ఎన్నికల కమిషన్ ఎంపిక చేసింది. ప్రస్తుతం హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరిగా పనిచేస్తున్న హరీష్‌కుమార్ గుప్తా మొదట ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం ఎఎస్‌పిగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన మెదక్, పెద్దపల్లిలో ఎఎస్‌పిగా, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో అడిషనల్ ఎస్‌పిగా, ఉమ్మడి కృష్ణా జిల్లాకు, నల్గొండ జిల్లాలకు ఎస్‌పిగా పని చేశారు. సిఐడిలో ఎస్‌పిగా పనిచేశారు. హైదరాబాద్ సౌత్‌జోన్ డిసిపిగా పనిచేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఐజిగా, లా అండ్ ఆర్డర్‌లో ఐజిగా, అడిషనల్ డిజి హోదాలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా వున్నారు.

అనంతపురం డిఐజి అమ్మిరెడ్డిపై బదిలీ వేటు



అమ్మిరెడ్డి

అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డిపై ఎన్నికల సంఘం కొరాడా ఝుళిపించింది. అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు వేసింది. ఈ మేరకు సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే ఆయన విధుల నుంచి రిలీవ్ కావాలని, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. అధికార పార్టీకి డిఐజి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు గత కొంతకాలంగా ఉన్నాయి. వీటికి సంబంధించి ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేయడంతో ఆయనను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

రఫాపై భూతల దాడులు!

- ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ హుకుం
- ఒప్పందానికి హమాస్ ఓకే
- తేల్చి చెప్పని ఇజ్రాయిల్

గాజా, జెరూసలేం : అంతర్జాతీయ సమాజం వ్యతిరేకతను బేఖాతరు చేస్తూ యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వం రఫాలో మరో మారణహోమానికి తెగబడేందుకు సిద్ధమైంది. వైమానిక దాడులతోబాటు భూతల దాడులు ఏక కాలంలో సాగించాలని చూస్తోంది. తూర్పు రఫా నగరాన్ని ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ సైన్యం సోమవారం హుకుం జారీ చేసింది. పది లక్షల మందికి పైగా ప్రజలు తలదాచుకుంటున్న ఈ నగరంపై దాడి చాలా ప్రమాదకరమైన పర్యవసానాలకు దారి తీస్తుందని అరబ్ ప్రపంచంతో సహా పలు దేశాలు ఇజ్రాయిల్‌ను ఇప్పటికే హెచ్చరించాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్ దుస్సాహసాన్ని నిలువరించే ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదు. పైగా అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇజ్రాయిల్ పట్ల తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ప్రకటించారు. బలవంతంగా రఫా నుంచి శరణార్థులను ఖాళీ చేయించడం యుద్ధ నేరం కిందికి వస్తుందని ఫ్రాన్స్ పేర్కొంది.

రఫాను వీడి వెళ్లాలని ఇజ్రాయిల్ హుకుం జారీ చేయడాన్ని ప్రమాకరమైన కవ్వింపు చర్యగా హమాస్ పేర్కొంది. రఫాపై దాడికి దిగితే అది ఇజ్రాయిల్‌కు పీడకలగా మిగిలిపోతుందని హెచ్చరించింది. రఫా నగరంపై జరిగే ఏ దాడైనా ఇజ్రాయిల్ బలగాలకు 'పిక్నిక్' లా వుండబోదని అది వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ సైన్యం నుంచి ఆదేశాలు వెలువడిన గంటల వ్యవధిలోనే వేలాదిమంది ప్రజలు మూటా ముల్లె సద్దుకుని, పిల్లలు, వృద్ధులతో పరుగులు తీస్తున్న దృశ్యాలు మానవతావాదులను కలచివేస్తున్నాయి. . నుస్రత్, డేర్ ఎల్ బాలాహ్ వీధుల నుంచి ప్రజలు గుంపులు, గుంపులుగా తరలుతున్నారు. ఎక్కడ సురక్షిత ప్రాంతం వుందో కూడా తమకు అర్థం కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇజ్రాయిల్ హుకుం జారీ చేసిన వెంటనే అమెరికా అధ్యక్షుడు బైడెన్, నెతన్యాహుతో మాట్లాడారు. బహుశా అమెరికా ఇచ్చిన అండతోనే ఆయన ఇంతగా పేట్రేగిపోతున్నాడు. మరో ఊచకోత మొదలవబోతోందని జోర్డాన్ వ్యాఖ్యానించింది. కైరోలో జరిగిన చర్చల్లో ఈజిప్ట్, ఖతార్ ప్రతిపాదించిన ముసాయిదా ఒప్పందానికి హమాస్ ఆమోదం తెలిపింది. ఇజ్రాయిల్ మాత్రం తన వైఖరిని ఇంకా స్పష్టం చేయలేదు. పరిస్థితులేమీ బాగా లేవని మానవతా సాయం కార్యకర్తలు తెలిపారు. మొండిగా మిగతా 7లో

కార్పొరేట్ల కోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

మణిపూర్ ఘటనల్లో బిజెపికి అనకూలంగా వైసిపి

మొదటి, రెండు దశల ఎన్నికల్లో మోడీకి నిరాశా నిస్పృహలు

ఇండియా వేదిక నాయకులు వైఎస్ షర్మిల, వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల, ఫొటోలో వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు భూములను కట్టబెట్టడమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఉద్దేశమని, నీతి ఆయోగ్ చెప్పిందనే పేరుతో ఈ యాక్ట్‌ను యథాతథంగా అమలు చేయడం దారుణమని ఇండియా వేదిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కడప డిసిసి కార్యాలయంలో ఇండియా వేదిక నాయకులు, పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆప్ నాయకులు తిరుమలరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

షర్మిల మాట్లాడుతూ మణిపూర్‌లో క్రిస్టియన్ల ఊచకోతపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని విపక్షాలు పట్టుబట్టినప్పుడు బిజెపికి అనుకూలంగా వైసిపి వ్యవహరించిందని గుర్తు చేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడడం దారుణమన్నారు. విశాఖ స్టీల్ ప్రమాదంలో పడిందన్నారు. గత ఐదేళ్లుగా బిజెపికి టిడిపి, వైసిపి మద్దతు ఇస్తున్నాయని వివరించారు. వైసిపి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని బిజెపి నాయకులు చెప్తున్నారని, బిజెపికి జగన్ తొత్తు కాబట్టే ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇవ్వకపోయినా బిజెపి మోసం చేసిందని వివరించారు. దీనిపై వైసిపి ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు చొప్పున పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలులో బిజెపి విఫలమైందని, వీటిపై ప్రశ్నించే ధైర్యం ఇండియా వేదికకు మాత్రమే ఉందని అన్నారు.

వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 20 శాతం భూ వివాదాలను పరిష్కరిస్తామనే పేరుతో 80 శాతం భూములను ప్రమాదంలో పడేయడంలో ఉద్దేశమేమిటో చెప్పాలని నిలదీశారు. ఇటువంటి చట్టానికి టిడిపి సైతం అసెంబ్లీలో మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.2,200 కోట్లు ఇచ్చామని ప్రధాని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. కర్ణాటకలో 400 మంది మహిళలపై అత్యాచారం చేసిన నాయకులకు బిజెపి మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. దేశంలోని మహిళలు బిజెపి అభ్యర్థులకు, వారి మద్దతుదారులకు ఒక్కఓటూ వేయకూడదని పిలుపునిచ్చారు. బిజెపి వస్తే లౌకికవాదానికి, రాజ్యాంగానికి ప్రమాదకరమని తెలిపారు. ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి ఇకపై ఉండబోవని హెచ్చరించారు. పోలవరం, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ వంటి హామీలను పదేళ్లుగా ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి చూస్తోందని విమర్శించారు.

కె.రామకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక, ఎన్‌డిఎ కూటమి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని తెలిపారు. ప్రధాని మోడీ... బిజెపికి 370 సీట్లు, ఎన్‌డిఎకు 400 సీట్లు వస్తాయని చెప్పారని, మొదటి, రెండు దశల ఎన్నికలతో ఆయనలో నిరాశా నిస్పృహలు అలుముకున్నాయని అన్నారు. మూడో దశలో కూడా మెజార్టీ కష్టమని తెలిపారు. ఉత్తరాది రాష్ట్రాల్లో మోజార్టీ రాదని అర్థమవడంతో దక్షిణాది రాష్ట్రాలైన ఎపి, తెలంగాణ, తమిళనాడులపై పడ్డారని విమర్శించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో బిజెపికి ఒక్క సీటూ వచ్చే అవకాశం లేదని తేలిపోయిందన్నారు. వైఎస్ జగన్ రాష్ట్రాన్ని నాశనం చేయడంలో కేంద్రం సహాయం కూడా ఉందని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టులు చేశారని, రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ నడుస్తోందని ఎపి బిజెపి అధ్యక్షులు పురంధేశ్వరి ఫిర్యాదు చేసినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మూడు రాజధానుల డ్రామాకు కేంద్రం సహకరించలేదా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఇండియా వేదిక నాయకులు జి.ఓబులేసు, జి.చంద్రశేఖర్, మనోహర్, ఐఎన్.సుబ్బమ్మ, కామనూరు శ్రీనివాసులరెడ్డి వి.అన్వేష్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు తిరుమలరెడ్డి, కమలాపురం ఇండియా వేదిక అభ్యర్థి గాలిచంద్ర పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు గ్రహణం

- కలాలకు సంకెళ్లు పడ్డాయి
- గళాలు మూగబోయాయి
- మోడీ పాలనలో నిర్బంధాలు, అణచివేతలు



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత్రికేయుల కలాలకు సంకెళ్లు పడ్డాయి. వారి గొంతుకలు అణచివేతకు గురై మూగబోయాయి. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను భరించలేక విదేశీ జర్నలిస్టులు దేశం విడిచి వెళ్లిపోయారు. మరికొందరు జైళ్లలో మగ్గుతున్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ ఉదాశీన వైఖరిని ప్రశ్నించడమే వారు చేసిన నేరం. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ పూర్తిగా కనుమరుగై పోయింది. బడా మీడియా సంస్థలు సైతం అధికార పక్షానికి కొమ్ము కాస్తున్నాయి. వాస్తవాలు వెలుగులోకి రాకుండా అడ్డుకుంటున్నాయి. పాలకుల భజనలో మునిగితేలుతున్నాయి.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ కథనాన్ని రూపొందించినందుకు ఎన్‌డి టివిలో పనిచేసిన రవీష్ కుమార్ తన ఉద్యోగాన్నే వదులుకోవాల్సి వచ్చింది. దానికి కారణం ఎన్‌డి టివి యాజమాన్యం మారడం... నూతన యాజమాన్యం ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడం. దేశంలో పత్రికా స్వేచ్ఛకు ఏ విధంగా గ్రహణం పట్టిందో ఈ ఉదంతం చాటిచెబుతోంది. పత్రికా స్వేచ్ఛపై మొత్తం 180 దేశాల్లో సర్వే నిర్వహించగా మన దేశం 159వ స్థానంలో నిలిచింది.

విదేశీ పాత్రికేయులపై కక్ష సాధింపు

మోడీ ప్రభుత్వం ఇటీవలే ఇద్దరు విదేశీ పాత్రికేయులను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించింది. చివరికి వారు మూటా ముల్లే సర్దుకొని స్వదేశాలకు వెళ్లిపోయారు. ఫ్రాన్స్‌లోని అనేక మీడియా సంస్థలకు వార్తలు అందిస్తూ, మన దేశంలో సుదీర్ఘ కాలం పనిచేసిన వనెస్సా డగ్నక్ ఫిబ్రవరిలో భారత్‌ను వీడారు. ఓవర్‌సీస్ సిటిజన్ ఇండియా కార్డును మోడీ ప్రభుత్వం రద్దు చేయడంతో చేసేదేమీ లేక ఆమె ఫ్రాన్స్ వెళ్లిపోయారు. ఏప్రిల్‌లో ఎబిసి న్యూస్‌కు చెందిన అవనీ డయాస్ కూడా ఆస్ట్రేలియాకు తిరుగుముఖం పట్టారు. 'గీత దాటారంటూ' ఆమెపై నిందలు వేసి వీసాను పొడిగించేందుకు నిరాకరించారు. ఎన్నికల వార్తల కవరేజీ కోసం భారత్ వెళ్లాల్సిన తన కరస్పాండెంటుకు మోడీ ప్రభుత్వం వీసా ఇవ్వలేదని అల్ జజీరా టివి తెలిపింది.

దేశంలో పనిచేస్తున్న విదేశీ పాత్రికేయులు ఈ ఉదంతాలపై రెండు కథనాలు అందించారు. అవి అంతర్జాతీయ మీడియాలో ప్రముఖంగా కన్పించాయి. హిందూత్వ వెబ్‌సైట్లు మాత్రం విదేశీ పాత్రికేయులను సాగనంపడాన్ని సమర్ధించాయి.

వ్యతిరేకిస్తే జైలే

ఇక స్వదేశీ పాత్రికేయుల ఇబ్బందులు చెప్పనలవి కావు. వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రస్తుతం ఎనిమిది మంది జర్నలిస్టులు జైళ్లలో ఉన్నారు. కాశ్మీర్‌కు చెందిన పాత్రికేయుడు అసిఫ్ సుల్తాన్ 2018 నుండీ జైలు జీవితం గడుపుతున్నారు. పంజాబ్‌కు చెందిన స్వతంత్ర పాత్రికేయుడు రాజీందర్ సింగ్ థగ్గర్‌ను మిగతా 7లో

ప్రచార సభల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి

- జగన్, చంద్రబాబుకు ఇసి హెచ్చరిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సిఎం చంద్రబాబు నాయుడుకు కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం జగన్, చంద్రబాబుకు ఇసి నోటీసులిచ్చింది. ఒకరిపై ఒకరు పరస్పరం తీవ్రస్థాయిలో చేస్తున్న వ్యాఖ్యలపై హెచ్చరించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినట్లు భావించాల్సి వస్తుందని పేర్కొంది. ఎన్నికల ప్రచార సభల్లో సిఎం జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఇసి తప్పుపట్టింది. ఇప్పటికే ఈ అంశంపై జగన్, చంద్రబాబులకు నోటీసు జారీ చేయగా, వారిచ్చిన సమాధానంతో ఇసి సంతృప్తి చెందినా ఇకపై ప్రచార సభల్లో అలా మాట్లాడటం సరికాదంటూ హెచ్చరించింది.

పోస్టల్ బ్యాలెట్‌లో గందరగోళాన్ని తొలగించాలి

సిఇఒకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌పై నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు ఆయన లేఖ రాశారు. ఒక్కో జిల్లాలో ఒక్కో విధానం అమలు జరగడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని మీనా దృష్టికి తీసుకొచ్చారు. ట్రైనింగ్ క్లాసుల వద్ద పోస్టల్ బ్యాలెట్ పంపిణీ చేస్తామని చెప్పినప్పటికీ రాలేదని, చివరి నిమిషంలో తూర్పుగోదావరి జిల్లా అధికారులు తెలిపారని పేర్కొన్నారు. ట్రైనింగ్ పూర్తయిన వారు ఎక్కడ ఓటు వేయాలో తెలియక అయోమయంలో ఉన్నారని వివరించారు. ఫారమ్ 12 సమర్పణతో సంబంధం లేకుండా ఓటు హక్కు ఏ నియోజకవర్గ పరిధిలో ఉంటే అక్కడ ఓటు వేయాలని అంటున్నారని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు 4వ తేదీన మచిలీపట్నం రావాలని సంబంధిత ఉద్యోగులకు తెలియజేసి ముందస్తు సమాచారం లేకుండా 6వ తేదీకి వాయిదా వేశారని తెలిపారు. సత్యసాయి, విజయవాడలో మూడు గంటలు ఆలస్యమైందని, ఉక్కపోత కారణంగా క్యూలైన్లో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఒంగోలులో ఓటరు ధ్రువీకరణ పత్రంలో గెజిటెడ్ అధికారులు సంతకం చేయలేదని, సత్యసాయి జిల్లాలో 150 ఓట్లు గల్లంతయ్యాయని తెలిపారు. ఏలూరులో ఫారమ్ 12 ఎక్కడ అందజేశారో అక్కడే ఓటు వేయాలని అధికారులు చెప్పారన్నారు. ఈ గందరగోళం తొలగించి స్వేచ్ఛగా ఇబ్బందులు లేకుండా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు తగిన ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైతే అంగన్‌వాడీ ఉద్యోగులను ఎన్నికల ప్రక్రియ చివరిలో ఉపయోగించుకుంటామని అధికారులు చెబుతున్నారని, చివరి నిమిషంలో చెబితే ఓటు వేసే అవకాశం ఉండదని అన్నారు. అటువంటి అంగన్‌వాడీ ఉద్యోగులకు మే 13 తరువాతైనా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

చల్లటి కబురు
నేటి నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పులతో సతమతమైన ప్రజలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చల్లటి కబురు చెప్పింది. తూర్పు విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం వుందని సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఐఎమ్‌డి నివేదిక మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుందని తెలిపారు. శుక్రవారం వరకూ మెరుపులతో కూడిన వర్షాలు, పిడుగులు పడే అవకాశం వున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. అలాగే సోమవారం కర్నూలు జిల్లా పంచలింగాల, కడప జిల్లా వల్లూరులో 45.1 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 12 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 112 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

మోడీ, జగన్, బాబు మోసకారులు

- ఎన్నికల్లో ఆ ముగ్గురిని ఓడించాలి
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి : బేబి


బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంఎ బేబి పక్కన గఫూర్, జగన్నాథం, రాంభూపాల్, ప్రభాకర్ తదితరులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రజలను మోసం చేయడంలో మోడీ, జగన్, బాబు పోటీ పడుతున్నారని, ఎన్నికల్లో ఆ ముగ్గురిని ఓడించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి కోరారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద సోమవారం సాయంత్రం సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో బేబి మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ.. రైతు వ్యతిరేక విధానాల వల్ల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని చెప్పారు. అలాంటి మోడీతో జతకట్టడం కోసం జగన్, చంద్రబాబు పోటీ పడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో దేశంలో మోడీని రాష్ట్రంలో జగన్‌ని గద్దె దించడం మన కర్తవ్యమని, ఇండియా వేదికకు ఓటు వేయడం ద్వారానే అది సాధ్యమని తెలిపారు. భవిష్యత్తులో ముస్లింలు, క్రైస్తవులు ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణింపబడతారని తెలిపారు. చౌకీదార్ అని చెప్పుకునే మోడీ ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయలు దోపిడీ చేశారని విమర్శించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో బాబు, జగన్ పోటీ పడుతున్నారని విమర్శించారు. ప్రజల ఆస్తులను కారుచౌకగా పెట్టుబడిదారుల పరం చేస్తున్నారని, అదే బిజెపి వికాసమని చెప్పారు. కరోనాను ఎదుర్కోవడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజలను విభజించే దుర్మార్గులను దేశం నుంచి తరిమికొడితేనే దేశం బాగుపడుతుందని చెప్పారు. 2018లో బిజెపికి వ్యతిరేకంగా చంద్రబాబు మాట్లాడి ఇప్పుడు అదే పార్టీతో జతకట్టారని విమర్శించారు. జైలుకు పోయే వాళ్ళందరూ మోడీతో జత కడుతున్నారని ఎద్దేవా చేశారు.

సిపిఐ రాష్ట్ర నాయకులు జగన్నాథం మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు చాలా ప్రాముఖ్యమైనవన్నారు. మోడీ పదేళ్ల పాలనలో, జగన్ ఐదేళ్ల పాలనలో ఎక్కడైనా అభివృద్ధి జరిగిందా? అని ప్రశ్నించారు. మోడీతో జతకట్టిన చంద్రబాబు కూటమిని, నియంతృత్వ వైసిపిని ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి జె.లక్ష్మినరసింహయాదవ్ మాట్లాడుతూ...బిజెపి పదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. భూ కబ్జాదారుడైన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని కోరారు. సిపిఎం పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి డి.గౌస్ దేశాయ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1180వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును రక్షించుకునే క్రమంలో జరుగుతున్న పోరాటాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం కుట్రలు పన్నుతున్నాయన్నారు. వాటిని పోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు. పార్లమెంటులో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు.

నేను ల్యాండ్ టైట్లింగ్ యాక్టు బాధితుడిని

- మాజీ ఐఎఎస్ అధికారి పివి రమేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్టుకు తాను ప్రత్యక్ష బాధితుడినని మాజీ ఐఎఎస్ అధికారి పివి రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ అకౌంట్లో అభిప్రాయాన్ని పంచుకున్నారు. కృష్ణా జిల్లా విన్నకోటలో తన పట్టా భూములను మ్యుటేషన్ చేసుకునేందుకు ఇబ్బంది పడ్డానని పేర్కొన్నారు. చనిపోయిన తన తల్లిదండ్రుల పట్టా భూముల మ్యుటేషన్‌కు తిరస్కరించారని తెలిపారు. పేరు మార్చేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించినట్లు చెప్పారు. పోస్టు ద్వారా ఆర్‌డిఒ పంపిన పత్రాలను తెరవకుండానే తిరిగి ఇచ్చేశారని వివరించారు. తన తల్లిదండ్రుల భూములపై తనకు హక్కు లేకుండా చేశారని, 'ఐఎఎస్ అధికారిగా 36 ఏళ్లు ఎపికి సేవలందించిన నాకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఒక సామాన్య రైతుల దుస్థితి ఊహించలేం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.


ఆ భూ వివాదానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు సంబంధం లేదు

- మాజీ మంత్రి పేర్నినాని

ప్రజాశక్తి- కృష్ణ ప్రతినిధి

ప్రభుత్వంపై విషం చిమ్మేలా కొంతమంది మాజీ ఐఎఎస్ అధికారులను టిడిపి అధినేత చంద్రబాబు ఉసిగొల్పుతున్నారని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆరోపించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఐఎఎస్ పివి రమేష్‌కు గ్రామంలోని రైతులతో ఉన్న భూ వివాదానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ఎటువంటి సంబంధమూ లేదన్నారు. చంద్రబాబు కోసం ఆయన దిగజారి ట్వీట్ చేశారని విమర్శించారు. పివి రమేష్ తండ్రి సుబ్బారావు మాస్టర్ కొందరు రైతులతో కలిసి 70 ఎకరాల పొలాన్ని 20 ఏళ్ల క్రితమే చేపల చెరువుగా తవ్వి అందరితో కలిసి లీజుకు ఇచ్చారన్నారు. సరిహద్దులు లేని పివి రమేష్ పొలం ఇప్పటికే వివాదంలో ఉందని, వినగడపలో జనవరి నెలలో ఈ భూ వివాదంపై విచారణ జరిగిందని, అధికారులు చెప్పిన విధంగా భూముల అసలు పత్రాలు ఇప్పటి వరకు రమేష్ తీసుకురాలేదన్నారు. అక్కడ రైతులకు పివి రమేష్‌కు గొడవలు ఉంటే ప్రభుత్వంపై బురద చల్లడం తగదన్నారు.

మొదటి జిఎస్‌టి ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా
సంజయ్ కుమార్ మిశ్రా


మిశ్రాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : మొదటి జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా జస్టిస్ (రిటైర్డ్) సంజయ్‌కుమార్ మిశ్రా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మిశ్రాతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రమాణ స్వీకారం చేయించారు. సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ యాక్ట్ కింద ఈ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన ఏడేళ్ల తరువాత ఈ ట్రిబ్యునల్ అందుబాటులోకి వచ్చింది. జిఎస్‌టికు సంబంధించిన వివాదాలను ఈ ట్రిబ్యునల్ పరిష్కరిస్తుంది. భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ జార్ఖండ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ సంజయ్‌కుమార్ మిశ్రాను జిఎస్‌టి ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. 'జిఎస్‌టి వివాదాలకు వేగవంతమైన, న్యాయమైన, సమర్థవంతమైన పరిష్కారాలను ఈ ట్రిబ్యునల్ చూపుతుంది. న్యాయస్థానాలపై భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ ట్రిబ్యునల్ ఏర్పాటు దేశంలో జిఎస్‌టి వ్యవస్థ ప్రభావాన్ని మరింత మెరుగుపరుస్తుంది' అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కవితకు బెయిల్ నిరాకరణ

- జగన్ కేసులోని అంశాలు ప్రస్తావన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ వ్యవహారంలో మరోసారి నిరాశే మిగిలింది. లిక్కర్ కేసులో ఇడి, సిబిఐ కేసుల్లో ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు రౌస్ ఎవెన్యూ కోర్టు (ట్రయల్ కోర్టు) నిరాకరించింది. ఈ మేరకు సోమవారం సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జ్ కావేరి బవేజా తీర్పును వెలువరించారు. మొత్తం 45 పేజీలతో కూడిన ఆర్డర్ కాపీలో కవితకు బెయిల్ ఇవ్వడానికి గల మెరిట్స్ ఏమీ లేవన్నారు. ఇడి కేసులో ప్రధానంగా సిఎం వైఎస్ జగన్‌కు సంబంధించిన ఆర్థిక నేరాల కేసులో సుప్రీం ఆదేశాలను ప్రస్తావిస్తూ బెయిల్ నిరాకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక నేరాల కేసులో (మనీలాండరింగ్) బెయిల్‌కు సంబంధించి వైఎస్ జగన్ వర్సెస్ సిబిఐ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనలను గుర్తు చేసింది. ఈ సందర్భంగా జగన్ కేసుకు సంబంధించిన షరతులను కోర్టు గుర్తు చేసింది. 'నేరారోపణల స్వభావం, వాటికి సంబంధించిన సాక్ష్యాధారాల స్వభావం, నేరారోపణలు నిరూపణైతే పడే శిక్ష తీవ్రత, నిందితుడి స్వభావం, నిందితుడి పలుకుబడి' ఆదేశాలను ఆర్డర్ కాపీలో పొందుపరిచింది. ఇందుకు విరుద్ధంగా కవితపై ఆరోపణలు ఉన్నాయని స్పష్టం చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థల వాదనలతో ఏకీభవిస్తూ కవిత దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ పిటిషన్లను కొట్టేస్తున్నట్లు వెల్లడించారు.

పోలవరం ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారు?

- కేంద్రంతో పోరాడాల్సింది పోయి ప్రజల మీద సెస్ విధిస్తారా..
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని మాజీ మంత్రి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రశ్నించారు. కేంద్రంతో పోరాడి డబ్బులు తేవాల్సింది పోయి ప్రజల మీద సెస్ విధించి పోలవరం పూర్తి చేస్తామని పవన్ కల్యాణ్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఏలూరులోని స్ఫూర్తి భవన్‌లో ఇండియా వేదిక అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సిపిఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నా, రాష్ట్రానికి మేలు జరగాలన్నా కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో దానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ సర్కారు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెడుతోందని వివరించారు. రాష్ట్రంలో చంద్రబాబు వికసిత ఆంధ్రప్రదేశ్ రావాలంటే ఎన్‌డిఎ కూటమిని గెలిపించాలని చెబుతున్నారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇస్తామని మోడీతో ప్రకటన చేయించగలరా? అని ఆయన ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తామని, అమ్మలేకపోతే మూసేస్తామని కేంద్ర మంత్రులు బహిరంగంగా ప్రకటన చేస్తున్నప్పటికీ రాష్ట్రంలో చంద్రబాబుగానీ, జగన్‌గానీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు తన నెత్తిన వేసుకుని.. పునరావాసం, భూసేకరణ ఖర్చు రాష్ట్రమే భరించాలని కేంద్రం చెప్పే స్థితికి తీసుకువచ్చారని అన్నారు. పోలవరం పూర్తి చేస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించిందని, ప్రత్యేక హోదాపై రెండవ సంతకం చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి కెఎల్.రావు కుమారుడు కె.విజయరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనాలోచితంగా తీసుకున్న నోట్ల రద్దు, జిఎస్‌టి నిర్ణయాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కూలిపోయిందని, 45 శాతం సూక్ష్మ పరిశ్రమలు మూతపడ్డాయని, లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను మోడీ వద్ద తాకట్టుపెట్టిన పొత్తు, తొత్తు పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిపిఐ ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.ఝాన్సీ, భారత్ బచావో నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం నగర కార్యదర్శి పి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మస్కా పథకం 'మోడీ గ్యారెంటీ'

- ఏజెన్సీలో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : వి. శ్రీనివాసరావు
- రాజవొమ్మంగిలో బహిరంగ సభ, ర్యాలీ


రాజవొమ్మంగిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, ఇండియా బ్లాక్ నేతలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి / రంపచోడవరం విలేకరులు (అల్లూరి జిల్లా)

ఇంటింటికీ మస్కా పథకం మోడీ గ్యారంటీ అని, ప్రజలను మోసం చేస్తున్న బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడిస్తేనే ప్రజలకు రక్షణ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీలను మళ్లీ గెలిపిస్తే ఎపికి ప్రత్యేక హోదా రాదని అన్నారు. పేద ప్రజలు, కార్మికులు, గిరిజనులు హక్కులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ సోమవారం రాజవొమ్మంగి నూకాలమ్మ గుడి సమీపంలో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సిపిఎం అభ్యర్థులు గెలిస్తే అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రజల గళం వినిపిస్తారన్నారు. మోడీకి జగన్, బాబు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. గడిచిన పదేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమైనా ఉంటే చెప్పాలని సవాలు విసిరారు. ప్రజలకు ఏమీ చేయకుండా ఇప్పుడు దేవుడు పేరు చెప్పి ఓట్లు అడిగే పరిస్థితికి బిజెపి ప్రభుత్వం వచ్చిందన్నారు. ప్రజల మధ్య కుల, మత చిచ్చుపెట్టి దేశంలోని విలువైన సంపదలను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకు కుట్రలు సాగుతున్నాయని విమర్శించారు. ప్రజల భూములను లాక్కునేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను మోడీ ప్రభుత్వం ప్రవేశపెడితే దానికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు అసెంబ్లీలో బల్లలు గుద్ది తలలూపిన విషయాన్ని గుర్తుచేశారు. టిడిపి గెలిస్తే రాష్ట్రంలో 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తానని చెబుతున్న లోకేష్.. ఏ విధంగా ఇస్తారన్న ప్రణాళికను మాత్రం ప్రకటించడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, వైసిపిలను గెలిపిస్తే పరిపాలన ఇక్కడ గెలిచిన ముఖ్యమంత్రి చేయరని, ఢిల్లీ నుంచి బిజెపి పెద్దలు చేస్తారని, ఇక్కడి వారు కేవలం రబ్బర్ స్టాంపులుగానే ఉంటారని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వైసిపి, టిడిపి, బిజెపి అభ్యర్థులు గెలిస్తే జరిగే నష్టాన్ని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిపిఎం గెలిస్తే ఈ ప్రాంత పేదలు, గిరిజనుల పక్షాన నిలుస్తుందన్నారు. సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందకపోవడానికి పాలకులే కారణమన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్ మహ్మద్ ఆలీ మాట్లాడుతూ.. సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వారినే గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్.సతీష్, జర్తా లక్ష్మి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు. బహిరంగ సభకు ముందు రాజవొమ్మంగి పురవీధుల్లో ఇండియా బ్లాక్ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కన్యాకుమారి బీచ్‌లో మునిగి
ఐదుగురు వైద్య విద్యార్థులు మృతి
మృతుల్లో ఎపి విద్యార్థి

కన్యాకుమారి : తమిళనాడులోని కన్యాకుమారిలో సోమ వారం ఒక బీచ్‌లో మునిగి పోయి ఐదుగురు వైద్య విద్యార్థులు మరణించారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 24 ఏళ్ల విద్యార్థి వెంకటేష్ ఉన్నారు. ఎస్ఆర్ఎం మెడికల్ కాలేజీ హాస్పటల్, త్రిచీ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ హాస్పటల్‌కు చెందిన విద్యార్థులు ఒక వివాహ వేడుకలో పాల్గొనడం కోసం ఆదివారం కన్యాకుమారికి వచ్చారు. తరువాత సోమవారం వీరంతా కొన్ని కొన్ని గ్రూపులుగా వీడిపోయి కన్యాకుమారి చూడ్డానికి వెళ్లారు. వీరిలో కొంత మంది లీమూర్ బీచ్‌కు వద్దకు వెళ్లారు. ఈ బీచ్‌ను సముద్రం అల్లకల్లోంగా ఉన్న కారణంగా అప్పటికే మూసివేశారు. అయినా విద్యార్థులు ఒక కొబ్బరి తోట గుండా బీచ్‌లోకి అక్రమంగా ప్రవేశించారు. స్నానం చేస్తూ మునిగిపోయి ఐదుగురు మరణించారు. మృతి చెందిన ఐదుగురు వైద్య కోర్సు చివరి ఏడాదిలో ఉన్నారు. మరికొన్ని వారాల్లో వీరి కోర్సు పూర్తి కానుంది. మృతుల్ని వెంకటేష్‌తో పాటు, కన్యాకుమారి జిల్లాకు చెందిన పి సర్వదర్షిత (23), దిండిగల్ జిల్లాకు ఎం ప్రవీణ్ సామ్ (23), బి. గాయత్రి (25) (నెయ్వేలి), డి.చరుకవి (23) (తంజావూర్)గా గుర్తించారు.

ఢిల్లీ తరహాలోనే అహ్మదాబాద్‌లోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లోని ఆరు పాఠశాలలకు సోమ వారం బాంబు బెదిరింపుల వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాలల యాజమాన్యం పోలీసులకు సమాచారమిచ్చారు. బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్, క్రైమ్ బ్రాంచ్ బృందాలతో పాటు పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుజరాత్‌లోని 25 లోక్‌సభ స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. అహ్మదాబాద్‌లోని కొన్ని పాఠశాలలకు బాంబు పేలుళ్ల బెదిరింపు ఇమెయిల్స్ వచ్చాయి. ఇప్పటి వరకు ఆరు పాఠశాలలకు ఇటువంటి ఇమెయిల్స్ వచ్చాయని, ఢిల్లీలోని పాఠశాలలకు కొన్ని రోజుల క్రితం వచ్చిన బాంబు బెదిరింపుల తరహాలోనే ఇవి కూడా ఉన్నట్లు తెలుస్తోందని సైబర్ క్రైమ్ బ్రాంచ్ డిసిపి లవీనా సిన్హా పేర్కొన్నారు. ఈ ఇమెయిల్స్ భారతదేశం వెలుపల నుండి వచ్చాయని అన్నారు. మే 1న ఢిల్లీ, నొయిడాల్లోని సుమారు 100 పాఠశాలలకు ఇమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే.

కీలకాంశాలపై మౌనం

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు తీసుకువెళ్లలేకపోయిందన్నారు. విశాఖ రైల్వే జోన్‌ను మంజూరు చేసినా కార్యాలయానికి వైసిపి ప్రభుత్వం భూమి ఇవ్వలేదని విమర్శించారు. పేదలకు ఇచ్చిన 21 లక్షల ఇళ్లలో సగం కూడా పూర్తి చేయలేదన్నారు. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని 'ఆయన వారసుడు' పూర్తి చేయలేకపోయారని అన్నారు. ఉగ్గినపాలెం సభలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక తొలి సంతకం మెగా డిఎస్‌సిపైనా, రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనా చేస్తామన్నారు. వేమగిరి సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కేంద్ర పథకాలకు వైసిపి సర్కారు తన పథకాలుగా ప్రచారం చేసుకుంటోందన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కేంద్రంలో ఎన్‌డిఎ సహకారంతో 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఆలస్యంగా ప్రసంగం

వేమగిరి సభకు మధ్యాహ్నం రెండు గంటల వరకూ జనం రాకపోవడంతో సభా ప్రాంగణం ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో, షెడ్యూల్ ప్రకారం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రధాని ప్రసంగం గంట ఆలస్యంగా నాలుగు గంటలకు మొదలైంది. భద్రతా కారణాల రీత్యా వాటర్ బాటిళ్లను కూడా సభా ప్రాంగణంలోకి అనుమతించకపోవడంతో, సభకు వచ్చిన వారు తాగునీటి కోసం అల్లాడారు.

సూర్యకుమార్ యాదవ్ సెంచరీ

సన్‌రైజర్స్ ఏడు వికెట్ల తేడాతో ముంబయి ఘన విజయం



ముంబయి: మిస్టర్ 360డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ సెంచరీతో కదం తొక్కి ముంబయి జట్టును ఒంటిచేత్తో గెలిచిపించాడు. వాంఖడే వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 173పరుగులు చేయగా.. ఛేదనలో ముంబయి జట్టు 17.2ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి 174పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్(102నాటౌట్; 51బంతుల్లో 12ఫోర్లు, 6సిక్సర్లు) మ్యాచ్‌ను ముగించాడు. ఛేదనలో భాగంగా ముంబయి జట్టు టాపార్డర్ బ్యాటర్లు ఇషాన్ కిషన్(9), రోహిత్ శర్మ(4), నమన్ ధీర్(0) సింగిల్ డిజిట్‌కే పెవీలియన్‌కు చేరారు. దీంతో ముంబయి జట్టు 31పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సూర్యకుమార్ సెంచరీకి తోడు తిలక్ వర్మ(37నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్‌కు లభించింది. టాస్ గెలిచిన హార్దిక్ పాండ్యా హైదరాబాద్‌కు బ్యాటింగ్ ఇవ్వగానే ఫ్యాన్స్ ఎగిరి గంతేశారు. ఐపిఎల్ రికార్డులు బద్దలవ్వడం ఖాయమనుకున్నారంతా. కానీ, అభిమానులు అనుకున్నదొకటి అయిందొకటి. పవర్ ప్లేలో ఓపెనర్ అభిషేక్ శర్మ(11)ను బుమ్రా ఔట్ చేయగా.. మర్కరమ్ స్థానంలో వచ్చిన మయాంక్ అగర్వాల్(5)ను కంబోజీ బౌల్డ్ చేశాడు. అక్కడితో హైదరాబాద్ స్కోర్ వేగం తగ్గింది. ఆ తర్వాత ట్రావిస్ హెడ్(48), నితీశ్ కుమార్(20)లు ధాటిగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ పాండ్యా ఈ జోడీని విడదీసి స్కోర్‌బోర్డుకు బ్రేకులు వేశాడు. కాసేపటికే పీయుష్ చావ్లా డేంజరస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్(2)లనున బోల్తా కొట్టించడంతో వంద లోపే ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. షహ్‌బాజ్ అహ్మద్(10), మార్కో జాన్‌సెన్(17)లు జట్టు స్కోర్ వంద దాటించారు. అయితే.. పాండ్యా ఒకే ఓవర్లో ఈ ఇద్దరిని వెనక్కి పంపి.. ఆరెంజ్ ఆర్మీ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. కానీ, కెప్టెన్ కమిన్స్(35 నాటౌట్), ఇంప్యాక్ట్ ప్లేయర్ సన్వీర్ సింగ్(8 నాటౌట్)లు పట్టుదలగా పోరాడి 9వ వికెట్‌కు రన్స్ జోడించారు. తుషార వేసిన 20వ ఓవర్లో కమిన్స్ సిక్సర్, ఫోర్ బాదాడు. దీంతో హైదరాబాద్ 8 వికెట్ల నష్టానికి 173 రన్స్ చేయలగలిగింది. ముంబై బౌలర్లలో హార్దిక్ పాండ్యా(3/31) పీయూష్ చావ్లా(3/33)లు రాణించారు.

స్కోర్‌బోర్డు...

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి)తిలక్ వర్మ (బి)చావ్లా 48, అభిషేక్ శర్మ (సి)ఇషాన్ కిషన్ (బి)బుమ్రా 11, మయాంక్ అగర్వాల్ (బి)అన్షుల్ కంబోజ్ 5, నితీశ్ రెడ్డి (సి)కంబోజ్ (బి)హార్దిక్ పాండ్యా 20, క్లాసెన్ (బి)చావ్లా 2, జెన్సన్ (బి)హార్దిక్ పాండ్యా 17, షాబాజ్ అహ్మద్ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ పాండ్యా 10, అబ్దుల్ సమద్ (ఎల్‌బి)చావ్లా 3, కమిన్స్ (నాటౌట్) 35, సన్వీర్ సింగ్ (నాటౌట్) 8, అదనం 14. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 173పరుగులు. **వికెట్ల పతనం:** 1/56, 2/68, 3/90, 4/92, 5/98, 6/120, 7/124, 8/136

బౌలింగ్: తుషారా 4-0-42-0, కంబోజ్ 4-0-42-1, బుమ్రా 4-0-23-1, హార్దిక్ పాండ్యా 4-0-31-3, చావ్లా 4-0-33-3.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి)మయాంక్ అగర్వాల్ (బి)జెన్సన్ 9, రోహిత్ శర్మమ (సి)క్లాసెన్ (బి)కమిన్స్ 4, నమన్ ధీర్ (సి)జెన్సన్ (బి)భువనేశ్వర్ కుమార్ 0, సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 102, తిలక్ వర్మ (నాటౌట్) 37, అదనం 22. (17.2 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 174పరుగులు.

వికెట్ల పతనం: 1/26, 2/31, 3/31

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4-1-22-1, జెన్సన్ 3-0-45-1, కమిన్స్ 4-1-35-1, నటరాజన్ 3.2-0-31-0, నితీశ్ రెడ్డి 2-0-16-0, షాబాజ్ అహ్మద్ 1-0-11-0



ఉత్తర కర్ణాటకలో
కాంగ్రెస్, బిజెపి మధ్యే ప్రధాన పోటీ
14 లోక్‌సభ స్థానాలకు నేడు పోలింగ్

బెంగళూరు: మంగళవారం పోలింగ్ జరగనున్న ఉత్తర కర్ణాటకలోని 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్, బిజెపి ముఖాముఖి తలపడుతున్నాయి. ఇక్కడ 2019 నాటి ఫలితాలను పునరావృతం చేయాలని బిజెపి, ఈ సారి ఎలాగైనా దీనిని బ్రేక్ చేసి తన సత్తాను తిరిగి చాటుకోవాలని కాంగ్రెస్ యత్నిస్తున్నాయి. సాంప్రదాయకంగా కాంగ్రెస్‌కు గట్టి పట్టు ఉన్న కల్యాణ్ కర్ణాటక (ఈశాన్య ప్రాంతం)లో గత సారి కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు. ఈసారి తన సత్తా చాటేందుకు కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతోంది. బిజెపి మిత్ర పక్షంగా ఉన్న జెడి(ఎస్)కి ఈ ప్రాంతంలో అంతగా బలం లేకపోవడంతో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా కేటాయించలేదు.ఎన్నికల ప్రచారం విషయానికి వస్తే హుబ్బళ్లిలో ముస్లిం క్లాస్‌మేట్ చేతిలో హిందూ బాలిక నేహ హీర్‌మత్ హత్యను బిజెపి పదే పదే ప్రస్తావించడం ద్వారా మతపరమైన చీలిక తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. ఇటువంటి క్షుద్ర రాజకీయాలను అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రయోగించి తలబొప్పి కట్టించుకుంది. అయినా, హిందూత్వను రెచ్చగొట్టడం మానలేదు. బిజెపి తరపున స్టార్ క్యాంపెయినర్లుగా మోడీ, అమిత్ షా ద్వయం విస్తృతంగా ప్రచారం చేశారు. వారసత్వపు పన్ను గురించి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో లేకపోయినా, ఆ పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్యను పట్టుకుని బిజెపి నానా యాగీ చేసింది. మరోవైపు కాంగ్రెస్ కర్ణాటకలో సిద్ద రామయ్య ప్రభుత్వం అమలులో పెట్టిన అయిదు గ్యారెంటీలపై ప్రధానంగా కేంద్రీకరించింది. అలాగే ప్రజ్వల రేవణ్ణ సెక్స్ స్కామ్ గురించి తెలిసి కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరచడం ద్వారా బిజెపికి మహిళల పట్ల ఉన్న గౌరవం ఏపాటిదో అర్థమవుతోందంటూ విమర్శనాస్త్రాలు సంధించింది.

ప్రచారం పేరుతో ఓట్ల కొనుగోలు

- ఓటుకు రూ.వెయ్యి చొప్పున అందిస్తూ గాలం
- 'పోలవరం'లో యథేచ్ఛగా ఓట్ల కొనుగోలు
- పోస్టల్ బ్యాలెట్‌కు రూ.1500 నుంచి రూ.2 వేలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థులు బరి తెగించారు. నోట్ల కట్టలు కుమ్మరిస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఇప్పటి నుంచే ప్రలోభాలు ప్రారంభించేశారు. గతంలో ఎన్నికల ముందు రోజు జరిగే నగదు పంపిణీ ఈసారి వారం రోజుల ముందుగానే ప్రారంభమైన పరిస్థితి ఉంది. ఇంటింటికీ ప్రచారం పేరుతో నగదు పంపిణీ జరిగిపోతుంది. దీనికోసం స్థానికులను కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులను ఉపయోగిస్తున్నట్లు జనం చెబుతున్నారు. పోలవరం నియోజకవర్గంలో ఓటుకు రూ.వెయ్యి చొప్పున అధికార పార్టీ యథేచ్ఛగా పంపిణీ సాగిపోతుంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం డబ్బు పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులిద్దరూ ఒక అవగాహనకు వచ్చి ఓటుకు ఎంత పంపిణీ చేయాలో నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇరువురు ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేయాలని కొన్నిచోట్ల, ఓటుకు రూ.500 చొప్పున ఇవ్వాలని మరికొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులిద్దరూ ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. ఓట్ల కొనుగోలును అడ్డుకునేందుకు అధికారులు కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించడం లేదు. నగదు పంపిణీని అడ్డుకునేందుకు అధికారులు ఎటువంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మినహాయిస్తే ఓటర్లకు నగదు పంపిణీ జరగకుండా కనీస చర్యలు తీసుకుంటున్న పరిస్థితి ఎక్కడా లేదు. ఓటర్లకు నగదు పంపిణీ చేసి ఓట్లు కొనుగోలు చేయడం సర్వసాధారణం అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో తమ గుర్తు తెలిసేలా ప్రతి ఓటరుకూ గాజు గ్లాసు అందిస్తున్న పరిస్థితి ఉంది. డ్వాక్రా సంఘాలను పిలిపించి ఒక్కో గ్రూపునకు పెద్దఎత్తున తాయిలాలు ఎర చూపుతున్న పరిస్థితి అన్ని నియోజకవర్గాల్లోనూ యథేచ్ఛగా సాగిపోతుంది. పోస్టల్ బ్యాలెట్‌కు ఏలూరు నియోజకవర్గంలో రూ.1500 వరకూ నగదు పంపిణీ చేయగా, పశ్చిమగోదావరి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో రూ.రెండు వేలు వరకూ ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటి నుంచే నగదు పంపిణీ చేస్తున్న నాయకులు ఎన్నికల ముందు ప్రతిపక్షాలు పంపిణీ చేసిన నగదును బట్టి మరోసారి ఇవ్వాలని ప్రణాళికలు సైతం రూపొందించుకున్నట్లు తెలిసింది.

రూ.కోట్లు కుమ్మరింపు

ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపు కోసం రూ.కోట్లు కుమ్మరించేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతి నియోజకవర్గంలోనూ రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేసినా రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్లు వరకూ పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఓటుకు రూ.రెండు వేలు ఇస్తే రూ.40 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇక మద్యం ఏరులై పారిస్తున్నారు. ఇంకా తాయిలాల పేరుతో బహుమతులు అందిస్తున్నారు. స్థానిక నాయకులను తమవైపు తిప్పుకునేందుకు రూ.లక్షలు ఎర వేశారు. ప్రచారంలో పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులంతా రూ.కోట్లు కుమ్మరించేస్తున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. నగదు ప్రవాహాన్ని అడ్డుకునేందుకు ఎక్కడా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాల్లేకుండాపోయాయి. అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవు తున్నారు. రూ.కోట్లు కుమ్మరిస్తున్న నాయకులు గెలిచిన తర్వాత ప్రజలకు సేవచేస్తారా.. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారతారో ఆలోచించాల్సిన బాధ్యత ఓటర్లపై ఉంది.

గంగవరం పోర్టు యాజమాన్యంతో చర్చలు విఫలం
సమ్మె కొనసాగిస్తామన్న కార్మికులు

ప్రజాశక్తి - గాజువాక

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం, కార్మికులు మధ్య సోమవారం మధ్యాహ్నం పోర్టు లోపల జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికులు లేవలెత్తిన పలు డిమాండ్లకు స్థానిక అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం సమ్మతి తెలపలేదు. అహ్మదాబాద్‌లోని తమ ఉన్నత యాజమాన్యంతో మాట్లాడి చెబుతామని పేర్కొంటూ రెండు, మూడు రోజులు సమయం కావాలని స్థానిక యాజమాన్యం చెప్పింది. దీనిపై కార్మికులు స్పందిస్తూ డిమాండ్లను నెరవేరిస్తేనే తాము సమ్మెను విరమిస్తామని తెగేసి చెప్పారు. రూ.36 వేల జీతంతో పాటు, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఇతర సమస్యలనూ ప్రస్తావించారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో సమ్మెను కొనసాగిస్తామన్నారు.చర్చల్లో పోర్టు యాజమాన్యం తరపున హెచ్‌ఆర్ సిఎస్ రాజు, కార్మికుల తరపున గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులుఅప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్తయ్య, నోళ్లి తాతారావు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా): ఎన్నికల దృష్ట్యా అల్లూరి జిల్లాలో ఉన్న పలు ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోక లను నిషేధించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి ఎం.విజయ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న పోలింగ్ నిర్వహించుటకు, సిబ్బంది, సామాగ్రి తరలించడానికి ఘాట్ రోడ్లలో ఏ విధమైన అంతరాయం రాకుండా ఈనెల 10 నుండి 14 వరకు పాడేరు ఘాట్, లంబసింగి ఘాట్, మారేడుమిల్లి-భద్రాచలం ఘాట్) రోడ్ల పై భారీ వాహనాలు నిషేధించామన్నారు.

ట్రిపుల్‌ఐటిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్‌ఐటిలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల నిమిత్తం సోమవారం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పదో తరగతి ఫలితాలు వచ్చినప్పటి నుంచి విద్యార్థులు ట్రిపుల్‌ఐటి నోటిఫికేషన్ విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. నోటిఫికేషన్ సకాలంలో అధికారులు విడుదల చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రిపుల్‌ఐటి కళాశాలలో దరఖాస్తు కోసం విద్యార్థులు గుర్తింపు పొందిన బోర్డు నుండి పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ట్రిపుల్‌ఐటిలో సీటు రావాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. సీట్లు కేటాయింపులో ఏపి విద్యార్థులకు 85 శాతం వాటా కల్పిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రిపుల్‌ఐటి విద్యార్థులకు రెండేళ్ల పియూసితోపాటు,



నాలుగేళ్ల బీటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్సును బోధిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడులో ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లున్నాయి. వీటిల్లో 4,400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటికి 1100 ప్రకారం సీట్లు ఉన్నాయి. వైఎస్ఆర్ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంజనీరింగ్ వృత్తి విద్యా కోర్సులు చదవాలనే ఆశయంతో ట్రిపుల్‌ఐటిలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది వీలైనంత తొందరగా ప్రవేశాల ప్రక్రియ ముగించి, జులై నాటికి తరగతులు ప్రారంభించా లని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

జూన్ 4తో బిజెడి ప్రభుత్వ గడువు ముగుస్తుంది : మోడీ

భువనేశ్వర్ : రానున్న జూన్ 4తో బిజు జనతాదళ్ (బిజెడి) ప్రభుత్వం గడువు తేదీ ముగుస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. సోమవారం ఆయన బెర్హాంపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాగ్రెస్, బిజెడి నేతలు ఒడిశాను దోచుకున్నారని, ధనిక రాష్ట్రం, పేద ప్రజల తరహాగా మార్చారని అన్నారు. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కారణంగా ఒడిశాలో ఖనిజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ప్రజలు మాత్రం పేదరికంలోనే ఉన్నారని అన్నారు. ఈ పాపాన్ని క్షమించరని, ప్రస్తుత పాలక ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

పాక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో 2020లో నమోదైన పాక్సో కేసులో నిందితుడుకు 20ఏళ్ల జైలు, రూ.2500 జరిమానా విధించినట్లు రూరల్ సిఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ద్వారపూడి గ్రామానికి చెందిన నిందితుడు కళ్లేపల్లి అప్పారావు (61)కు ప్రత్యేక పాక్సో న్యాయమూర్తి కె.నాగమణి ఈ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లుగా తెలిపారు. నిందితుడు అప్పారావు ఐదు సంవత్సరాల బాలికపై లైంగిక చర్యకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో 2020 జనవరిలో పాక్సో చట్టం ప్రకారం అప్పటి ఎస్ఐ ప్రసన్న కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి విజయనగరం ఎస్‌సి, ఎస్‌టి సెల్ 1 డిఎస్‌పి బి.మోహనరావు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారు. నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పాక్సో కోర్టు కె. నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు.

'మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు'

ప్రజాశక్తి-అనంతపురం

'మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు.. 25ఏళ్లుగా మా కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే వారికే మా ఓట్లు..' అంటూ అనంతపురం లెక్చరర్స్ కాలనీలో ఉన్న తన ఇంటికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కోశాధికారి టి.వి.రెడ్డి ఫ్లెక్సీ అతికించారు. ఈపోస్టర్‌ను కాలనీ అధ్యక్షులు, విశ్రాంత ఆర్‌ఐఒ కిష్టప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోసం వస్తున్న అభ్యర్థులను సమస్యలపై ప్రతి కుటుంబం ప్రశ్నిస్తే ఏ సమస్య అయినా త్వరితగతిన పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టివి.రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు కాలనీ ఉపాధ్యక్షులు పి.సురేష్, సహాయ కార్యదర్శి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

8న ఎపిఇసెట్

- 37,767 మంది విద్యార్థుల దరఖాస్తు
- రాష్ట్రంలో 93, హైదరాబాద్‌లో రెండు పరీక్షా కేంద్రాలు : జివిఆర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అధ్వర్యంలో అనంతపురం జెఎన్‌టియు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపిఈసెట్-2024 పరీక్ష ఈనెల 8న ఉదయం సెషన్ తొమ్మిది గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు, మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియు ఉపకులపతి, ఎపిఈసెట్ ఛైర్మన్ జివిఆర్.శ్రీనివాసరావు, కన్వీనర్ పిఆర్.భాను మూర్తి తెలిపారు.

ఎపిఈసెట్ -2024 పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ గడువు మే 2వ తేదీన ముగిసిందన్నారు. మొత్తం 37,767 దరఖాస్తులు అందాయన్నారు. పరీక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 93, హైదరాబాద్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

పరీక్ష రాసే అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యం అయినా కేంద్రంలోకి అనుమతి ఉండదన్నారు. ఎన్నికల నేపథ్యంలో సభలు, సమావేశాలు ఉంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలను గుర్తించి పరీక్షకు ఆలస్యం కాకుండా ముందుగానే కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులూ కేంద్రంలోకి అనుమతి లేదన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో ఉమర్ అన్సారీకి బెయిల్

న్యూఢిల్లీ : రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్ ముక్తార్ అన్సారీ కుమారుడు ఉమర్ అన్సారీకి సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ హృషికేష్ రాయ్, పి.కె. మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టుకు హాజరు కావాలని ఉమర్‌ను కోరారు.2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో ఉమర్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) మౌ సదర్ స్థానానికి పోటీ చేస్తున్న అబ్బాస్ అన్సారీ, ఉమర్ అన్సారీ సహా 150 మంది గుర్తుతెలియని వ్యక్తులపై అదే ఏడాది మార్చి 4న కొట్వాలి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. జనవరి 25న, ఈ కేసులో అరెస్టునుండి సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. గతేడాది డిసెంబర్ 19న అలహాబాద్ హైకోర్టు అన్సారీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. వాస్తవాలు, పరిస్థితులను పరిశీలిస్తే.. నేరం వెలుగులోకి వస్తుందని పేర్కొంది. జైలు శిక్ష అనుభవిస్తున్న ముక్తార్ అన్సారీ ఉత్తరప్రదేశ్‌లోని ఆస్పత్రిలో మార్చి 28న గుండెపోటుతో మరణించారు.

ఇడి సోదాల్లో భారీగా నగదు

రాంచీ : జార్ఖండ్ రాజధాని రాంచీలోని పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం సోదాలు జరిపింది. 2003లో అరెస్టయిన జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసిన మాజీ చీఫ్ ఇంజనీర్ వీరేంద్ర రామ్‌కి చెందిన 12కి పైగా ప్రాంతాల్లో సోదాలు జరిపింది. ఈ క్రమంలోనే గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి అలంఘీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్‌కు సహాయకుడికి చెందినదిగా భావిస్తోన్న ఇంట్లో నోట్ల గుట్టలు దర్శనమిచ్చాయి. ఈ నగదు రూ.25 కోట్ల వరకు ఉండవచ్చని ఇడి పేర్కొంది. రాంచీలోని సెయిల్ సిటీతో సహా తొమ్మిది ప్రాంతాల్లో దర్యాప్తు సంస్థ ఏకకాలంలో దాడులు నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం రహదారుల నిర్మాణ విభాగానికి చెందిన ఇంజనీర్ వికాస్ కుమార్ ఆచూకీ కోసం ఇడి బృందం సెయిల్ సిటీలో గాలిస్తోంది. మరో ఇడి బృందం బరియాతు, మోరబాది, బోడియా ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తోంది. పలు ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలకు పాల్పడ్డారని, రూ.100 కోట్ల మేర నగదును వీరేంద్ర అక్రమంగా కూడబెట్టారని ఇడి ఆరోపిస్తోంది. ఈ సమాచారం ఆధారంగానే సోదాలు జరుపుతున్నట్లు సమాచారం.

క్రిటికల్ కంపెనీకి 100కోట్లు

- ల్యాండ్ టైటిల్ ముసుగులో అప్పగింత
- టిడిపి నేత విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముసుగులో క్రిటికల్ రివర్ కంపెనీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.100కోట్లకు పైగా దోచిపెట్టారని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూపత్రాలు డిజిటలైజ్ చేసి భద్రపరిచే కాంట్రాక్టు తమకే ఇచ్చారని క్రిటికల్ రివర్ సంస్థ బహిరంగ ప్రకటన చేసే వరకు ప్రభుత్వం ఎందుకు దాచిపెట్టిందని ప్రశ్నించారు. ఉచితంగా సాఫ్ట్‌వేర్ ఇస్తామని చెప్పిన భారత ప్రభుత్వ సంస్థ ఎన్‌ఐసీని కాదని అన్‌లిస్టెడ్ ప్రైవేట్ కంపెనీకి ఎందుకు ఇచ్చారని నిలదీశారు.

టైటిలింగ్ యాక్ట్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి మూడు సార్లు కేంద్రం ఆమోదానికి పంపింది వైసిపి ప్రభుత్వమేనని టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ బిల్లు ఆశయాలు గొప్పవని తమ పార్టీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారని, అందులో తప్పేముందని అన్నారు. జగన్ హయాంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి నీర్వర్యమయిందని టిడిపి రాష్ట్రవాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్ విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యమని అన్నారు.

విట్ పరీక్షల తేదీలు మార్చాలి

తమిళనాడు, అమరావతిలోని విట్ యూనివర్సిటీ విద్యార్థులకు ఈ నెల 14వ తేదిన జరగనున్న పరీక్షల తేదీలను మార్చాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను టిడిపి నేతలు కోరారు. మీనాను సచివాలయం లో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 13వ తేదిన ఓటు వేసి తిరిగి 14వ తేదిన పరీక్షలకు హాజరుకావడం సులభంకాదని తెలిపారు. చిలక లూరిపేటలో పోస్టల్ బ్యాలెట్‌కు పేపర్లు ఇవ్వకుండా ఇఎంను ఉపయోగిం చిన తాహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు వర్ల రామయ్య, ఏఎస్ రామకృష్ణ, మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బుచ్చి రాంప్రసాద్, అఖిల్, మన్నవ సుబ్బారావు, బండారు వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు కర్ణాటక తుది విడత ఎన్నికలు

షఫీవుల్లా

లోక్‌సభ మూడవ విడత ఎన్నికలు కర్నాటకలో మంగళవారం జరగనున్నాయి. ఉత్తర కర్నాటకలోని 14 లోక్‌సభ స్థానాలకు నేడు ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ మొత్తం 28 లోక్‌సభ స్థానాలుండగా ఏప్రిల్ 26వ తేదీన దక్షిణ కర్నాటకలోని 14 లోక్‌సభ స్థానలకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఉత్తర కర్నాటకలోని 14 లోక్‌సభ స్థానాలకు నేడు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం సాయంత్రంతో ప్రచారాలు ముగిశాయి. పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికలు జరుగుతున్న 14 స్థానాల్లోనూ మొత్తం 227 మంది అభ్యర్థులు పోటీలో లోక్‌సభ స్థానాల్లో ముఖ్యనేతలుండటంతో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సొంత నియోజకవర్గం కల్‌బుర్గి ఈ విడతలోనే ఎన్నికలు జరుగుతండగా, హావేరీలో మాజీ ముఖ్యమంత్రి బిజెపి నాయకులు బసవరాజు బొమ్మై బరిలోనున్నారు. షిమోగాలో మరో బిజెపి మాజీ ముఖ్యమంత్రి కుమారుడు రాఘవేంద్ర బరిలోనున్నారు. ఈయనకు వ్యతిరేకంగా బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరప్ప బరిలో ఉన్నారు. ధార్వాడ్ నుంచి మాజీ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి బరిలోనున్నారు. ఇలా ముఖ్యమైన నాయకులు మూడవ విడతలో



ఉన్నారు. ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉండనుంది. బిజెపి, జెడిఎస్ మిత్రపక్షంగా పోటీ చేస్తున్నప్పటికీ మూడవ విడత ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో బిజెపి ఒక్కటే పోటీలో ఉంది. 14 లోక్‌సభ స్థానాలకు కలిపి మొత్తం 2,59,52,958 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,29,48,978 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 1,29,66,580 మంది, ట్రాన్సు జెండర్లు 1935 మంది, 35,465 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. వీరందరూ నేడు జరగబోయే ఓటింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

ఎన్నికలు జరుగుతున్న నియోజకవర్గాలు

మూడో విడత ఎన్నికలకు సంబంధించి ఉత్తర కర్నాటక ప్రాంతంలోని చిక్కోడి, బెల్గాం, బాగల్‌కోట్, బీజాపూర్, కల్‌బుర్గి, రాయచూర్, బీదర్ కొప్పల్, బళ్లారి, హవేరీ, ధార్వాడ్, ఉత్తర కన్నడ, దావణగెరె, షిమోగా, లోక్‌సభ స్థానాలున్నాయి. మూడవ విడతలో జరుగుతున్న ఈ బరిలోనుండటంతో ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఈసారి బిజెపికి ఎదురుగాలే..

ఉత్తర కర్నాటక బిజెపికి మంచిపట్టున్న ప్రాంతంగా చెప్పుకునేవారు. 2019లో ఉత్తర కర్నాటకలోని 14 లోక్‌సభ స్థానాలను కూడా బిజెపి కైవసం చేసుకుంది. ఈసారి బిజెపికి అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. గతంలో బిజెపికి అనుకూలంగానున్న లింగాయత్ సామాజికవర్గం ఈసారి వారి మద్దతు పెద్దగా ఉండే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీనికితోడు బిజెపి మిత్రపక్షంగానున్న జెడిఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ కుంభకోణం బయటకు రావడం బిజెపికి పూర్తి స్థాయిలో నష్టాన్ని చేకూరుస్తుందన్న అంచనాలు ఉన్నాయి. ఇకపోతే బిజెపి నేతల మధ్య కూడా సరైన సఖ్యత లేదు. గతంలో ఎన్నడూలేని విధంగా బిజెపి నేతల మధ్య గ్రూపు తగాదాలు ముదిరాయి. దీంతో ఈసారి లోక్‌సభ స్థానాలు అత్యధికం కోల్పోయే అవకాశాలే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఇండియా బ్లాక్‌కే బీహార్‌లో అత్యధిక స్థానాలు

- ఈ ఎన్నికలు పెట్టుబడిదారీ విధానం, ప్రజాస్వామ్యం మధ్య పోరాటం
- నితీష్ కుమార్ సైద్ధాంతిక విధేయతలేని అధికార దాహం ఉన్న వ్యక్తి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి

జె.జగదీష్




బీహార్‌లోని ఖగారియా రైల్వే స్టేషన్ సమీపంలోని సిపిఎం జిల్లా కమిటీ కార్యాలయం ఎన్నికల కమాండ్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది. కింది స్థాయి నాయకులకు, కార్యకర్తలకు తక్షణ సలహాలు, సహాయం అందించేందుకు సీనియర్ నేతలు ఎప్పుడూ ఇక్కడే ఉంటున్నారు. కార్యాలయంలో ఉన్న సిపిఎం బీహార్ రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి బీహార్ ఎన్నికల గురించి 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురించి?

స్వయం ప్రకటిత సోషలిస్టు అయినప్పటికీ సైద్ధాంతిక విధేయత లేని, అధికార దాహం ఉన్న వ్యక్తి. అధికారమే ఆయన ఏకైక రాజకీయ తత్వశాస్త్రం. దాని కోసం ఏ పక్షం అయినా తీసుకుంటారు. 400 సీట్లు గెలుస్తామని ప్రధాని మోడీతో హాజరైన ర్యాలీలో నితీష్ అని నాలుక కరుచుకున్నారు.



తేజస్వియాదవ్



నితీష్ కుమార్

ఖగారియాపై మీ అంచనాలు ఏమిటి?

బీహార్‌లో సిపిఎం పోటీ చేసే ఖగారియాలో స్థానికంగా బాగా ప్రభావం చూపే సంజయ్ కుమార్ ఇండియా ఫోరంకి బలమైన అభ్యర్థి. ఒక వైపు స్థానిక ప్రజా పోరాటాల ముఖం. మరోవైపు నాన్‌లోకల్ అయిన ఎన్‌డిఎ అభ్యర్థి మధ్య పోరు జరుగుతోంది. ఎన్‌డిఎ అభ్యర్థి రాజేష్ వర్మ డబ్బులు వెదజల్లి ఓట్లు కొనే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ఎన్నికలు పెట్టుబడిదారీ విధానానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న సమరం. మోడీ విభజన విధానాలకు ఓటర్లు కూడా సరైన సమాధానం ఇస్తారు.

ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలు?


బీహార్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. ఉపాధి వెతుక్కుంటూ కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు వలసపోతుంటారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మెరుగైన విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడం లేదు. విద్య కోసం విద్యార్థులు ఇతర రాష్ట్రాలపై ఆధారపడుతున్నారు. పంటలకు చట్టబద్ధమైన మద్దతు ధర లేకపోవడం వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ప్రభుత్వ మండీల పనితీరు నిలిచిపోయింది. పెట్టుబడి ఖర్చు భరించలేక రైతులు వ్యవసాయం మానేస్తున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఒక ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన కనీస సేవలు కూడా బీహార్‌లో లేవు. వీటన్నింటికి అద్దం పట్టేలా ఎన్నికల ఫలితం ఉండబోతోంది. రాష్ట్రంలో ఇండియా ఫోరం ఎక్కువ సీట్లు గెలుస్తుంది. మొదటి, రెండో దశల్లో బిజెపికి సానుకూలత లేకపోవడం ఎన్‌డిఎను ఆందోళనకు గురి చేస్తున్నది.

ఇద్దరు మాజీ సిఎంలను రంగంలోకి దించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మక నియోజకవర్గాలైన అమేథీ, రాయ్‌బరేలీకి ఎట్టకేలకు ఇటీవల అభ్యర్థులను ప్రకటించింది. రాయ్‌బరేలీకి రాహుల్, అమేథీకి కిశోరీలాల్ శర్మలను బరిలోకి దింపింది. ఈ నియోజకవర్గాల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల పరిశీలకులుగా ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులను నియమించింది. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపినట్లు కాంగ్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ రెండు నియోజకవర్గాల ప్రచారానికి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ నాయకత్వం వహిస్తున్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఛత్తీసగఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్, రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ వంటి అగ్రనేతల ప్రచార ప్రణాళికలను, షెడ్యూల్‌ను కూడా ప్రియాంక స్వయంగా చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల ఎన్నికల ప్రచారంలో 200 నుంచి 300 గ్రామాలను కవర్ చేస్తూ ప్రియాంక ప్రచారం చేయనున్నట్లు సమాచారం.



అశోక్ గెహ్లాట్



భూపేష్ బాఘేల్

మైదానం నుంచి ఎన్నికల బరిలోకి...

మన దేశంలో మైదానంలో రాజకీయాలు, రాజకీయాల్లో ఆటలు సర్వసాధారణమైపోయాయి. అందుకే కాబోలు చాలామంది ఆటగాళ్లు ఒక దశ దాటిన తరువాత మైదానాన్ని వీడి రాజకీయాల్లోకి దూకుతున్నారు. అయితే రాజకీయాల్లో రాణించడమంటే క్రీడల్లో నెగ్గుకొచ్చినంత తేలిక కాదు అని అనతి కాలంలోనే గ్రహించి కొందరు వెనుదిరిగిన వారున్నారు. ఇంకొందరు పట్టు వీడని విక్రమార్కుల్లా పోరాడుతున్నారు. క్రీడల్లో ప్రత్యర్థి స్పష్టంగా అగుపిస్తాడు. ఆట సరైన రీతిలో సాగేందుకు అందరూ నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిందే. రాజకీయాల్లో అలా కాదు.ఆట ఇలాగే సాగాలన్న కచ్చితమైన నియమాలేవీఉండవు. ప్రత్యర్థి ఎవరో, ఎటు నుంచి ఎవరు వెన్నుపోటు పొడుస్తారో తెలియదు. ఇక్కడ టక్కు టమార విద్యలతో ప్రజలను మభ్య పెట్టే కళలో ఆరితేరినవారు ఉంటారు. ఇన్ని హర్డిల్స్‌ను దాటి రాజకీయాల్లో రాణించినవారు లేకపోలేదు. అటువంటివారిలో కొందరి గురించి తెలుసుకుందాం!

రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్: రాజస్థాన్‌కు చెందిన 53 ఏళ్ల ఈ షూటర్ 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి రజిత పతకం సాధించిపెట్టాడు. ఇండియన్ ఆర్మీ నుంచి రిటైరయిన తరువాత 2013 సెప్టెంబరులో బిజెపిలో చేరాడు. 2014, 2019లో వరుసగా రెండు సార్లు జైపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందాడు. మోడీ కేబినెట్‌లో మంత్రి పదవి నిర్వహించాడు. 2023 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో జోట్వారా నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందాడు. 2023 డిసెంబరు 3న లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. రాజస్థాన్ ప్రభుత్వంలో ప్రస్తుతం కేబినెట్ మంత్రిగా ఉన్నాడు.

కీర్తి అజాద్: బీహార్‌కు చెందిన 65 ఏళ్ల ఈ మాజీ క్రికెటర్ 1983 వరల్డు కప్ సాధించిన జట్టులో సభ్యుడు. అతని తండ్రి భగవత్ ఝా అజాద్ బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. కీర్తి అజాద్ బీహార్‌లోని దర్భాంగ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎన్నికయ్యాడు. అంతకుముందు ఢిల్లీలోని గోల్ మార్కెట్‌అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందాడు. ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్‌లో అవినీతి అక్రమాలపై అరుణ్‌జైట్లీని బహిరంగంగా విమర్శించినందుకు బిజెపి నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. 2019లో కాంగ్రెస్‌లో చేరాడు. 2022లో కాంగ్రెస్ నుంచి తృణమూల్ కాంగ్రెస్‌లోకి జంప్ చేశాడు. ప్రస్తుతం తృణమూల్ కాంగ్రెస్ గోవా రాష్ట్ర ఇంఛార్జిగా వున్నాడు.



గౌతం గంభీర్: ఢిల్లీకి చెందిన 43 ఏళ్ల ఈ మాజీ క్రికెటర్ 2019లో బిజెపి తరపున తూర్పు ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందాడు.రెండేళ్ల క్రితం మహ్మద్ ప్రవక్తను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బిజెపి ప్రతినిధి నూపుర్ శర్మను గంభీర్ వెనకేసుకొచ్చాడు. నూపుర్ శర్మ 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద కేజ్రీవాల్‌పై పోటీ చేసి చిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆమెను అమేథీ నుంచి బరిలోకి దించాలని బిజెపి యోచిస్తోంది. ఆ విషయం అలా వుంచితే గౌతం గంభీర్ ఎంపీగా ఉంటూనే కొల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఐపిఎల్‌లో ఆడాడు. ఈ ఏడాది మార్చి 24న రాజకీయాలకు, బిజెపికి ఆయనగుడ్‌బై చెప్పాడు.

భయాచుంగ్ భుటియా: సిక్కింకు చెందిన ఈ 47 ఏళ్ల ఈ ఇండియన్ ఫుట్‌బాల్ మాంత్రికుడు 2019లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ తరపున డార్జిలింగ్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయాడు. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం ప్రముఖులు అశోక్ భట్టాచార్యకు మద్దతుగా ప్రచారం చేశాడు. తరువాత హమ్‌రో సిక్కిం అన్న పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేశాడు. 2024 ఏప్రిల్ 19న పార్లమెంటు తొలివిడతతో బాటు జరిగిన సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో చామ్లింగ్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి ఎస్‌డిఎఫ్‌లో చేరి విస్తృతంగా ప్రచారం చేశాడు.

నవజోత్‌సింగ్ సిద్దూ: పంజాబ్‌కు చెందిన 60 ఏళ్ల ఈ మాజీ క్రికెటర్ 2004 లోక్‌సభ ఎన్నికల్లో అమృతసర్ నుంచి బిజెపి టికెట్‌పై పోటీ చేసి గెలుపొందాడు. ఓ క్రిమినల్ కేసులో అతడిని దోషిగా నిర్ధారించి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడంతో ఎంపీ పదవికి రాజీనామా చేశాడు. తరువాత ఉన్నత న్యాయస్థానం ఆ తీర్పుపై స్టే ఇవ్వడంతో ఉప ఎన్నికల్లో పోటీ చేసి లోక్‌సభకు తిరిగి ఎన్నికయ్యాడు. 2009 ఎన్నికల్లోనూ సిద్దూ అక్కడి నుంచే నెగ్గాడు. 2016 ఏప్రిల్ లో ఆమాద్మీ పార్టీవైపు ఆయన మొగ్గు చూపినప్పుడు బిజెపి రాజ్యసభ సీటు ఇచ్చింది. అయితే మూడు మాసాల తరువాత రాజ్యసభ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసి పనిచేశాడు. 2016 సెప్టెంబరులో ప్రముఖ హాకీ ఆటగాడు ప్రగత్ సింగ్‌తో కలసి ఆవాజ్ ఇ పంజాబ్ అన్న పేరుతో సొంత పార్టీని స్థాపించాడు. అది క్లిక్ కాకపోవడంతో దానిని రద్దు చేసి 2017 జనవరిలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఆ సంవత్సరం జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో అమృతసర్ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందాడు. అమరీందర్ సింగ్ మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా చేరాడు. 2018లో పాకిస్తాన్‌లో ఇమ్రాన్‌ఖాన్ ప్రమాణస్వీకా రోత్సవానికి హాజరయ్యాడు. దీనిని అమరీందర్ సింగ్ తప్పుపట్టాడు. 2019లో మంత్రివర్గం నుంచి సిద్ధూను తొలగించారు.2021 జులైలో సిద్ధూకు పంజాబ్ పిసిసి అధ్యక్ష పగ్గాలు అప్పగించారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో అమృతసర్ తూర్పు నియోజకవర్గం నుంచి సిద్ధూ పోటీ చేసి ఆమాద్మీ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు.



టిఎంసి నుంచి యూసఫ్ పఠాన్

క్రికెటర్ యూసఫ్ పఠాన్ బెర్హంపుర్ నియోజకవర్గం నుంచి టిఎంసి తరుపున పోటీ చేస్తున్నారు. ఇటీవలే ఈయన టిఎంసిలో చేరి టిక్కెట్టు సంపాదించారు. పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అధిర్ రంజన్ చౌదరి యూసఫ్‌తో పోటీ పడుతున్నారు.



అజారుద్దీన్: మాజీ క్రికెటర్ అజారుద్దీన్ 2009లో యుపిలోని మొరదాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై గెలుపొందారు. 2014లో రాజస్థాన్‌లోని టోంక్-సవాయ్ మధోపూర్ నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్ పార్టీ ఆయన్ను తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. 2023లో తెలంగాణాలోని జూబ్లిహిల్స్ అసెంబ్లీ సీటు నుంచి పోటీ చేసి ఓడిపోయారు.



కరణ్ భూషణ్ సింగ్ : ఉత్తరప్రదేశ్‌కు చెందిన షూటర్ కరణ్ భూషణ్ సింగ్ కైసర్‌గంజ్ నియోజకవర్గంలో బిజెపి నుంచి పోటీ చేస్తున్నాడు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు సిట్టింగ్ ఎంపి బ్రిజ్ భూషణ్ కుమారుడు కరణ్ సింగ్. మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేదింపులకు పాల్పడుతున్న కేసులో ఆయన్ను డబ్ల్యుఎఫ్ఐ సస్పెండ్ చేసింది. ఈ విషయం దేశమంతటా చర్చనీయాంశం కావడంతో బ్రిజ్ భూషణ్ సీటును ఆయన కుమారుడికి బిజెపి కట్టబెట్టింది.

సిపిఎం నుంచి గెలిచిన జ్యోతిర్మయి



జ్యోతిర్మయి సిక్దార్: పశ్చిమబెంగాల్‌కు చెందిన 59 ఏళ్ల ఈ మాజీ క్రీడాకారిణి 2004లోక్‌సభ ఎన్నికల్లో కృష్ణానగర్ నియోజకవర్గం నుంచి సిపిఎం తరపున పోటీ చేసి గెలుపొందింది. రెండు సార్లు ఆసియాడ్ 800 మీ. పరుగుపందెం విజేత అయిన సిక్దర్ 2009లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడిపోయింది. కొంతకాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె 2019లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరి కొంత కాలం తరువాత బిజెపిలోకి దూకింది.

కలం బాణాలు

రాష్ట్రానికి లేని మోడీ గ్యారంటీ



వచ్చాడు వెళ్ళాడు
విశ్వగురుడు ఎపి
ఏమి హామి పొందినారు
అతివినయం చూపి

ఊకదంపు మాటలు
అతిశయాల కోటలు
సమస్యలను దాటేసే
రోజు వారి పాటలు

డిజిపిపై ఇసి వేటు

చిట్టచివరి వారంలో
వచ్చె కొత్త డిజిపి
పదేపదే ఫిర్యాదులు
చేసిందట టిడిపి

నిబంధనల నిష్పాక్షిక
నిర్వహణం సముచితమే
కేంద్రం ఒత్తిడి పెడితే
సర్కారులు సతమతమే



బాండ్ పేపర్‌పై హామీలు

మీ మాటలు చాలవా
ఏల బాండు పేపరు
గెలిచివచ్చినాక ఇంక
మొహమైనా చూపరు

పోలీసుల.దర్యాప్తు
పాలిటిక్సు జెడి
మళ్ళీ అడిగేదెవ్వరు
తగ్గినాక వేడి




- తె.ర

ఉద్దండుల్లో విజేతలెవరో..!

చిత్తూరు జిల్లా రాజకీయ ముఖచిత్రం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


నారా చంద్రబాబునాయుడు


ఆర్‌కె రోజా


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


అమరనాథరెడ్డి

చిత్తూరు జిల్లాలో ఉద్దండులు పోటీచేస్తుండడం రాష్ట్ర రాజకీయాల్లోనే ఆసక్తికరంగా మారింది. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, బిసివై పార్టీ వ్యవస్థాపకులు బోడే రామచంద్రయాదవ్ ఆయా నియోజకవర్గాల్లో పోటీలో ఉన్నారు.

కుప్పం నుంచి ఎనిమిదో సారి చంద్రబాబునాయుడిని లక్ష మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. ఓటర్లలో ప్రభావితం చేయడానికి బిసి సామాజిక తరగతికి చెందిన ఎంఎల్‌సి భరత్‌ను వైసిపి., పోటీలో నిలిపింది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి ఆవుల గోపి బరిలో ఉన్నారు.

పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీలో ఉన్నారు.. టిడిపి, బిసివై పార్టీల ప్రచారాలను అడ్డుకుంటూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా రామచంద్రారెడ్డి టిడిపి తరపున బరిలోఉన్నారు. బిసివై నుంచి బోడే రామచంద్రయాదవ్ పోటీలో ఉన్నారు. గతంలో ఆయన జనసేన నుంచి పోటీచేసి 16వేల ఓట్లు తెచ్చుకున్నారు. 'మార్పు' పేరుతో పెద్దిరెడ్డిని ఢీకొంటూ గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరులో ఎన్.అమరనాథరెడ్డి టిడిపి తరపున, సిట్టింగ్ ఎంఎల్ఎ వెంకటేగౌడ వైసిపి తరపున బరిలో ఉన్నారు. వైసిపి నుంచి భారీగా వలసలు రావడంతో 60 వేల మెజార్టీతో తమ అభ్యర్థి గెలిచి తీరుతాడని టిడిపి శ్రేణులు ధీమాతో ఉన్నాయి. షార్ట్ ఫిల్మ్‌ల నిర్మాత శివశంకర్‌రెడ్డి ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు.

చిత్తూరులో వైసిపి నుంచి ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ విజయానందరెడ్డి, టిడిపి నుంచి బెంగుళూరులో బిల్డర్ అయిన గురజాల జగన్మోహన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. టిడిపి నుంచి మాజీ ఎంఎల్ఎలు సికెబాబు, ఎఎస్ మనోహర్ వైసిపిని వదిలి టిడిపిలోకి రావడంతో గెలుపు సునాయాశమని ఆ పార్టీ అభ్యర్థి ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి తిక్కీ రాయల్ పోటీలో ఉన్నారు.

పూతలపట్టు నుంచి డాక్టర్ సునీల్ వైసిపి తరపున, ప్రముఖ జర్నలిస్టు డాక్టర్ మురళీమోహన్ టిడిపి నుంచి బరిలో ఉన్నారు. వైసిపి కంచుకోట అయిన పూతలపట్టును ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని టిడిపి శతవిధాలా ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆశీస్సులు మురళీమోహన్‌కు ఉన్నాయని చెపుతున్నారు.. వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ ఎంఎస్ బాబుకు టిక్కెట్ రాకపోవడంతో కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. వైసిపి ఓటు బ్యాంకును ఆయన చీల్చే అవకాశం ఉంది.

జీడీ నెల్లూరులో డిప్యూటీ సిఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి వైసిపి నుండి, డాక్టర్ థామస్ టిడిపి నుంచి, కాంగ్రెస్ నుంచి రమేష్ బరిలోఉన్నారు. రమేష్ స్వయంగా నారాయణస్వామి బావమరిది కావడంతో వైసిపి ఓట్లలో చీలిక వస్తుందని చెపుతున్నారు.

నగిరి నుంచి మూడోసారి పోటీచేస్తున్న ఆర్‌కె రోజాకు సొంత గూటిలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. తాజాగా శ్రీశైలం ట్రస్టు బోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, నాయకులు మురళీనాధరెడ్డి, వెంకటముని, అమ్ములు తదితరులు రాజీనామా చేసి, టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. రోజాను ఓడించడమే తమ పంతమని వారు విలేకరుల సమావేశం పెట్టడమే గాకుండా, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ ప్రచారం చేస్తున్నారు. టిడిపి తరపున గాలి భానుప్రకాష్ బరిలో ఉన్నారు. ఈసారైనా తనను గెలిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నుంచి పుత్తూరుకు చెందిన రాకేష్‌రెడ్డి బరిలో ఉన్నారు. రాకేష్‌రెడ్డి.. వైసిపి ఓట్లే ఎక్కువగా చీల్చే అవకాశం ఉంది.

చిత్తూరు పార్లమెంట్‌కు సిట్టింగ్ ఎంపి రెడ్డెప్ప వైసిపి తరపున, బాపట్లకు చెందిన రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు టిడిపి నుంచి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి చిత్తూరు జిల్లా తవణంపల్లికి చెందిన ముత్తుకూరు జగపతి పోటీలో ఉన్నారు.



రాష్ట్రంలో 113 పార్టీలు

- ఐదు జాతీయ పార్టీలు, రెండు రాష్ట్ర పార్టీలు
- గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీలు 11
- ఒక పార్టీకి రిజర్వు సింబల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న పార్టీలపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. 2023 జూన్ నాటికి రాష్ట్ర ఎన్నికల కమిషన్లో 113 పార్టీలు రిజిస్టరై ఉన్నాయి. వీటిల్లో ఐదు జాతీయ పార్టీలు, రెండు రాష్ట్ర పార్టీలు, 11 ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలూ ఉన్నాయి. రిజిస్టరు చేసుకున్న రాజకీయ పార్టీల్లో జనసేనకు మాత్రం గ్లాసుగుర్తును కేటాయించారు.

జాతీయ పార్టీలు

భారతీయ జనతా పార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్‌పార్టీ. వీటితోపాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్ కాంగ్రెస్) గుర్తింపు పొందిన పార్టీలుగా ఉన్నాయి.

గుర్తింపు పొందిన ఇతర రాష్ట్ర పార్టీలు

ఎఐఎడిఎంకె, ఆలిండియా ఫార్వార్డ్‌బ్లాక్, ఎఐఎంఐఎం, బిఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, జనతాదళ్(సెక్యులర్), జనతాదళ్(యునైటెడ్), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ.

రిజిస్టర్ చేసుకున్న పార్టీలు

ఆలిండియా పీపుల్ పార్టీ, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్, ఆంధ్ర చైతన్య పార్టీ, ఆంధ్ర ప్రజాశక్తి పార్టీ, ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి, అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్, బిసి భారతదేశం, భారతీయ బహుజన ప్రజారాజ్యం, భారత జనలోక్, భారత లేబర్, బహుజన సమాజ్ (అంబేద్కర్-పూలే), బిఆర్ అంబేద్కర్ ప్రజాపాలన, సిపిఐఎంఎల్ (లిబరేషన్), దళిత



బహుజన, ఏక్తాపార్టీ, గోండ్వానా గణతంత్ర, గ్రామస్వరాజ్య, గ్రేట్ ఇండియా, గ్రేట్ రాయలసీమ, హిందూస్థాన్ జనతా, ఇండియన్ క్రిస్టియన్, ఇండియన్ లేబర్ (అంబేద్కర్, పూలే), ఇండియన్స్ ఫ్రంట్, జై మహా భారత్, జై సమైక్యాంధ్ర, జనపాలన (డెమొక్రటిక్), జనరక్షణ, జనం, జన ప్రయోజన, జాతీయ సమసమాజం, ఇందిరా రాజీవ్ కాంగ్రెస్, లోక్‌సత్తా, మాదేశం, మహా జనరాజ్యం, మహిళా జనశక్తి, మజ్లిస్ బచావో తెహ్రీక్, మన్యసీమ స్వతంత్ర, నేషనల్ ఉమెన్స్, ఎన్‌టిఆర్ తెలుగుదేశం (లక్ష్మీపార్వతి), నవభారత్, నవతరం, నవసమాజ్, నవసమాజం, నవప్రజారాజ్యం, నవరంగ్ కాంగ్రెస్, నవోదయం, పరమాత్మ, పేదరికం నిర్మూలన, ప్రజాబలం, ప్రజాపక్షం, ప్రజాసత్తా, ప్రజా తెలుగుసమితి, ప్రజా ఉద్యోగ, పిరమిడ్, ప్రజాభారత్, ప్రేమ్‌జనతా, ఖవామీఇత్తెహదుల్ రిపబ్లిక్, రాష్ట్రీయ లోక్‌దళ్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్, రాయలసీమ రాష్ట్ర సమితి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, సామాన్య పార్టీ, సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి, సమైక్య తెలుగురాజ్యం, సామాజిక తెలంగాణ, సమైక్యాంధ్ర సమితి, శ్రమజీవి, సోషల్ డెమొక్రటిక్, సోషల్ వెల్ఫేర్, తెలంగాణ భారత జనతా, తెలంగాణ రాజ్యసమితి, తెలంగాణ పార్టీ, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ కాంగ్రెస్, తెలంగాణ డెమొక్రటిక్ ఫ్రంట్, తెలంగాణ ఐక్యజన, తెలంగాణ లేబర్, తెలంగాణ లోక్‌సత్తా, తెలంగాణ సకలజనులు, తెలంగాణ యువసేన, తెలుగుధర్మం, తెలుగుజనత, యునైటెడ్ ఉమెన్ ఫ్రంట్, ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి, వక్త ప్రజా సమస్యల సాధన, వెనుకబడినవర్గాల మహిళా రైతు, విద్యార్థులు, మహిళల, రైతుల మహాసేన, వెల్ఫేర్ పార్టీ, వైఎస్ఆర్ బహుజన, వైఎస్ఆర్ ప్రజాపార్టీ, యువ తెలంగాణ పార్టీలు ఎన్నికల కమిషన్‌లో రిజిస్టర్ చేసుకుని ఉన్నాయి.

అంజాద్‌కు మాధవి, అఫ్జల్ గట్టి పోటీ !

కడపలో ప్రధాన పార్టీల ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. వైసిపి, టిడిపి, కాంగ్రెస్ సహా మరో 10 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నా, వైసిపి అభ్యర్థి, డిప్యూటీ సిఎం ఎస్.బి.అంజాద్‌బాషా, టిడిపి అభ్యర్థి ఆర్.మాధవి, ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

నియోజకవర్గంలో 2,83,543 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మైనార్టీ ఓటర్లు ఉన్న ఇక్కడ... మూడు దశాబ్దాలుగా మైనార్టీ అభ్యర్థులే ఎన్నికవుతున్నారు. అధికార, ప్రతిపక్ష, ఇతర పార్టీలు సైతం మైనార్టీ అభ్యర్థులకే టికెట్లు ఇస్తున్నాయి. 2019లో వైసిపి అభ్యర్థిగా అంజాద్ బాషా, టిడిపి అభ్యర్థిగా అమీర్‌బాబు పోటీచేశారు. కానీ 2014లో టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా బిజెపి అభ్యర్థి కందుల రామచంద్రారెడ్డి పోటీ చేశారు. టిడిపి రెబెల్‌గా దుర్గాప్రసాద్ బరిలో నిలిచి ఓట్లు గణనీయంగా సాధించుకున్న సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లోనూ అంజాద్ బాషా విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో టిడిపి-జనసేన-బిజెపి కూటమి తరపున టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి సతీమణి ఆర్.మాధవి బరిలో నిలిచారు.


అంజాద్ బాషా

వైసిపి, టిడిపి అభ్యర్థులు పరస్పర మాటల దాడులతో హోరెత్తిస్తున్నారు. అంజాద్ బాషా పదేళ్లలో చేసిన పనులు, చేసిన తప్పిదాలపై ఛార్జిషీట్, మేనిఫెస్టోను విడుదల చేయడం, మైనార్టీ ఓట్లలో చీలిక కోసం ఎత్తుగడలు వేయడం మొదలుకుని చివరికి ఆర్‌ఎస్‌ఎస్‌తో చేతులు కలిపి శోభాయాత్రలో పాల్గొనడం వంటి అందివచ్చిన అవకాశాలను టిడిపి అభ్యర్థి ఉపయోగించుకోవడంతో రాజకీయం పతాకస్థాయికి చేరుకుందని చెప్పవచ్చు. బిజెపి-టిడిపి-జనసేన పొత్తుతో ముస్లిం మైనార్టీలకు ఏ విధంగా నష్టం కలగనుందో అంజాద్ బాషా .. ఓటర్లలో ప్రచారం గావిస్తున్నారు. అలాగే గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన సంక్షేమం గురించి ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. రెండు ప్రధాన పార్టీల నేతల కొన్ని చర్యలు ఉద్రిక్త పరిస్థితులకు కారణమవుతున్నాయి. ఇటీవల ఓ కార్పొరేటర్ అనుచరునిపై దాడి సందర్భంగా వైసిపి, టిడిపి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ఇక్కడ అభ్యర్థుల గెలుపు మైనార్టీ ఓట్లపై ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర స్థాయి నాయకులు అఫ్జల్‌ఖాన్‌కు కాంగ్రెస్ టికెట్ దక్కింది. ఇది వైసిపి ఓట్లలో కొంత చీలిక తెస్తుందని చెపుతున్నారు. దీనికి విరుగుడుగా మాజీ డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్‌ను చేర్చుకుని వైసిపి..తన రాజకీయ చతురతను ప్రదర్శించింది. ఇండియా బ్లాక్ తరపున వామపక్షాల ప్రచారం, షర్మిల ఇక్కడ నుండి లోక్‌సభకు పోటీచేస్తుండడం వంటి అంశాలు కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్‌కు ఉపయోగపడనున్నాయి. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇంటింటి ప్రచారంతో రాజకీయ వేడి పతాక స్థాయికి చేరుకుంది.


ఆర్.మాధవి


అఫ్జల్‌ఖాన్

గెలుపు కోసం వ్యూహ ప్రతివ్యూహాలు

- మంత్రి జోగి గట్టెక్కేనా..?
- పెనమలూరులో పోటా పోటీ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణా జిల్లా పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార వైసిపి అభ్యర్థిగా మంత్రి జోగి రమేష్, బిజెపి, జనసేన బలపరిచిన టిడిపి అభ్యర్థిగా బోడే ప్రసాద్, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిశెల సుబ్రమణ్యంతోపాటు మరో ఎనిమిది మంది పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు జోగి, బోడే, వెలిశెల మధ్య ఎన్నికల పోరు ఉత్కంఠగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు శ్రమిస్తున్నారు. ఒకరికొకరు వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో జిల్లాలో మొదటిసారి పెనమలూరు నియోజకవర్గంలో అధికార వైసిపికి ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీరుపై విమర్శలు చేశారు. ఆ తర్వాత వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఆయన అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ పరిస్థితుల్లో పెనమలూరు సీటును మంత్రి జోగి రమేష్‌కు వైసిపి కేటాయించింది. ఆయన ఈ నియోజకవర్గానికి కొత్త. పెడన నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన జోగి సీటును వైసిపి అధిష్టానం మార్పు చేసి పెనమలూరుకు పంపింది. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఆయన పెనమలూరు నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభించారు. ఆత్మీయ సమావేశాల పేరుతో తాయిలాలు పంపిణీకి తెరలేపారని ఆరోపణలు వచ్చాయి. బోడేకు టిడిపి తొలుత టికెట్ నిరాకరించింది. తనకు టికెట్ కేటాయించకపోతే స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగుతానని తెగేసి చెప్పారు. కొన్నిరోజులు టిడిపి జెండా లేకుండానే స్వతంత్రంగా ప్రచారం చేశారు. చివరికి సీటు దక్కించుకున్నారు.


వెలిశెల సుబ్రహ్మణ్యం


బోడే ప్రసాద్


జోగి రమేష్

జోగిపై ఆరోపణలు

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన మూడేళ్ల తర్వాత మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో గృహ నిర్మాణశాఖ మంత్రిగా జోగి రమేష్ బాధ్యతలు స్వీకరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి వద్ద అనుచరులతో వీరంగం వేయడంతోనే జగన్ మంత్రివర్గంలో చోటు దక్కిందనే ప్రతిపక్ష టిడిపి నేతలు తరచూ జోగిపై విమర్శలు చేస్తున్నారు. ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన ఐదేళ్లలో పెడనలో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు, సముద్రతీర ప్రాంత భూముల ఆక్రమణలు, పేకాట శిబిరాల నిర్వహణ వంటివి విచ్చలవిడిగా సాగాయనే ఆరోపణలున్నాయి.

ఇసికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసినవారు నిబంధనలకు విరుద్ధంగా టిడిపి అభ్యర్థికి అనుకూలంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి, లీగల్ సెల్ నాయకులు శ్రీనివాసులురెడ్డి సోమవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పులివెందులలో 12 మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసినవారు బహిరంగంగా టిడిపి అభ్యర్థికి ప్రచారం నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సిఎం జగన్‌పై ఈ నెల 5న తంబళ్లపల్లి, ధర్మవరంలో సభల్లో చంద్రబాబు వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫేక్ సర్వేలతో ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు.



'బాపట్ల' బాస్ ఎవరు?



- ఎంపి అభ్యర్థి గెలుపును శాసించనున్న పర్చూరు, అద్దంకి, రేపల్లె నియోజకవర్గాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల పార్లమెంటు పరిధిలో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఎస్‌సి రిజర్వుడు స్థానమైన బాపట్ల పార్లమెంటులో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, సంతనూతలపాడు అసెంబ్లీ స్థానం ప్రకాశం జిల్లాలో ఉంది. బాపట్ల జిల్లాలోని 6 అసెంబ్లీ స్థానాల నుంచి 89 మంది, బాపట్ల పార్లమెంటు స్థానం నుంచి 15 మంది అభ్యర్థులు మొత్తంగా 104 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,91,716 మంది ఓటర్లున్నారు. బాపట్ల పార్లమెంటు నుంచి వైసిపి తరపున ప్రస్తుత ఎంపి నందిగం సురేష్ మరోసారి ఎన్నికల బరిలో ఉన్నారు. టిడిపి నుంచి మాజీ ఐపిఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్ పోటీ చేస్తున్నారు. ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున జెడి శీలం పోటీలో ఉన్నారు. గతంలో బాపట్ల పార్లమెంటు నుంచి పోటీ చేసి ఓడిపోయిన జెడి శీలం ఆ తర్వాత రాజ్యసభ సభ్యులుగా రెండు పర్యాయాలు, కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. నియోజకవర్గంలో విస్తృత పరిచయాలున్నాయి. టిడిపి అభ్యర్థి కృష్ణప్రసాద్ పూర్తిగా నియోజకవర్గానికి కొత్త. తెలంగాణలో బిజెపి నేతగా ఉన్న కృష్ణప్రసాద్ బాపట్ల నుంచి టిడిపి తరపున ఎంపిగా పోటీలో ఉన్నారు. నందిగం సురేష్ కూడా గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.


నందిగం సురేష్

3 పార్టీల మధ్య పోటీ

జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. చీరాల అసెంబ్లీ నుంచి మాత్రం మూడు పార్టీల అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. గతంలో చీరాల అసెంబ్లీ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలిచి ఆ తరువాత వైసిపికి మద్దతు పలికిన కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు కరణం వెంకటేష్ వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. టిడిపి తరపున మద్దులూరి మాలకొండయ్య పోటీలో ఉన్నారు. వేమూరు నుంచి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు టిడిపి నుంచి పోటీ చేస్తుండగా, వైసిపి నుంచి వరికూటి అశోక్‌బాబు పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో వైసిపి తరపున గెలిచి మంత్రిగా ఉన్న మేరుగ నాగార్జునను సర్వేల ఆధారంగా బాపట్ల పార్లమెంటు పరిధిలోని సంతనూతలపాడుకు మార్చారు. ప్రకాశం జిల్లా కొండపి వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న అశోక్‌బాబును వేమూరు నుంచి పోటీలో నిలిపారు. ఇక్కడ టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య గట్టిపోటీ ఉంది. బాపట్ల నుంచి శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఇక్కడ నుంచి వరుసగా రెండు సార్లు గెలిచి మూడోసారి పోటీలో ఉన్నారు. టిడిపి నుంచి వేగేశన నరేంద్రవర్మ మొదటిసారి పోటీ చేస్తున్నారు. బాపట్లలో వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యేగా ఉన్నవారు కూడా ఇక్కడ టిడిపిలో చేరారు. ఈ కారణంగా బాపట్లలో పోటీ నువ్వానేనా అన్నట్లుగా సాగుతోంది. జిల్లాలోని పర్చూరు, అద్దంకి, రేపల్లె, వేమూరు అసెంబ్లీల నుంచి మొన్నటి వరకు వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న వారిని తప్పించి కొత్త వారిని ఎన్నికల బరిలో నిలిపారు. ఇలా ఇన్‌ఛార్జులను మార్చడంతో వైసిపి ఎన్నికల వ్యూహం బెడిసికొట్టింది. పర్చూరు, అద్దంకి, రేపల్లె నుంచి టిడిపి ఎమ్మెల్యేలుగా ఉన్న ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తూ బలమైన అభ్యర్థులుగా ఉన్నారు. బాపట్ల పార్లమెంటు అభ్యర్థి గెలుపును ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు శాసించనున్నాయి.


జెడి శీలం


తెన్నేటి కృష్ణప్రసాద్

సంపాదకీయం


ఎన్నికల ఆటలో పోలవరం

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడిగా అభివర్ణిస్తున్న పోలవరం సాగునీటి ప్రాజెక్టును నాలుగు ప్రధాన పార్టీల అవకాశవాద రాజకీయ క్రీడ ప్రశ్నార్థకం చేసింది. ప్రాజెక్టు కోసం తమ భూములు, ఇళ్లు, బతుకులను ధారబోసిన లక్షలాది గిరిజనుల, ఇతర ప్రజానీకాన్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టేసింది. ఎన్నికలొచ్చిన ప్రతిసారి, అటకెక్కించిన పోలవరం హామీకి బూజు దులిపి ప్రచారంలో పెట్టడం బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలకు రివాజుగా మారింది. రాష్ట్ర విభజన అనంతరం మూడవ మారు జరుగుతున్న ఈ ఎన్నికల్లోనూ పోలవరాన్ని వ్యూహాత్మక చర్చనీయాంశం చేయబూనాయి సదరు నాలుగు పార్టీలు. అందులో ముందున్నది బిజెపి, ప్రధాని మోడీ. 2014లో టిడిపి, జనసేనతో కూటమి కట్టిన మోడీ, పోలవరాన్ని నిర్మిస్తామని వాగ్దానం చేశారు. మధ్యలో కూటమికి చెల్లుచీటి ఇచ్చి, పదేళ్ల తర్వాత మళ్లీ అదే మూడు పార్టీల జట్టుకు నాయకత్వం వహిస్తూ ప్రాజెక్టు నిర్మాణానికి తనది పూచీ అని, రాష్ట్ర ప్రజలకు దృఢమైన హామీ ఇస్తున్నానని ఒక పత్రికా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రధానిగా ఉండి, విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం పూర్తి కాకపోవడానికి బాధ్యత ఎవరిది? ఆ మాత్రం సోయి లేకుండా మరొకసారి తమ కూటమికి ఓట్లేస్తే బాధ్యత తీసుకుంటాననడం రాష్ట్ర ప్రజలను మోసగించడం కాదా?

పోలవరానికి కేంద్రం రూ.15 వేల కోట్లిచ్చిందని ఘనంగా సెలవిచ్చారు మోడీ. ప్రతిపాదిత ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.55 వేల కోట్లు కావాలి. స్క్రీనింగ్ తర్వాత రూ.47 వేల కోట్లన్నారు. జాతీయ ప్రాజెక్టు అయ్యాక దశాబ్దకాలంలో కేంద్రం అనేక దఫాలలో విడుదల చేసిన రూ.15 వేల కోట్లు ఏ మూలలకు? ఇంతటి ఘన చరిత్ర పెట్టుకొని భవిష్యత్తులో ప్రాజెక్టు పూర్తికి తనది గ్యారంటీ నమ్మమంటున్నారు. కాగా సోమవారంనాటి ఎన్‌డిఎ ఎన్నికల బహిరంగసభల్లో ఆ గ్యారంటీ సైతం మోడీ ఇవ్వలేదు. పోలవరం నిర్మాణంపై వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న రాజకీయ విమర్శకే పరిమితమయ్యారు. పోలవరంపై మోడీ సర్కారుది మొదటి నుంచీ వంచనే. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక రెండేళ్ల వరకు ఆ ఊసెత్తలేదు. 2016 సెప్టెంబర్‌లో కేంద్రమే పూర్తి నిధులు భరిస్తుందని అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటన చేశాకనే నిర్మాణ పనులు మొదలయ్యాయి.

గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు తమ అవకాశవాద, రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకు పోలవరాన్ని వాడుకున్నాయనడానికి ఎన్నో దృష్టాంతాలున్నాయి. కేంద్రం చేయాల్సిన పోలవరం నిర్మాణ పనులను చేజెక్కించుకునే టిడిపి సర్కారు ప్రత్యేక హోదాను వదిలేసుకుందనడానికి అప్పటి పరిణామాలతో అర్థమవుతుంది. హోదాకు సమానంగా ప్రత్యేక ప్యాకేజీ అని బిజెపి చెప్పి ఆచరణలో ఏమీ ఇవ్వకపోయినా నాలుగేళ్లపాటు ఎన్‌డిఎలో, కేంద్ర ప్రభుత్వంలో టిడిపి కొనసాగింది. చివరి ఏడాదిలో కేంద్రం మోసం చేసిందని బయటికొచ్చారు. వీధుల్లో ఆందోళనలూ చేశారు. ఇప్పుడు మళ్లీ అదే బిజెపి కూటమిలో చేరారు. జనసేన సైతం రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిందని పొత్తుకు కటీఫ్ చెప్పింది. ఐదేళ్లల్లో వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండర్లు, డయాఫ్రంవాల్ అని పోలవరాన్ని చుట్టచుట్టేసింది. కేంద్రం నుంచి నిధులు సాధించింది లేదు. బిజెపి, టిడిపి, వైసిపి వైఖరులతో సమిధలైంది నిర్వాసితులు. డ్యామ్ పనులు తప్ప సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను పట్టించుకోలేదు. మోడీ ఇచ్చానంటున్న నిధులన్నీ కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరాయి. నిర్వాసితుల రూ.33 వేల కోట్ల పరిహారం కోసం ప్రజలపై సెస్సు వేస్తాం, బిచ్చమెత్తి సమీకరిస్తామంటూ త్యాగధనులను పవన్ కళ్యాణ్ అపహాస్యం చేయడం గర్హనీయం. బాబు ప్రభుత్వం పోలవరాన్ని ఎటిఎంలా వాడుకుందని గత ఎన్నికల సందర్భంగా ఆరోపించిన మోడీ, ఇప్పుడు వైసిపి సర్కారుకు ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదని, అవినీతి జరిగిందని చెబుతున్నారు. పైనున్న బిజెపి సర్కారు అండ ఉండబట్టే టిడిపి, వైసిపి అవినీతి నిర్విఘ్నంగా సాగిందన్నది ప్రజల భావన. పోలవరంపై బిజెపిది నయవంచన అని ఈ పూర్వరంగంలో తెలుస్తుంది. ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన, బిజెపితో లోపాయికారీ సంబంధాలు నెరిపిన వైసిపి ప్రజలకు సమాధానం చెప్పి తీరాలి. ఏ ఎండకా గొడుగు పడుతూ స్వలాభమే పరమావధిగా వైఖరులు మార్చుకొనే పార్టీలకు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి.

మహనీయుని మాట



భారతదేశం కులం, మతం, మూఢనమ్మకాల సుడిగుండంలో గిరగిరా తిరుగుతూ వుంటే...

దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఎలా వుంటుంది?

- రవీంద్రనాథ్ టాగూర్

జననం: 7.6.1861 - మరణం: 7.8.1941

మన్య విప్లవ స్ఫూర్తితో ఆదివాసీ ఉద్యమం

సందర్భం

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేదు. షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలు వున్నప్పటికీ మైదాన ప్రాంత కాంట్రాక్టర్లు, పాలకపక్ష నేతలు యథేచ్ఛగా గనులు తవ్వి వందల కోట్లు ఆర్జిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రధానంగా ఆదివాసీ కుటుంబాలే భూమిని, ఊరును, ఉపాధిని కోల్పోతున్నాయి. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా వారికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు లేవు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల ఉద్యోగాలకు జీవో నెం:3 రక్షణగా ఉండేది. దానిని సుప్రీం కోర్టు కొట్టివేసింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనేక ఆదివాసీ వ్యతిరేక చర్యలు చేపట్టి ఆదివాసీల అస్థిత్వానికే ప్రమాదం తెచ్చిపెడుతోంది. ఆదివాసీ చట్టాలను సవరించి, రద్దు పర్చి తీవ్ర అన్యాయం చేస్తోంది.

నేడు అల్లూరి శత వర్ధంతి



తెలుగు జాతి స్ఫూర్తి ప్రదాత, ఆదివాసీల ఆరాధ్య నేత అల్లూరి సీతారామరాజు అమరుడై వందేళ్ళు అయ్యింది. అల్లూరి నేతృత్వంలో... ఆదివాసీల మౌలిక సమస్యల పరిష్కారం కోసం, బ్రిటిష్ వలస పాలన అంతం కోసం 1922 ఆగష్టు నుండి 1924 జూన్ వరకు విశాఖ, గోదావరి మన్య ప్రాంతంలో మహోధృత పోరాటం సాగింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన ఈ పోరు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మన్య విప్లవంగా ప్రాచుర్యం పొందింది. మన్య విప్లవం ప్రారంభమై వంద సంవత్సరాలయింది. ఆ పోరాట లక్ష్యాలు నేటికీ నెరవేరలేదు.

అల్లూరి 1897 జులై 4న విశాఖ జిల్లా పాండ్రంగి గ్రామంలో తన తల్లి పుట్టింట పుట్టాడు. తండ్రి స్వగ్రామం భీమవరం (ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం) పట్టణానికి 10 కి.మీ. దూరంలో వున్న మోగల్లు గ్రామం. హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే నిరంతరం ఏదో ఆలోచనలు చేస్తున్న విలక్షణమైన విద్యార్థిగా ఉండేవాడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆయన సహాధ్యాయి మద్దూరి అన్నపూర్ణయ్య...అల్లూరి ఆలోచనలను కొన్నింటిని తన గ్రంథంలో పేర్కొన్నారు. అల్లూరి హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే "లోకోద్ధరణకు ఉపకరించే విద్యయే నిజమైన విద్య" అన్నారని అన్నపూర్ణయ్య రాశారు. అర్హతలు, అవకాశాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగాలు, డబ్బు సంపాదన గురించి ఎన్నడూ ఆలోచించలేదు. ఏదో చేయాలనే నిరంతరం తపన పడేవాడు. ఈ ఆలోచనలను ఆచరణలో పెట్టడం కోసమే 1913-17 మధ్య తుని సమీప ప్రాంతంలో ఉన్న ఆటవీ ప్రాంతంలో సంచారం చేశాడు. ఆదివాసీ జీవితాలను తొలిసారిగా పరిశీలించాడు. 1916 ఏప్రిల్ 26న దేశ యాత్ర ప్రారంభించి ఉత్తర భారత దేశంలో విస్తృతంగా పర్యటించాడు. తొలి తరం కాంగ్రెస్ ఉద్యమ నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీని కలకత్తాలో కలిసి చర్చించాడు. స్వాతంత్ర్య సమరయోధుడు పృథ్వీసింగ్‌తో పరిచయం చేసుకున్నాడు. చిట్టగాంగ్ విప్లవ వీరులతో పరిచయాలు చేసుకొని ఆ పోరాట అనుభవాలను అవగాహన చేసుకున్నాడు. ఉత్తర దేశ యాత్రలు ముగించుకొని 1917 జులై 17న విశాఖ మన్యం కృష్ణదేవి పేటకు చేరుకున్నాడు. అప్పటికి ఆయన తన భవిష్యత్తు జీవిత మార్గాన్ని నిర్దేశించుకున్నట్టు స్పష్టమవుతుంది. మొదట విశాఖ మన్య ప్రాంతమంతా విస్తృతంగా పర్యటించి ఆదివాసీలకు బాగా చేరువయ్యాడు. కృష్ణదేవి పేట లోని ఓ కుటీరంలో ఆకులు, మూలికలతో ఆయుర్వేద వైద్యం చేయనారంభించాడు. తాండవ నది గట్టుపైన చిన్ని కుటీరం ఏర్పరచి ఆదివాసీలకు రాత్రి పాఠశాల నిర్వహించాడు. ఆదివాసీ గూడేలలో మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. మీ మధ్య వచ్చే వివాదాలను పోలీస్ స్టేషన్లు, కోర్టులకు పోకుండా మీ గ్రామాలలో మీరే పంచాయితీలు పెట్టుకొని పరిష్కరించుకోమని ఆదివాసీలకు చెప్పాడు.



మంతెన సీతారాం

మొదటి దశలో ప్రజా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించిన అల్లూరి మలి దశలో సాయుధ పోరాటానికి సమాయత్తం కావాల్సిన పరిస్థితులు విశాఖ-గోదావరి మన్యంలో ముందుకు వచ్చాయి. మొదట దేశయాత్ర సందర్భంగా కాంగ్రెస్ సంస్థ ప్రభావంలో ఉన్నాడు. లక్నో కాంగ్రెస్ మహాసభకు కూడా హాజరయ్యాడు. 1922 ఫిబ్రవరి 12న గాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమం హఠాత్తుగా నిలిపివేశారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్న ఈ ఉద్యమం అర్థంతరంగా నిలిపివేయడంతో భారత దేశంలోని అనేక మంది యువ స్వాతంత్ర్యోద్యమ నాయకులు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి కొత్త మార్గాలను అన్వేషించడం ప్రారంభించారు. ఆంధ్ర ప్రాంతంలో అల్లూరి ఆ విధంగా కొత్త మార్గాన్ని చేపట్టాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఓడించి దేశ స్వాతంత్ర్యాన్ని సాధించాలంటే సాయుధ పోరాటమే మార్గమని, మన్యం విప్లవం ప్రారంభించాలని నిశ్చయించుకున్నాడు.

బ్రిటిష్ ప్రభుత్వ అక్రమ చట్టాలు - తీవ్ర దోపిడి, పీడనలు

నాడు బ్రిటిష్ ప్రభుత్వం ఆదివాసీలతో రోడ్లు, ఘాట్ రోడ్లు వేయించేది. కూలీ చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించేవారు. బ్రిటిష్ అటవీ విధానాన్ని కఠినంగా అమలు జరిపి ఆదివాసీల సాంప్రదాయక పోడు వ్యవసాయాన్ని నిషేధించారు. అటవీ ఉత్పత్తులను సేకరించడంపై ఆంక్షలు విధించారు. బ్రిటిష్ రెవెన్యూ చట్టాలు ఆదివాసీల స్వంత భూములు కోల్పోయే పరిస్థితి తీసుకు వచ్చింది. విశాఖ-గోదావరి మన్యంలో తమ జీవనానికి ఏకైక ఆధారమైన భూములను ఆదివాసీలు పెద్ద ఎత్తున కోల్పోయారు. దీనికి తోడు మైదాన ప్రాంతం నుండి వచ్చిన షావుకార్లు (వడ్డీ వ్యాపారులు), అటవీ కాంట్రాక్టర్లు యథేచ్ఛగా దోపిడీ సాగించడం, గిరిజనేతరులు పెద్ద ఎత్తున భూముల్ని స్వాధీనం చేసుకోవడంతో ఆదివాసీల సాంప్రదాయ జీవన పరిస్థితిని అతలాకుతలం చేసింది. వారిలో తిరుగుబాటు ఆలోచనలకు కారణమైంది. ఆదివాసీ గూడేలన్నింటినీ పర్యటించి ఈ పరిస్థితులను అధ్యయనం చేసిన అల్లూరి మన్య పోరాటానికి ఆదివాసీలను సమాయత్తం చేయనారంభించాడు. ఆదివాసీ యువకులను ఎంపిక చేసుకొని సాయుధ శిక్షణ ప్రారంభించాడు. తాను స్వయంగా విల్లును, తుపాకిని ఉపయోగించడం నేర్చుకున్నాడు.

1922 జనవరి నుండి ఆదివాసీలు వివిధ రూపాలలో తమ ధిక్కారాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి చూపించనారంభించారు. అలా మన్య తిరుగుబాటు మొదలైంది. అల్లూరి నాయకత్వ శిక్షణలో ఆగష్టు 22న 150 మంది ఆదివాసీ గెరిల్లాలు చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఇదే మన్య పోరాట తొలి ఘటనగా చరిత్రలో నిలిచి పోయింది. వెనువెంటనే కృష్ణదేవి పేట, రాజ వొమ్మంగి, దేవిపట్నం పోలీస్ స్టేషన్లను ముట్ట డించారు. ఈ పోరాట ఘటనల అనంతరం అన్నవరం పర్యటనకు వచ్చిన అల్లూరికి ప్రజలు జేజేలు పలికారు. మూడు సంవత్సరాల పాటు విశాఖ మన్యంలో ప్రారంభమైన పోరాటం గోదావరి మన్యం వరకూ పెద్దఎత్తున సాగింది. ఈ పోరాటాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తీవ్ర దమనకాండతో అణచివేసింది. 1924 మే7న అల్లూరి సీతారామరాజును చెట్టుకు కట్టి కాల్చి చంపారు. ఈ పోరాటం ఆనాడు అణచివేయబడినా పోరాట లక్ష్యాల సాధన కోసం ఆదివాసీలు అప్పటి నుండి ఈనాటి వరకూ అనేక ఉద్యమాలు సాగిస్తునే ఉన్నారు. "అన్యాయమైన, చట్టవిరుద్ధమైన బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని పారద్రోలడం, ఆదివాసీల మౌలిక సమస్యల పరిష్కారం" లక్ష్యాలుగా మన్య పోరాటం సాగింది. ఈ రెండు మౌలిక లక్ష్యాల సాధనే మన్య విప్లవ పోరాట ధ్యేయంగా స్పష్టమవుతుంది.

మన్య పోరాట లక్ష్యాలు సాధిద్దాం

బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఓడించి దేశానికి స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్ళు అయ్యింది. కానీ దోపిడీ, పెత్తనం పోలేదు. తెల్లదొరలు పోయి నల్లదొరల పాలన వచ్చినా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదు. నేడున్న బిజెపి ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదులకు మరింత చేరువై వ్యూహాత్మక భాగస్వామిగా, ఉపగ్రహంగా మారిపోయింది. దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. అల్లూరి మన్య విప్లవ పోరాట లక్ష్యమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నేడు మరింతగా ముందుకు తీసుకోపోవాల్సి ఉంది. 100 సంవత్సరాల మన్య పోరాట లక్ష్యాల అమలు కోసం రాబోయే కాలంలో ఉత్తరాంధ్ర-గోదావరి మన్యంలో పెద్ద ఎత్తున ఆదివాసీ పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు కొన్ని రక్షణలు, హక్కులు కల్పిస్తూ 5,6 షెడ్యూళ్లలో పొందుపర్చారు. షెడ్యూల్ ప్రాంతంలో ఎన్ని చట్టాలు వచ్చినా అవేవీ అమలు కావడం లేదు. 1/70 చట్టం ఉన్నప్పటికీ ఉత్తరాంధ్ర-గోదావరి మన్యంలో వేలాది ఎకరాలు అన్యాక్రాంతమైపోయాయి. వీటిని గిరిజనేతర భూస్వాములు చట్టవిరుద్ధంగా అనుభవిస్తున్నారు. యుపిఎ-1 పాలనలో కేంద్ర ప్రభుత్వం అటవీ రక్షణ చట్టం తీసుకు వచ్చింది. ఈ చట్టం ఆదివాసీలకు అటవీ హక్కులు కల్పించినప్పటికీ, వారి సాగు భూమికి, పోడు భూమికి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి. పోడు భూముల హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళకు పంపిస్తున్నాయి. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేదు. షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలు వున్నప్పటికీ మైదాన ప్రాంత కాంట్రాక్టర్లు, పాలకపక్ష నేతలు యథేచ్ఛగా గనులు తవ్వి వందల కోట్లు ఆర్జిస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రధానంగా ఆదివాసీ కుటుంబాలే భూమిని, ఊరును, ఉపాధిని కోల్పోతున్నాయి. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా వారికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వడం లేదు. పునరావాసం ఊసే లేదు. విభజన చట్టం ప్రకారం పోలవరం జాతీయ ప్రాజెక్టు కనక ఆర్ అండ్ ఆర్ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలి. కాని కేంద్ర బిజెపి సర్కారు డ్యాం నిర్మాణానికి (కాంట్రాక్టర్లకు) నిధులు ఇస్తాం కాని పునరావాసం బాధ్యత తమది కాదన్నట్లు వ్యవహరిస్తోంది. టిడిపి, వైసిపి కూడా అందుకు తలూపుతున్న పరిస్థితి. తాజాగా పవన్ కల్యాణ్ ఆర్ అండ్ ఆర్ కోసం ప్రజలపైన సెస్ విధిస్తామని, అదీ చాలకపోతేలే క్రౌడ్ ఫండింగ్ (బిచ్చమెత్తి) సేకరిస్తామని చెప్పడం కేంద్రానికి లొంగుబాటు, నిర్వాసితులను గాలికొదిలెయ్యడమే!

షెడ్యూల్ ప్రాంతంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు లేవు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల ఉద్యోగాలకు జీవో నెం:3 రక్షణగా ఉండేది. దానిని సుప్రీం కోర్టు కొట్టివేసినా పునరుద్ధరణకు అటు కేంద్రం లేదా ఇటు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు లేవు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనేక ఆదివాసీ వ్యతిరేక చర్యలు చేపట్టి ఆదివాసీల అస్థిత్వానికే ప్రమాదం తెచ్చిపెడుతోంది. ఆదివాసీ చట్టాలను సవరించి, రద్దు పర్చి తీవ్ర అన్యాయం చేస్తోంది. ఆర్.ఎస్.ఎస్ అనుబంధ మతోన్మాద సంస్థలు రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి ఉత్తరాంధ్ర-గోదావరి జిల్లాల అటవీ ప్రాంతంలో మతోన్మాద ప్రచారం సాగిస్తున్నాయి. తెగల మధ్య అనైక్యతను పెంచే కుట్రలు చేస్తున్నాయి. షెడ్యూల్ ప్రాంతంలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించనేలేదు. షెడ్యూల్ ప్రాంత చట్టాలను అమలు చేయడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో పంచాయతీలకు పీసా చట్టం ఉన్నప్పటికీ అమలు చేయడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతర భూస్వాముల, వ్యాపారుల, కాంట్రాక్టర్ల కొమ్ము కాస్తున్నాయి. ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నాయి.

కనుక ఆనాటి మన్య విప్లవ లక్ష్యాలే ఈనాటికీ ఆదివాసీల ఉద్యమ లక్ష్యాలుగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని స్మరించుకుంటూ ఆ లక్ష్యాల సాధన కోసం ఉద్యమం పెద్ద ఎత్తున సాగాల్సి వుంది.

/ వ్యాసకర్త సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

వారసత్వ పన్ను

వారసత్వ పన్నుపై మోడీ చేస్తున్న ప్రకటనలు అల్పత్వాన్నే చూపిస్తున్నాయి. ఒక దేశ ప్రధాని నుండి ఈ స్థాయి ప్రకటనలు రావడం ఆశ్చర్యకరంగా ఉంది. ఆ స్థాయిలో ఉన్నవారు చేయదగిన ప్రకటనలు కావవి. కాంగ్రెస్ పార్టీకి చెందిన శామ్ పిట్రోడా వారసత్వ పన్ను ప్రవేశపెట్టే విషయమై ప్రస్తావించారు. దాన్ని వ్యతిరేకించేవారు వేరే ఏమైనా హేతుబద్ధ వాదనలు చేయవచ్చు. నిజానికి ఇటువంటి ప్రతిపాదన మీద లోతైన చర్చ జరగవలసిన అవసరం కూడా ఉంది. కాని మోడీ ప్రతిస్పందనలో అటువంటి వాదనలేమీ లేవు సరికదా చాలా నీచమైన వ్యాఖ్యానాలు చేసి అటువంటి ప్రతిపాదన చేయడమే అర్థం లేనిదన్న అభిప్రాయాన్ని కలిగించడానికి ప్రయత్నించారు. లోతుగా జరగవలసిన చర్చను ఒక దురుద్దేశ పూరితమైన ప్రయత్నంతో అపహాస్యంపాలు చేయబూనుకున్నారు. మోడీ చేసిన రెండు వ్యాఖ్యానాలు ఇలా ఉన్నాయి: ప్రేక్షకులలో కూర్చున్న మహిళలను ఉద్దేశించి వారసత్వ పన్ను ప్రవేశపెడితే వారి తాళిబొట్లు లాక్కుంటారని, చచ్చిపోయిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ వాళ్ళని విడిచి పెట్టదని మోడీ అన్నారు. ఇందులో మొదటి వ్యాఖ్యానం శుద్ధ తప్పు. ఎందుకంటే వారతస్వ పన్ను ఒక స్థాయిని దాటి అధికంగా ఉన్న సంపదమీదనే విధిస్తారు. ఇక రెండోది కేవలం ప్రేక్షకుల నుండి వ్యతిరేకతను రప్పించడం కోసం మాత్రమే చేసినది. అది ఏరకంగా చూసినా వాదన అనిపించుకోదు. ఒక వ్యక్తి మరణానంతరం అతడి వారసులకు సంక్రమించే సంపదమీద పన్ను విధించడంలో తప్పు ఏమీ లేదు.

ప్రస్తుత కాలంలో ఆర్థిక పరిస్థితిని బలపరచడానికి తీసుకోవలసిన గట్టి చర్యల సంగతి చూద్దాం. ఆదాయాల్లోను, సంపద లోను అంతరాలు నయా ఉదారవాద కాలంలో బాగా పెరిగిపోయాయని దాదాపుగా అందరూ అంగీకరిస్తున్నారు. భారతదేశంలోనైతే ఈ విధానాల ఫలితంగా నిష్ట దారిద్ర్యంలోకి వచ్చి పడినవారు కూడా ఎక్కువయ్యారు. ఎన్డీయే పాలనాకాలంలో ఈ దారిద్ర్యం మరీ కొట్టొచ్చినట్టు పెరిగింది. 2014-15 నుండీ గ్రామీణ శ్రామికుల ఆదాయాల్లో పెరుగుదల నిలిచిపోయి స్తంభించిపోయాయన్న వాస్తవం గురించి ఇదివరకే మనం చెప్పుకున్నాం. వాస్తవ ధరల పెరుగుదలను యథాతథంగా చూపించే విధంగా గనుక ధరల సూచీని సరి చేస్తే గ్రామీణ ప్రజల వేతనాల్లో నిజానికి తరుగుదల కనిపిస్తుంది. శ్రామికుల బేరసారాల శక్తి కూడా సన్నగిల్లింది. నిరుద్యోగం ఈ కాలంలో బాగా పెరిగిపోవడం వల్లనే ఇది జరిగింది. నిజవేతనాల్లో తరుగుదలతో పాటు నిరుద్యోగం కూడా పెరగడం వలన నిష్ట దారిద్ర్యం గత ఏభై సంవత్సరాలలోనూ ఎన్నడూ లేనంతగా పెరిగిపోతోంది.



ప్రభాత్ పట్నాయక్

నయా ఉదారవాద విధానాలను యథేచ్ఛగా కొనసాగనిచ్చిన ఫలితంగా ఈ పరిస్థితి ఏర్పడింది. అందుచేత ప్రభుత్వం కొన్ని ఆర్థిక పరమైన చర్యల ద్వారా జోక్యం కల్పించుకుని ఆ విధానాలను కట్టడి చేయవలసి వుంటుంది. సంపన్నుల మీద పన్నులను పెంచి తద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదలకు బదిలీ చేయడమో, లేక వారికి ప్రభుత్వ సహాయాన్ని పెంచడమో చేయాల్సి వుంటుంది. దారిద్ర్యం తీవ్రతరమౌతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి ఆర్థిక జోక్యానికి గనుక ప్రభుత్వం పూనుకోకుంటే అది శ్రామిక ప్రజలకు తీరని ద్రోహం చేయడమే ఔతుంది. సంపన్నుల మీద ప్రత్యక్ష పన్నులను విధించడం ప్రభుత్వం చేయవలసిన విధి. అలాగాక, పరోక్ష పన్నులను పెంచితే దాని భారం మళ్ళీ ఆ నిరుపేదల మీదే పడుతుంది.



ఈ ప్రత్యక్ష పన్నులను విధించే మార్గం ఏమిటి? ఆదాయాల మీద గాని, సంపన్నులు చేసే వ్యయాల మీద గాని, వారివద్ద ఉన్న సంపద మీద గాని, కంపెనీల షేర్ల రూపంలో ఉన్న సంపద మీద గాని, లేదా వారసత్వంగా సంక్రమించిన సంపద మీద గాని పన్నులు విధించవచ్చు. ఒకవేళ కంపెనీల షేర్ల రూపంలో ఉన్న సంపదను మినహాయించాలనుకుంటే తక్కిన రూపాల్లోని సంపద మీద విధించే పన్ను రేటును మరింత పెంచాల్సి వుటుంది. ఐతే ఇదేమంత మంచి ఆలోచన కాదు. కంపెనీల షేర్లతో సహా అన్ని రూపాల సంపదల లావాదేవీల మీదా పన్నులను విధిస్తే అది అధిక సంపన్నుల మీద ఎక్కువగా భారం పడుతుంది. కంపెనీల షేర్లను మినహాయిస్తే అప్పుడు కావలసిన ఆదాయాన్ని సమకూర్చుకోడానికి పన్ను పరిధిలోకి ఇంకా ఎక్కువ మందిని తీసుకురావలసి వస్తుంది. సంపద పన్ను విధించినందు వలన పెట్టుబడుల ప్రవాహం మీద ఎటువంటి ప్రభావమూ ఉండదు (ఎందుకంటే పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేసే అంశాలు-మార్కెట్ లో వృద్ధి అంచనాలు, పన్నులు పోను మిగిలే లాభాల రేటు, వడ్డీ రేటు వగైరాలేవీ సంపద ఎంత ఉంది అన్న అంశంమీద ఆధారపడి ఉండవు). అదే లాభాల మీద పన్ను పెంచితే అప్పుడు పెట్టుబడులు తగ్గిపోవచ్చు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు వెనక్కి తగ్గుతారు. పైగా సంపదలో, ఆదాయాల్లో అసమానతలు బాగా పెరిగిపోతే ఆర్థిక వ్యవస్థ సమతూకం దెబ్బ తింటుంది గనుక ఎటుతిరిగీ ఆ అసమానతలను తగ్గించాల్సిందే. అందుకు సంపదమీద, వారసత్వ సంపద మీద పన్నులు వేయడం తప్పదు.

కరాచీ మహాసభలు 1931 మార్చి 26న జరిగాయి. భగత్‌సింగ్, అతడి సహచరులను ఉరితీసిన మూడు రోజుల అనంతరమే జరిగిన మహాసభలు ఇవి. ఈ తీర్మానాలకు ప్రజానీకం నుండి మొత్తంగా ఆమోదం లభించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించినవారు జవహర్‌లాల్ నెహ్రూ. మహాత్మా గాంధీ ఈ తీర్మానాన్ని లోతుగా పరిశీలించి ఆమోదించిన తర్వాతే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ సభలకు అధ్యక్షుడు వల్లభాయ్ పటేల్. ఈ చరిత్ర పరిశీలిస్తే మన ప్రధాని మోడీకి వలస పాలనపై సాగిన జాతీయోద్యమం గురించి ఎటువంటి అవగాహనా లేదని అర్థం అవుతోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించేవారంతా ఒక వాదనను బలంగా ముందుకు తెస్తారు. సమాజంలో తక్కినవారెవరికీ లేని ప్రత్యేక లక్షణాలు పెట్టుబడిదారులకు ఉంటాయని, ఆ లక్షణాల వల్లనే వారు లాభాలను ఆర్జించడానికి తాపత్రయ పడతారని, సమాజానికి అది తోడ్పడుతుందని, అందుచేత ఎక్కువ సంపదను కలిగి వుండే అర్హత వారికి ఉందని అంటారు. ఇది మార్క్సిస్టు దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకం. కార్మికుల శ్రమను కొల్లగొట్టడం ద్వారా పెట్టుబడిదారులు లాభాలను ఆర్జించగలుగుతున్నారని మార్క్సిజం అంటుంది. ఇంతకూ వాళ్ళు చెప్పే ఆ 'ప్రత్యేక' లక్షణాలేమిటి? కొత్త పద్ధతులను ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతూ తమ లాభాలను పెంచుకోగలగడమే ఆ ప్రత్యేక లక్షణం అని స్కంపీటర్ అన్నాడు. పెట్టుబడులు పెట్టి రిస్క్ తీసుకునే లక్షణం ఉందని మరొకరు అన్నారు.

వాదన కోసం వాళ్ళు చెప్పినట్టు పెట్టుబడిదారుడికి ప్రత్యేక లక్షణాలు ఉన్నందువల్లనే అతడి దగ్గర సంపద బాగా పోగుబడిందనుకుందాం. ఐతే, అతగాడి దగ్గర సంపద పోగుబడినంత మాత్రాన అతడి సంతానానికి అతడి ప్రత్యేక లక్షణాలు సంక్రమించాయని అనుకోలేం. అతడి సంతానం స్వతంత్రంగా, అంటే, తండ్రి సంపదతో నిమిత్తం లేకుండా తమ ప్రత్యేక లక్షణాలను ముందు రుజువు చేసుకోగలగాలి. అప్పుడే తక్కిన కొత్తగా రంగంలోకి వస్తున్న పెట్టుబడిదారులతో సమాన స్థాయిలో మార్కెట్‌లో పోటీ పడడం సాధ్యమౌతుంది.

అలా కాకుండా, తమ తాత ముత్తాతల కాలంనుండీ పోగేసిన సంపదకు వాళ్ళు వారసులుగా ఆ సంపదనంతటికీ హక్కుదారులు అయ్యారనుకుందాం. అప్పుడది పెట్టుబడిదారీ సమర్థకులు చెప్పే (పెట్టుబడిదారులకుండే ప్రత్యేక లక్షణాల) సిద్ధాంతానికి వ్యతిరేకం కాదా? వారికి ప్రత్యేక లక్షణాలు ఉన్నదీ లేనిదీ రుజువు కాకుండానే వారు సంపన్నులు ఎలా అవగలుగుతారు? అందుచేత వారసత్వ సంపద అనేది పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించేవారి సిద్ధాంతానికి సైతం విరుద్ధం.

అందుచేత నైతికంగా తమ పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించుకోడానికి, చాలా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో, తమకు బొత్తిగా ఇష్టం లేకపోయినప్పటికీ, వారసత్వ పన్నును ప్రవేశపెట్టారు. ఉదాహరణకు, జపాన్ దేశంలో వారసత్వ పన్ను 55 శాతం దాకా వసూలు చేస్తున్నారు. కాని భారతదేశంలో ఎటువంటి వారసత్వ పన్నూ లేదు. సంపద పన్ను కూడా నామమాత్రమే. సంపద పన్నుకి న్యాయం జరగాలంటే వారసత్వ పన్ను తోడుగా ఉండాలి. వారసత్వ పన్ను అనేది లేకుండా కేవలం సంపద పన్ను మాత్రమే విధిస్తే ఆ సంపదను వారసులందరూ చిన్న చిన్న ముక్కలుగా పంచుకున్నట్టు చూపించి ఆ సంపదపన్ను పరిధిలోకి రాకుండా తప్పించుకుంటారు. ఒక్కోసారి అసలు యజమాని ఇంకా జీవించి ఉన్నప్పుడే పంపకాలు జరిగిపోతాయి.

కాబట్టి సంపదను బిడ్డల పేరనో, మిత్రుల పేరనో బదిలీ చేయక మునుపే వారసత్వ పన్ను ఆ సంపద మీద విధించాలి. ఒకానొక స్థాయిలో పోగుబడిన సంపదమీదనే వారసత్వ పన్ను విధించాలి. అంతకు తక్కువ ఆస్తి ఉంటే దానిని మినహాయించాలి. లేకపోతే మోడీ వంటి వారు మంగళసూత్రం కూడా ఆస్తే కనుక అది కూడా లాక్కుంటారు అన్న అర్థం లేని వాదనలను తెస్తారు. సామాన్య ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తారు. ఆస్తిపరుడు చనిపోయిన అనంతరం మాత్రమే వర్తించేలా కాకుండా, అతడు జీవించి వుండగానే ఆస్తిని పంపకాలు చేసినప్పుడు కూడా వర్తించేలా వారసత్వ పన్ను అమలు చేయాలి.

ఈ సంపద పన్నును గాని, వారసత్వ పన్నును గాని అమలు చేయడం కష్టం అనే వాదనను కొందరు ముందుకు తెస్తారు. పైగా దీని నుండి చాలా తక్కువ మొత్తంలో పన్ను వసూలౌతుందని వారంటారు. అందుచేత భారతదేశంలో పన్ను వసూళ్ళ పద్ధతులను అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన సవరణలన్నీ చట్టాలలో తెచ్చి కచ్చితంగా ఈ పన్ను వసూలే అయ్యేట్టు కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాల్సి వుంటుంది. జపాన్ వంటి దేశాల్లో అది ఎలా అమలు చేయగలుగుతున్నారో కూడా పరిశీలించాలి.

ఈ వారసత్వ పన్ను డిమాండు మన జాతీయోద్యమ డిమాండ్లలో ఒకటిగా ఉంది. 1931లో జరిగిన కరాచీ జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో స్వతంత్ర భారతదేశంలో పౌరులందరూ సమానులుగా ఉండాలని, చట్టం ముందు అందరూ సమానులుగానే పరిగణింపబడాలని, రాజ్యం దృష్టిలో అన్ని మతాలనూ ఒకే విధంగా చూడాలని చెప్పారు. వాటితోబాటు "ఒకానొక పరిమితికి మించిన ఆస్తులు ఉన్నవారి నుండి వారి తదనంతరం ఆస్తులు పొందే వారసులపై పన్ను విధించాలి" అని కూడా ప్రకటించారు. కరాచీ జాతీయ మహాసభలు ఆనాటి మన దేశ రాజకీయ జీవితం మీద వామపక్ష భావజాలం ఆధిక్యత కలిగి వుండడాన్ని సూచిస్తాయి. జాతీయ కాంగ్రెస్ పార్టీ లోపల, వెలుపల కూడా ఈ ఆధిక్యత కనపడుతుంది. ఈ కరాచీ మహాసభలు 1931 మార్చి 26న జరిగాయి. భగత్‌సింగ్, అతడి సహచరులను ఉరితీసిన మూడు రోజుల అనంతరమే జరిగిన మహాసభలు ఇవి. ఈ తీర్మానాలకు ప్రజానీకం నుండి మొత్తంగా ఆమోదం లభించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించినవారు జవహర్‌లాల్ నెహ్రూ. మహాత్మా గాంధీ ఈ తీర్మానాన్ని లోతుగా పరిశీలించి ఆమోదించిన తర్వాతే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ సభలకు అధ్యక్షుడు వల్లభాయ్ పటేల్. ఈ చరిత్ర పరిశీలిస్తే మన ప్రధాని మోడీకి వలస పాలనపై సాగిన జాతీయోద్యమం గురించి ఎటువంటి అవగాహనా లేదని అర్థం ఔతోంది.

ప్రస్తుత పరిస్థితిలో సంపద పన్ను, దానితోబాటు వారసత్వ పన్ను విధించడం చాలా అవసరం. కేవలం పెరుగుతున్న అసమానతలను అరికట్టడానికే కాదు, దేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా మలచడానికి కూడా అవసరం. కరాచీ తీర్మానం ఆశించిన ఆర్థిక న్యాయం అప్పుడే సాధ్యం. **(స్వేచ్ఛానుసరణ)**

ప్రజాశక్తి
www.prajasakti.com

నేడు మూడో దశ పోలింగ్

- 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 93 స్థానాలకు ఎన్నికలు
- 1,351 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మూడో దశ పోలింగు మంగళవారం జరగనుంది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 93 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 1,351 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడో దశ పోలింగ్‌లో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 94 నియోజకవర్గాలకు పోలింగ్ జరగాల్సి ఉండగా, గుజరాత్‌లోని సూరత్‌లో బిజెపి ఇప్పటికే అనూహ్యంగా గెలిచింది. అలాగే, జమ్ము కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ స్థానానికి ఓటింగ్ మే 25కు వాయిదా పడింది. అయితే, మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో రెండో దశలో ఏప్రిల్ 26న జరగాల్సిన పోలింగ్ కూడా మూడో దశలో జరుగుతోంది. ఈ దశలో బరిలో నిలిచిన ప్రముఖులు కేంద్ర మంత్రులు అమిత్ షా (గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా (గుణ), బిజెపి తిరుగుబాటు నాయకుడు కెఎస్ ఈశ్వరప్ప (షిమోగా), దిగ్విజయ్ సింగ్ (రాజ్‌ఘడ్), డింపుల్ యాదవ్ (మెయిన్‌పురి), శివరాజ్‌సింగ్ చౌహాన్ (విదిశ), సుప్రియా సులే (బారమతి) తదితరులు ఉన్నారు. మరోవైపు ఇప్పటికే ఏప్రిల్ 19న తొలిదశ పోలింగ్, ఇక ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ పూర్తయ్యింది. ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉంటుంది.

విజయన్, ఆయన కుమార్తెపై విచారణకు తిరస్కృతి

తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టి.వీణలపై విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విజిలెన్స్ కోర్టు కొట్టివేసింది. లాజిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించి తాను చేసిన ఆరోపణలపై విజిలెన్స్ కోర్టు ప్రత్యక్ష విచారణ జరపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే కుజల్నాదన్, ఆ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. విజయన్ ప్రభుత్వంపై బురదచల్లేందుకు దీనిని ఒక అస్త్రంగా వాడుకోవాలని కాంగ్రెస్ చూసింది. ఎన్నిసార్లు ప్రశ్నించినప్పటికీ కుజల్నాదన్ అవసరమైన ఆధారాలు చూపలేకపోవడంతో విజిలెన్స్ కోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. ఏ ఆధారాలు లేకుండా ఎలా కోర్టుకు వచ్చారని ప్రశ్నిస్తే ఆయన బిక్కమొగం వేశారు.

పూంచ్ దాడి అనుమానితుల ఊహాచిత్రాలు విడుదల

శ్రీనగర్ : ఈ నెల 4న పూంచ్ వద్ద ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్) వాహనాలపై దాడి కేసులో ఇద్దరు అనుమానితుల ఊహాచిత్రాలను భారత సైన్యం సోమవారం విడుదల చేసింది. నిందితుల ఆచూకీ చెప్పిన వారికి రూ.20 లక్షల నగదు బహుమతితో పాటు ఆచూకీ చెప్పిన వారి గుర్తింపు రహస్యంగా ఉంచుతామని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం మధ్యాహ్నం పూంచ్‌లోని సూరన్‌కోట సమీపంలో జరిగిన దాడిలో ఇద్దరు లేదా ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు సైన్యం అనుమానిస్తోంది. ఈ దాడిలో ఒక ఐఎఎఫ్ జవాన్ మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. నిందితుల కోసం పూంచ్ అటవీ ప్రాంతంలో భారీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

మహారాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుపై బాంబే హైకోర్టు స్టే

ముంబయి : ప్రభుత్వ పాఠశాల ఒక కిలోమీటరు పరిధిలో ఉంటే ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) కింద ప్రవేశాలకు మినహాయింపు ఇస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుపై బాంబే హైకోర్టు సోమవారం స్టే విధించింది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రజా ప్రయోజనాలకు సంబంధించినదని, పూర్తి విచారణ చేయాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి డికె ఉపాధ్యాయ, న్యాయమూర్తి జస్టిస్ ఆరిఫ్ డాక్టర్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇలాంటి ఉత్తర్వులు చిన్నారులకు ఉచిత విద్యను అందించడానికి ఆటంకం కలిగిస్తాయని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఫిబ్రవరి 9న మహారాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వు పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) 2009లోని నిబంధనలకు విరుద్ధంగా ఉందని పిటీషన్ దాఖలైంది. ఆర్‌టిఇ ప్రకారం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి లేదా ప్రీ-ప్రైమరీ సెక్షన్‌లో ఇబిసి, ఒబిసి చిన్నారులకు 25 శాతం సీట్లను కేటాయించాలి. వీరి ఫీజులను ప్రభుత్వం పాఠశాలలకు తిరిగి చెల్లిస్తుంది. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రభుత్వ పాఠశాల ఉంటే ఆర్‌టిఇ అమలు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. దీనిపై విమర్శలు వెళువెత్తుతున్నాయి.

15న సెంథిల్ బాలాజీ బెయిల్ పిటీషన్ విచారణ

న్యూఢిల్లీ : తమిళనాడు మాజీ మంత్రి వి సెంథిల్ బాలాజీ దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 15కు వాయిదా వేసింది. సోమవారం ఈ పిటీషన్‌ను జస్టిస్ ఎఎస్ ఒకా నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 328 రోజుల నుంచి కస్టడీలో ఉన్నానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని సెంథిల్ బాలాజీ ఈ పిటీషన్‌లో కోరారు. బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను, బాధితులను సెంథిల్ బాలాజీ ప్రభావితం చేస్తారని ఇడి అభ్యంతరం వ్యక్తం చేసింది. 2014-15 మధ్య జరిగిన జాబ్ రాకెట్ స్కామ్‌లో సెంథిల్ బాలాజీని ఇడి గత ఏడాది జూన్‌లో అరెస్టు చేసింది. సెంథిల్ బాలాజీ బెయిల్ పిటీషన్‌ను ఏప్రిల్ 1న మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

విజేత ఎవరైనా ఓడేది ప్రజాస్వామ్యమే

- భారత్‌లో పరిస్థితులపై అంతర్జాతీయ సమాజం వ్యాఖ్య
- మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆందోళన
- విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మన దేశాన్ని 'విశ్వ గురు' అని అంటారు. విశ్వ గురు అంటే ప్రపంచ నేత అని అర్థం. అయితే ప్రపంచ దేశాలు భారత్‌ను అలా చూస్తున్నాయా? లేదనే చెప్పాలి. పలు అంతర్జాతీయ సమాజాలు, హక్కుల సంఘాలు మన దేశంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను తూర్పార పడుతున్నాయి. హిందూత్వ శక్తులు పెట్రేగిపోవడాన్ని వేలెత్తి చూపుతున్నాయి. ఐక్యరాజ్యసమితి నిపుణులు, పౌర సమాజ గ్రూపుల నుండి అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల పార్లమెంటేరియన్ల వరకూ భారత ప్రజాస్వామ్యం పనితీరును ఎండగట్టారు. గత నెల 16 నుండి 30వ తేదీ వరకూ ఆయా సంస్థలు, నాయకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు....

సిఎన్ఎన్, అమెరికా

మోడీ పరిపాలనలో మతపరమైన విభజనలు చోటుచేసుకుంటున్నాయి. మతోన్మాదం ప్రబలుతోంది. హిందూ జాతీయతావాదాన్ని ముందుకు తీసుకుపోవడానికే మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. విధానపరమైన వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి దీనిని ఎంచుకున్నారు.

ఎన్‌పిఆర్, అమెరికా

అయోధ్యపై 2019లో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం చూపిన ప్రభావాన్ని ఈ పత్రిక వివరించింది. దాని ప్రకారం... అయోధ్య తీర్పు నుండి ప్రేరణ పొందిన మధురలోని హిందూ జాతీయతావాదులు అక్కడి మందిరం, మసీదు వివాదానికి సంబంధించిన దశాబ్దాల నాటి ఒప్పందానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.

ది గార్డియన్, బ్రిటన్

సార్వత్రిక ఎన్నికలపై ఈ పత్రిక ఏప్రిల్ 24న తన సంపాదకీయంలో ఇలా రాసింది.... నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్నికల్లో విజేత ఎవరైనా ఓడేది మాత్రం భారత ప్రజాస్వామ్యమే. ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం, పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం వంటివి బలహీనమైన ప్రజాస్వామ్యానికి సంకేతాలుగా పత్రిక విమర్శించింది. అలాగే, రాజస్థాన్‌లో గత నెల 21న ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రసంగాన్ని ఈ పత్రిక ప్రస్తావించింది. ముస్లింలను చొరబాటుదారులుగా, అధిక సంతానం కలిగిన వారిగా ప్రధాని పేర్కొనడాన్ని తప్పుపట్టింది.

ది గ్లోబ్ అండ్ మెయిల్, కెనడా

పది సంవత్సరాల మోడీ పాలనలో భారత్ మారిపోయింది. హిందూ జాతీయతావాదులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. తద్వారా సామాజిక మాధ్యమాలపై ఓ కొత్త నైతిక కోడ్‌ను విధించారు. అది భారత్‌లోని రోజువారీ సమాజ జీవితాన్ని బెదిరిస్తోంది.

ది న్యూయార్క్ టైమ్స్, అమెరికా

అయోధ్యలో రామమందిర నిర్మాణం భారత్‌ను హిందూ దేశంగా మార్చింది. అసమానతలు, ఉద్యోగావకాశాలు లేకపోవడం, ప్రజారోగ్యానికి విఘాతం కలగడం, వాతావరణ మార్పుల విధ్వంసం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదు. దీనివల్ల ప్రపంచంలో భిన్నత్వం కలిగిన దేశాల్లో ఒకటైన భారత్ భయాందోళనలతో నిండిన దేశంగా మారింది.

పిబిఎస్, అమెరికా

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి కూడా పరీక్ష ఎదురవుతోంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా జరుగుతాయా అనే దానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మీడియా సంస్థలతో పాటు పలువురు పార్లమెంటేరియన్లు, విదేశీ పాత్రికేయులు, నిపుణులు, అమ్నెస్టీ ఇంటర్నేషనల్, అమెరికా విదేశాంగ శాఖ, ఇండియన్ డయాస్పొరా గ్రూపులు, కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్, ది ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ వంటి సంస్థలు కూడా దేశంలో క్షీణిస్తున్న ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన వ్యక్తం చేశాయి.

ప్రజ్వల్ తలెత్తుకోకుండా చేయాలి

- బాధితురాలి సోదరి ఆగ్రహం

బెంగళూరు : అత్యాచారాల నిందితుడు ప్రజ్వల్ రేవణ్ణకు విధించే శిక్ష ఆయన్ని తలెత్తుకొని తిరగకుండా చేయాలని అత్యాచార బాధితురాలి సోదరి మాల (పేరు మార్చడం జరిగింది) అభిప్రాయపడ్డారు. జెడిఎస్ ఎంపీ, హసన్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి ప్రజ్వల్ రికార్డు చేసిన మూడు వేల వీడియో క్లిప్పింగుల్లో బాధితురాలు మృదుల (పేరు మార్చడం జరిగింది) కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మృదుల కుటుంబసభ్యులు గుర్తించే లోగానే రేవణ్ణ కుటుంబ సన్నిహితుడు సతీష్ బాబన్న ఆమెను కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. వీడియోల వ్యవహారాన్ని మృదుల బంధువులు, స్నేహితులు ఆమె కుమారుడి దృష్టికి తీసుకెళ్లారు.

మృదుల, ఆమె భర్త ఇద్దరూ ప్రజ్వల్ తండ్రి హెచ్‌డి రేవణ్ణ వ్యవసాయ క్షేత్రంలో పనిచేశారు. మూడు సంవత్సరాల క్రితం అక్కడ పని మానేసి గర్భిణిగా ఉన్న కుమార్తె బాగోగులు చూసుకోవడానికి మైసూరు జిల్లాలోని స్వగ్రామం వచ్చారు. 'ఆమె తనపై జరిగిన అత్యాచారం గురించి అప్పుడు కూడా ఎవరికీ చెప్పలేదు. మేము ఆమెను తిడతామేమోనని భయపడి ఉంటుంది. కానీ ఆమె అత్యాచారానికి గురైంది. ఆమె ఏ తప్పూ చేయలేదు. కానీ ప్రజలేమో ఆమెదే తప్పని అంటున్నారు. మా తప్పేమీ లేకపోయినా పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదు' అని మృదుల సోదరి మాల ఆవేదన వ్యక్తం చేశారు. సతీష్‌ను ఈ నెల 3న పోలీసులు అరెస్టు చేసి మృదులను కాపాడారు. ఆ మరునాడు బెంగళూరు తీసుకొచ్చారు. అదే రోజు హెచ్‌డి రేవణ్ణను కూడా అరెస్టు చేశారు. రెండు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినప్పటికీ ప్రజ్వల్ ఇంకా పరారీలోనే ఉన్నారు. కుటుంబ సభ్యులు మృదులను చిట్టచివరి సారిగా గత నెల 24న చూశారు. సతీష్‌తో కలిసి వెళ్లిన మృదుల పోలింగ్ రోజు తిరిగి వచ్చారు. రెండు రోజుల తర్వాత సతీష్ మళ్లీ వచ్చి తనతో రావాలని మృదులను ఒత్తిడి చేశాడు. మృదులకు సంబంధించిన ఓ పోలీసు కేసుకు సంబంధించి మాట్లాడేందుకు రమ్మని హెచ్‌డి రేవణ్ణ చెప్పారని తెలిపాడు. దీంతో ఆమె సతీష్ వెంట వెళ్లారు.

ఆ తర్వాత మృదులను కలిసేందుకు కుటుంబసభ్యులు ఎంతగానో ప్రయత్నించారు. అయితే మృదులను పోలీసులు అరెస్ట్ చేశారని, బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని సతీష్ వారికి చెప్పాడు. మృదులను బంధించి అత్యాచారం జరిపిన వీడియో బయటకు వచ్చిన తర్వాతే ఆమె కుమారుడికి విషయం తెలిసింది. మృదులను కిడ్నాప్ చేశారని అర్థం చేసుకున్న కుటుంబసభ్యులు ఈ నెల 2న కెఆర్ నగర పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రజ్వల్ రాజకీయ ప్రత్యర్థులు ఆ వీడియోలను పెన్‌డ్రైవ్‌లలో అప్‌లోడ్ చేసి హసన్ జిల్లాలోని పార్కులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాపులు, దుకాణాల్లో పంపిణీ చేశారు. హసన్‌లో పోలింగుకు ముందు ఈ వీడియోలు వైరల్ అయ్యాయి.

'ఉపాధి' వేతనాలను రూ.400కు పెంచుతాం

- రాహుల్‌గాంధీ

అలిరాజ్‌పూర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) కింద ఇచ్చే వేతనాలను రోజుకు రూ.400కు పెంచుతామని ఆ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. సోమవారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రత్లామ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అలిరాజ్‌పూర్ పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 'శతకోటీశ్వర్లకు రుణాలను మాఫీ చేస్తూ దానినే అభివృద్ధి అని గొప్పలు చెబుతున్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ కింద మీకు రోజుకు రూ.250 వస్తుందని మా దృష్టికి వచ్చింది. మేం అధికారంలోకి రాగానే రోజుకు రూ.400 వేతనాలు ఇస్తాం' అని రాహుల్ చెప్పారు. ఆ తరువాత ఖర్గాన్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సెగాన్ పట్టణంలో ఎన్నికల ర్యాలీలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి 150 స్థానాలు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రక్షించడానికి చేస్తున్న పోరాటానికి ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు.

కొలంబియా వర్సిటీలో కాల్పులు

- కొనసాగుతున్న దమనకాండ
- వైఖరిలో మార్పులేదన్న బైడెన్
- వామపక్ష రాడికల్స్ అంటూ ట్రంప్ అవహేళన



న్యూయార్క్: గాజా పట్ల అమెరికా విధానానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దమన కాండ కొనసాగుతోంది. న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని హామిల్టన్‌హాలు లోపల ఓ పోలీసు తుపాకీతో కాల్పులు జరిపాడు. మరో పోలీసు మెట్లపై నుంచి ఓ విద్యార్థిని కిందకు తోసేశాడు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో 200 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. విస్కాన్సిన్-మాడిసన్ విశ్వ విద్యాలయంలో పోలీసులు నిరసన శిబిరాలను తొలగించారు. అయితే, 24 గంటలు కూడా తిరగక మునుపే విద్యార్థులు అదే చోట 30 గుడారాలను ఏర్పాటుచేసుకున్నారు. చాలా యూనివర్సిటీల్లో పోలీసులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం. న్యూయార్క్‌లోని పోర్టు హామ్ యూనివర్సిటీ, న్యూహాంప్‌షైర్‌లోని డార్ట్ మౌత్‌కామ్ యూనివర్సిటీ, న్యూ ఓర్లీన్స్‌లోని టూ లేన్ వర్సిటీల్లో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఇలినాయిస్‌లో నార్త్ వెస్టర్న్ వర్సిటీ, చికాగో విశ్వవిద్యాలయం, రోడ్ ఐలండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీ, ఇతర కొన్ని కళాశాలల యాజమాన్యాలు మాత్రం పోలీసులను పిలవకుండా నిరసనకారులతో శాంతియుత చర్చలు జరుపుతున్నాయి. కొలంబియా యూనివర్సిటీలోకి పోలీసులను పిలిపించిన యూనివర్సిటీ చాన్సలర్ మినోచె షఫిక్ చర్యను అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ అసోసియేషన్ (ఎఎయుపి) ఖండించింది. దీనిని సాయుధ ఉగ్రవాద చర్యగా అభివర్ణించింది.

బ్రిటన్ వర్సిటీల్లోను నిరసన శిబిరాలు

గత కొద్ది వారాలుగా అమెరికా, కెనడా, ఫ్రాన్స్ సహ పలు దేశాల్లో సాగుతున్న విద్యార్థుల నిరసన శిబిరాలు తాజాగా బ్రిటన్‌కు పాకాయి. గాజాకు సంఘీభావంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీల్లో విద్యార్థులు పాలస్తీనా అనుకూల శిబిరాలను ఏర్పాటు చేశారు. పాలస్తీనియన్లకు సంఘీభావం తెలియచేయడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కొన్ని రోజుల పాటు ఈ శిబిరాన్ని ఇలాగే కొనసాగించాలని భావిస్తున్నట్లు విద్యార్థులు తెఇపారు. గాజాలో మారణహోమాన్ని, వర్ణవివక్షతను తక్షణమే నిర్మూలించాలని కోరారు. ఇజ్రాయిల్ ఆక్రమణల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే సంస్థలు, కంపెనీల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని కోరారు. గాజాలో ఉన్నత విద్యా రంగాన్ని పాలస్తీనా నేతృత్వంలో పునర్నిర్మిస్తామని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ హామీ ఇవ్వాలని కూడా వారు కోరారు.

మా వైఖరిలో మార్పులేదు: బైడెన్

అంతులేని సైనిక సహాయాన్ని ఇజ్రాయిల్ యుద్ధ తంత్రంలోకి పంప్ చేస్తున్న బైడెన్ ఈ నిరసనలకు తాను భయపడేది లేదని, ఇజ్రాయిల్ పట్ల తన ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. నిరసనలు ప్రభుత్వ విధానంలో ఏమైనా మార్పు తెస్తాయా అని విలేకరులు వైట్ హౌస్‌లో బైడెన్‌ను ప్రశ్నించినపుడు లేదు అని పెడసరంగా సమాధానమిచ్చారు. యూనివర్సిటీ విద్యార్థుల నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్న బైడెన్, శాంతి భద్రతల పేరుతో పోలీసుల దమనకాండను సమర్థించుకున్నారు. యూనివర్సిటీలో వందల వేల డాలర్లు ట్యూషన్ ఫీజు చెల్లించిన విద్యార్థులు ఈ నిరసనల వల్ల విద్యాహక్కును కోల్పోతున్నారని, జీవితాంతం ఆ అప్పుల బాధ వారిని వెంటాడుతుందని మొసలి కన్నీరు కార్చారు. గాజాలో ఇజ్రాయిల్ గత ఏడు నెలలుగా సాగిస్తున్న దురాక్రమణ పూరిత దాడుల్లో 14 వేల మంది పిల్లలు చనిపోతే ఆయనకు ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు. మొత్తంగా 35 వేల మంది అమాయక పౌరులు చనిపోయారు. వీరిలో 70శాతం మంది మహిళలే. ఈ దాడుల్లో 14 లక్షల మంది దాకా శరణార్థులుగా మారారు. వీటి గురించి బైడెన్ ఏమీ మాట్లాడరు. పైగా 1400 కోట్ల డాలర్ల సైనిక సహాయాన్ని ఇజ్రాయిల్‌కు అందుజేయాలని ఆయన తాజాగా ఆదేశించారు.

విద్యార్థులు ప్రజాస్వామ్య యుతంగా శాంతియుత పద్ధతుల్లో తెలుపుతున్న నిరసనలపై బైడెన్, ట్రంప్ , వారి అధీనంలోని ప్రచార బాకాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కొలంబియా యూనివర్సిటీలో నిరసన తెలుపుతున్నవారిలో యూదు విద్యార్థులు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని కావాలనే మరుగుపరచి నిరసనకారులను యూదు వ్యతిరేకులుగాను, వామపక్ష రాడికల్స్‌గాను చిత్రించేందుకు కార్పొరేట్ మీడియా యత్నిస్తోంది. ఇజ్రాయిల్ చర్యను ప్రపంచంలో చాలా దేశాలు ఖండించాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు, పచ్చి మితవాది ట్రంప్ మాత్రం ఈ నిరసనలను 'వామపక్ష రాడికల్స్ విప్లవం' అంటూ సోషల్ మీడియాలో చిందులేశారు. ప్రజాస్వామ్యానికి ముప్పు లెఫ్ట్ నుంచే కానీ, రైట్ నుంచి కాదని ఆయన సెలవిచ్చారు.

బ్రెజిల్‌ను ముంచెత్తిన వర్షాలు, వరదలు

- 78మంది మృతి, వేలాదిమంది తరలింపు

పోర్ట్ అలెగర్: దక్షిణ బ్రెజిల్‌ను వర్షాలు, వరదలు ముంచెత్తాయి. రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించడంతో 78మంది మరణించారు. లక్షా 15వేల మంది నిరాశ్రయులయ్యారు. పలు నగరాలు నీట మునిగాయి. వేలాదిమంది ప్రజలకు ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రియో గ్రాండె రాష్ట్ర రాజధాని పోర్టో అలెగ్రెలో ప్రజలు ఇళ్ల పైకప్పుల మీద ఎక్కి కూర్చున్నారు. నదుల్లాగా మారిన వీధుల్లో చిన్న చిన్న పడవలు వేసుకుని ప్రజలు వెళుతున్నారు. ఆందోళనకరంగా పరిణమించిన వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావమే ఈ విపత్తుకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పరిస్థితులు అనుకూలించకపోవడంతో 3వేల మందికి పైగా సైనికులను, అగ్నిమాపక సిబ్బందిని, ఇతర సహాయక కార్యకర్తలను రంగంలోకి దించారు. ప్రాథమిక అవసరాలు కూడా తీరని ఇబ్బందికర పరిస్థితుల్లో అనేకమంది చిక్కుకుపోయి, ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. మొత్తంగా 341 పట్టణాలు, గ్రామాలు వరద తాకిడికి గురయ్యాయి. తాజా పరిస్థితుల్లో 105మంది గల్లంతయ్యారని పౌర రక్షణాధికారులు తెలిపారు. యుద్ధం సంభవించి అంతా తుడిచిపెట్టుకుపోయినట్లు వుందని, యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలను చేపట్టాల్సి వుందని రియో గ్రాండ్ గవర్నర్ ఎడ్వర్డ్ లెయిట్ తెలిపారు. అధ్యక్షుడు లూలా డసిల్వా అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు.

ఆస్ట్రేలియాలో భారత విద్యార్థి హత్య

మెల్‌బోర్న్, చండీగఢ్ : ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థి ఒకరు కత్తిపోట్లకు గురై మరణించాడు. ఈ హత్యతో సంబంధముందని భావిస్తున్న మరో ఇద్దరు భారతీయుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి అద్దె విషయమై స్నేహితుల మధ్య తలెత్తిన గొడవ ఈ హత్యకు దారి తీసినట్లు తెలుస్తోంది. అయితే మృతుడు నవజీత్ సంధు(22)కు ఈ గొడవకు అసలు సంబంధం లేదు. వారిని ఘర్షణ పడవద్దని వారించినందుకే ఈ దాడి జరిగిందని తెలుస్తోంది. హర్యానాలోని కర్నాల్‌కి చెందిన నవజీత్ చదువు కోసం ఏడాదిన్నర క్రితం ఆస్ట్రేలియా వచ్చాడు. ఈ ఏడాది జులైలో శలవుల కోసం స్వదేశానికి రావాల్సి వుంది. ఈలోగానే ఇంత ఘోరం జరిగింది. వేరే చోటకు ఇల్లు మారదామనుకున్న నవజీత్ స్నేహితుడు (మరో భారతీయ విద్యార్థి) తన సామాన్లతో కొత్త ఇంటికి తీసుకెళ్ళడానికి సాయం చేయాల్సిందిగా నవజీత్‌ను అడిగాడు. కారులో ఫ్రెండ్‌ను తీసుకెళ్ళడానికి వచ్చిన నవజీత్‌కు లోపల ఇంట్లో నుండి అరుపులు వినిపించడంతో లోపలకు వెళ్ళి అక్కడ ఘర్షణ పడుతున్న వారిని అడ్డుకోబోయాడు. వెంటనే ఛాతీలో తీవ్రంగా కత్తితో పొడవడంతో నవజీత్ చనిపోయాడని, అతడి స్నేహితుడు కూడా గాయపడ్డాడని నవజీత్ మావయ్య యశ్వీర్ తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున తమకు సమాచారం అందిందని చెప్పారు. నిందితులు కూడా కర్నాల్‌కి చెందినవారేనని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని

జెపి నడ్డా, అమిత్, విజయేంద్రపై కేసు

బెంగళూరు : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, పార్టీ ఐటి సెల్ అధ్యక్షులు అమిత్ మాలవీయ, పార్టీ కర్ణాటక అధ్యక్షులు బివై విజయేంద్రపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. సోషల్ మీడియా పోస్టులో ఒక అభ్యర్థికి ఓటు వేయవద్దని ఎస్‌సి, ఎస్‌టి ప్రజలను బిజెపి నాయకులు బెదిరింపులకు గురి చేశారని కెపిసిసి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు ఐపిసిలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 505 (2) ప్రకారం కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక బిజెపి అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన వీడియోను కూడా ఫిర్యాదులో కాంగ్రెస్ జత చేసింది. బిజెపి పోస్టు చేసిన వీడియో ఉద్దేశపూర్వకంగా అల్లర్లను రెచ్చగొట్టడం, వివిధ మతాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందించడం, ఒక నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేయవద్దని ఎస్‌సి, ఎస్‌టిలను బెదిరించడం, ప్రజల మధ్య సామరస్యాన్ని విఘాతం కలిగించేదిగా ఉందని కాంగ్రెస్ తన ఫిర్యాదులో పేర్కొంది.

13లోగా నా పిటిషన్‌ను విచారించండి

- సుప్రీంను కోరిన హేమంత్ సోరెన్

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ ఆరోపణలపై తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ పెట్టుకున్న పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాల్సిందిగా జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ముందు సోరెన్ తరపు న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఈ నెల 13న జార్ఖండ్‌లో పోలింగ్ జరగనుందని, తన పార్టీకి ప్రచారం చేసుకోవడానికి తనను అనుమతించాలని కోరారు. దీర్ఘకాలం నుండి హైకోర్టు తీర్పును పెండింగ్‌లో పెడుతోంది. ఫిబ్రవరిలో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసుకుంది. ఎంతకూ హైకోర్టుకు తీర్పును ప్రకటించకపోవడంతో చివరగా, తాత్కాలిక బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేసుకోవాల్సి వచ్చిందని సిబల్ తెలిపారు. సోరెన్ హక్కులు పూర్తిగా ఉల్లంఘించబడుతున్నాయని సిబల్ పేర్కొన్నారు. తాత్కాలిక బెయిల్‌పై పిటిషన్ మంగళవారం విచారణకు రానుందని చంద్రచూడ్ తెలియజేయగా, హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను కూడా దానితోపాటు విచారించాలని సిబల్ కోరారు. సోరెన్‌పై కేసును కొట్టివేయడానికి మే 3వ తేదీన హైకోర్టు తిరస్కరించింది. ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన వెంటనే జనవరి 31న సోరెన్‌ను అరెస్టు చేశారు.

ఉత్తరాఖండ్ కార్చిచ్చుపై రేపు విచారణ

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ కార్చిచ్చుపై దాఖలైన పిటిషన్లను 8వ తేదీన అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఈ దావానలం సంఘటనల్లో 90శాతం ఉద్దేశపూర్వకంగా చోటు చేసుకున్నవేనని పిటిషనర్లు పేర్కొన్నారు. గతంలో చోటుచేసుకున్న కార్చిచ్చు ఘటనలకు సంబంధించిన కేసులు సుప్రీం కోర్టులో ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న విషయాన్ని వారు గుర్తు చేశారు.విచారణ సమయానికల్లా స్టేటస్ రిపోర్ట్‌ను కోర్టుకు దాఖలు చేస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తెలిపింది. పరిస్థితి చాలా దారుణంగా, దిగ్భ్రాంతికరంగా వుంది. మొత్తంగా ఆ ప్రాంతాల్లో కార్బన్ డయాక్సైడ్ పెద్దయెత్తున గాలిలో కలుస్తోందని జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ప్రభుత్వం నివేదికను అందజేసింది. దీనిపై విచారణ సమయంలో అమికస్ క్యూరీ, కేంద్ర సాధికార కమిటీని కూడా తీసుకురావాల్సి వుంటుందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. గత ఆరు మాసాల్లో 900కి పైగా కార్చిచ్చు సంఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తంగా 1100 హెక్టార్ల అటవీ భూములు తగలబడ్డాయి. వీటిలో 351 కేసులు మనుష్యుల వల్ల జరిగినవేనని వార్తా కథనాలు తెలుపుతున్నాయి. పదే పదే కార్చిచ్చు రగులుతున్నా నిర్లక్ష్యం, నిష్క్రియాపరత్వం, పట్టిపట్టని ధోరణి, సంసిద్ధత కొరవడడం వంటి కారణాలతో అడవులకు తీరని నష్టం జరుగుతోందని పిటిషన్‌దారులు పేర్కొంటున్నారు. దీనివల్ల వన్యప్రాణి సంరక్షణ ప్రమాదంలో పడుతోందన్నారు.

కేజ్రీవాల్‌పై ఎన్ఐఎ విచారణ

- ఢిల్లీ ఎల్‌జి సిఫార్సు

న్యూఢిల్లీ : సిఖ్స్ ఫర్ జస్టిస్' అనే ఉగ్రవాద సంస్థ నుంచి రాజకీయ విరాళాలు తీసుకున్నారనే ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఎన్ఐఎ విచారణ చేయాలని రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సెనా సిఫార్సు చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ కార్యదర్శికి సక్సెనా ఒక లేఖ రాసినట్లు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 1993 బాంబు పేలుళ్ల కేసు దోషి దేవేంద్రపాల్ భుల్లార్ విడుదలకు సహకరించాలని కోరుతూ ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాద సంస్థల నుంచి 16 మిలియన్ డాలర్లను కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ స్వీకరించినట్లు తనకు ఫిర్యాదు అందినట్లు సక్సెనా లేఖలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా లేఖతో సక్సెనా జత చేసినట్లు సమాచారం.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే విషయాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించిన కొన్ని రోజుల్లోనే వికె సక్సెనా ఇలాంటి లేఖ రాయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'బిజెపి ఆదేశాలతో కేజ్రీవాల్‌పై ఇది మరొక కుట్ర'గా ఆప్ విమర్శించింది. ఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ స్థానాల్లోనూ ఓటమి చెందుతామనే భయంతోనే బిజెపి ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని ఆప్ నాయకులు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు.

రఫాపై భూతల దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు సాగుతున్న ఇజ్రాయిల్‌పై మరిన్ని ఆంక్షలు విధిస్తామని బెల్జియం ప్రకటించింది.

రఫా నగరాన్ని వీడి వెళ్ళవద్దని పాలస్తీనియన్ల వ్యవహారాలు చూసే ఐక్యరాజ్య సమితి శరణార్ధ సంస్థ (యుఎన్ ఆర్‌డబ్ల్యుఎ)తో మానవతా సంస్థలకు హమాన్ విజ్ఞప్తి చేసింది. మరోవైపు, ఈజిప్ట్ రాజధాని కైరోలో కాల్పుల విరమణ చర్చలు విఫలమయ్యాయి. నెతన్యాహు అనుసరించిన నిరంకుశ వైఖరే దీనికి కారణమని హమాస్ విమర్శించింది.

ఆమోదయోగ్యం కాదు

రఫాను ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ జారీ చేసిన ఆదేశాలు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని యురోపియన్ యూనియన్ దౌత్యవేత్త జోసెఫ్ బొరెల్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. భద్రతా మండలి ఆమోదించిన 2728 తీర్మానాన్ని ఇజ్రాయిల్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన కోరారు.

పత్రికా స్వేచ్ఛకు గ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

గత వారం అరెస్ట్ చేశారు. గౌతమ్ నవ్‌లఖా 2020 నుండి గృహనిర్బంధంలోనే ఉన్నారు. కాశ్మీర్‌కు చెందిన సజాద్ గల్, జార్ఖండ్ రిపోర్టర్ రేపేష్ కుమార్ సింగ్ 2022 నుండి, కాశ్మీర్ పాత్రికేయులు ఇర్ఫాన్ మెహరాజ్, మజీద్ హైదరీలు 2023 నుండి జైలులోనే మగ్గుతున్నారు. న్యూస్‌క్లిక్ పోర్టల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ గత సంవత్సరం నుండి జైలులో ఉన్నారు. న్యూస్‌క్లిక్ ఉద్యోగుల కార్యాలయాలు, పని ప్రదేశాలపై కూడా దాడులు జరిగాయి. ప్రజల పక్షాన నిలిచి, నిజాలను నిర్భయంగా చెప్పే కలం వీరులకు వెన్నుపోటు పొడవడానికి పాలకపక్షం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని ఈ ఉదంతాలు రుజువు చేస్తున్నాయి.

నిఘా నీడలో...

పైగా అరెస్టు చేసిన పాత్రికేయులపై మోపిన సెక్షన్లు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఉదాహరణకు ప్రబీర్‌కు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, ఆయనకు విదేశీ నిధులు అందుతున్నాయని తీవ్రమైన అభియోగాలు మోపారు. మసీదు కూల్చివేతపై వార్త రాసిన నేరానికి ఓ యువ పాత్రికేయుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దేశంలో పలువురు పాత్రికేయులు నిఘా నీడలో జీవించాల్సి వస్తోంది. వారిపై హిందూత్వ శక్తులు ఓ కన్నేసి ఉంచుతారు. అనుమానం కలిగితే చాలు... గద్దల్లా వాలిపోతారు. సామ దాన బేధ దండోపాయాలు ప్రయోగిస్తారు.

శభాష్...శాంత

'ది వైర్' పోర్టల్‌కు చెందిన సుకన్య శాంత భారతీయ కారాగారాల్లో కుల వివక్షపై ఓ కథనాన్ని అందించారు. దీనిని సుమోటోగా స్వీకరించిన రాజస్థాన్ హైకోర్టు జైళ్ల నిబంధనలను మార్చింది. అయినప్పటికీ పెద్దగా మార్పేమీ రాలేదు. దీనిపై హక్కుల సంఘం చర్యలు తీసుకుంటుందేమోనని శాంత మూడు సంవత్సరాలు ఎదురు చూశారు. ఫలితం లేకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. ఎవరూ పట్టించుకోనంత మాత్రాన వెనక్కి తగ్గాల్సిన అవసరమేముందని ఆమె ప్రశ్నించారు. అన్ని కథలూ సుఖాంతం కావు. మహారాష్ట్రలో ఓ ప్రభుత్వ రిఫైనరీ ప్రాజెక్టులో పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని వార్త రాసినందుకు 48 సంవత్సరాల పాత్రికేయుడు శశికాంత్ వరిషే సంవత్సరం క్రితం హత్యకు గురయ్యారు.



వేసవి విడిది

బొమ్మరిల్లు



మురల రిత్సిక,
7వ తరగతి,
సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు.





బి.హేమ,
5వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.



ఎండలు బాబోయ్

ఎండలు బాబోయ్ ఎండలు
ఎక్కువ తిరగొద్దు మనమండోయ్

భగభగ మంటూ ఎండలు
నిప్పుల వాన కురిపిస్తున్నవి


ఉక్కపోతతో జనమంతా
ఉక్కిరి బిక్కిరి అవుతుంద్రు

భానుడి వేడికి భూమంతా
అగ్ని గుండమై మండుతుంది


తరువులు చెరువులు
పక్షులు పశువులు
దాహం దాహం అంటున్నయ్

మనిషి స్వార్థం పెచ్చు పెరుగెను
పర్యావరణం తగ్గిపోయెను

పెరిగిన ఎండలు అగ్నిగుండమై
తలపిస్తున్నాయ్
బయటకు అస్సలు పోవొద్దు
జాగ్రత్తగా మసలడం మేలు!



- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.



ఎర్ర కోడిపుంజు


రాములుది సింగారం అనే ఊరు. రోజూ పొలం పనులు చేస్తాడు. కోళ్లనూ పెంచుతాడు. రాములుకి ఆరేళ్ల కొడుకు ఉన్నాడు. తన పేరు అనిరుధ్. ఒకటవ తరగతి చదువుతున్నాడు. అనిరుధ్‌కి ఎర్ర కోడిపుంజు అంటే చాలా ఇష్టం. రోజూ దానికి నూకలు పోస్తాడు. దానితో ఆడతాడు. ఒకరోజు పక్కింటి సోములు, తన ఇంటికి రేపు చుట్టాలు వస్తున్నారని, విందు కోసం ఒక కోడి కావాలని వచ్చాడు. రాములు ఎంత ప్రయత్నించినా ఏ కోడీ చేతికి అందలేదు. చేసేదేమీ లేక, కొడుకు మచ్చిక చేస్తున్న ఎర్రకోడి పుంజుని అతడికి ఇచ్చేశాడు.

అనిరుధ్ వచ్చాడు. చీకటి పడింది. కోళ్లు అన్నీ గూడులోకి వచ్చాయి. ఎర్రకోడిపుంజు మాత్రం రాలేదు. అనిరుధ్ చాలా సేపు గుమ్మం దగ్గరే నిలబడి ఎదురుచూశాడు. ఇంటి ముందుకీ, వెనక్కీ వెళ్లి చూశాడు. పెరట్లో వెతికాడు. ఎర్రకోడిపుంజు కనపడలేదు. వెక్కివెక్కి ఏడ్చాడు. అన్నం తినలేదు. స్నేహితులందరూ వచ్చి చుట్టూ చేరారు. అందరూ బాధలో మునిగిపోయారు. జరిగిన విషయమంతా తెలుసుకున్న సోములు, ఎర్రకోడి పుంజుని తీసుకొచ్చి రాములుకి ఇచ్చేశాడు. కోడిపుంజును చూడగానే అనిరుధ్ కళ్ళలో ఆనందం పొంగింది. దాన్ని పట్టుకుని గంతులు వేసుకుంటూ పెరట్లోకి పరుగుపెట్టాడు.

- డా.వాసరవేణి పరశురాం,
94921 93437.

జోక్

అభి : అరే బయటికి వెళ్లి చూడరా! సూర్యుడు వచ్చాడో లేదో?
రవి : రాలేదు రా! ఇంకా చీకటిగానే ఉంది.
అభి : తెలివితక్కువ దద్దమ్మ! చీకట్లో ఎలా కనపడతాడురా. టార్చ్‌లైట్ వేసి చూడు..



గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా 'చిన్నారి' ఇలా 'వేసవి విడిది'గా ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్

JEEVANA

జీవన the family

బతుకు మీద ఆశ కల్పిస్తున్నారు..

అల్లారుముద్దుగా పెరుగుతున్న పిల్లలను ఆ మాయదారి రోగం కబళిస్తుందని ఆ తల్లిదండ్రులకు తెలుసు. అయినా ఏ మూలనో ఓ చిన్న ఆశ.. వాళ్లని ఉన్నపళంగా ఊరు విడిచేలా చేసింది. ఊరు కాని ఊళ్లో ఆ హాస్పటల్ చుట్టూ పిల్లలను తిప్పడానికే ఓపిక సరిపోవడం లేదు. పోషకాహారం పెట్టుకుంటే పిల్లలకు కాస్త ఓపిక వస్తుందని తెలిసినా వాళ్లకా శక్తి లేదు. తడవ తడవకి ఊరు వెళ్లి వచ్చే స్థోమత లేక, అక్కడే ఆ హాస్పటల్ ఎదురుగా పుట్‌పాత్‌పైనే తెచ్చుకున్న సంచులు, సామానుతో నివసిస్తున్నారు. వారితోపాటే చికిత్స తీసుకుంటున్న పిల్లలు కూడా. ఈ దృశ్యాలు అక్కడ సర్వసాధారణం. ఎన్నో ఏళ్లుగా అక్కడ కొన్ని వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎంతోమంది వాళ్లని ప్రత్యక్షంగా చూస్తూ ఉంటారు. సాయం చేసే మనసు ఉన్నా, అందరివీ అవే పరిస్థితులు. అయితే ఆ దృశ్యాలను ప్రత్యక్షంగా చూసిన ఇద్దరు స్నేహితులు, అంకిత్ దవే, గిరిష్ నాయర్ ఈ సమస్యకి పరిష్కార దిశగా అడుగులు వేశారు. పదేళ్ల కిందటే అంటే 2014 నుండి 'లైఫ్ సెంటర్స్' పేరుతో వసతి గృహాలు ఏర్పాటు చేస్తూ అలాంటి కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు. ప్రస్తుతం 8 వసతి గృహాలు 2000 మంది పిల్లలకి వసతి అందిస్తున్నాయి.



ముంబయి, టాటా మెమోరియల్ ట్రస్ట్ హాస్పటల్‌కి సుదూర తీరాల నుండి ప్రతి రోజూ వేలాది మంది రోగులు వస్తారు. ముఖ్యంగా కేన్సర్ చికిత్స కోసం కొన్ని వందల మంది బారులుతీరి ఉంటారు. చికిత్సలో భాగంగా కీమోథెరపీలు చేయించుకునేందుకు వారంతా కొన్నినెలల పాటు అక్కడే ఉండాల్సి వస్తుంది. అయితే వీరందరికీ ఆస్పత్రిలో వసతి లభించదు. దీంతో వారంతా హాస్పటల్ ఎదుట పుట్‌పాత్‌లపైనే నివసిస్తారు. ముంబయి ఒక్క చోటే కాదు, దేశవ్యాప్తంగా క్యాన్సర్ చికిత్స కోసం వెళుతున్న ఎన్నో కుటుంబాలది అదే పరిస్థితి. కీమో థెరపీ తరువాత సరైన పోషకాహారం లేక, నీరసించిపోయి, బతుకు మీద ఆశ చచ్చిపోయి, చికిత్స పూర్తవ్వకుండానే ఎంతోమంది వెనుదిరుగుతారు. అయితే చికిత్స కోసం చిన్న బిడ్డలతో వచ్చిన తల్లిదండ్రులు మాత్రం వెళ్లలేక, ఉండలేక అక్కడే నెలల తరపబడి ఉండిపోతారు. శుష్కించి పోతున్న దేహాలతో కళ్లెదుటే చావుకు దగ్గరౌతున్న బిడ్డలను చూస్తూ ఆ అమ్మానాన్నలు గుండెలు చెరువయ్యేలా ఏడుస్తారు.

ఇదంతా ఒకప్పుడు.. ఇప్పుడు అలా లేదు. ఆ బిడ్డలందరూ అంకిత్, గిరీష్ ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో తలదాచుకుంటున్నారు. ఒక్క ముంబయిలోనే కాక, పూణె, అహ్మదాబాద్, ఛండీగఢ్, బెంగళూరు, మణిపూర్‌లో మొత్తం 8 వసతి కేంద్రాల్లో వీరి సేవా ప్రస్థానం కొనసాగుతోంది.



డిసెంబరు 2023లో వంశిక చికిత్స కోసం, తన కుటుంబం ముంబయికి చేరుకుంది. డాక్టరును కలిసిన తరువాత అక్కడే కొన్ని నెలల పాటు ఉండిపోవాలని ఆ కుటుంబం నిశ్చయించుకుని మరీ వచ్చింది. కానీ అక్కడి పరిస్థితులు ఆ తల్లిదండ్రికి విపరీతమైన భయాన్ని, అంతకుమించి దు:ఖాన్ని తెచ్చిపెట్టాయి. అప్పుడే అంకిత్, గిరీష్ గురించి వాళ్లకి తెలిసింది. తమ వసతి గృహంలో పిల్లలకు మెరుగైన జీవితాన్ని ఇస్తామని ఆ స్నేహితులు భరోసా ఇచ్చారు. అంతేకాదు, బిడ్డ ఆలనాపాలనా చూసుకుంటూ అక్కడే ఉండిపోవచ్చని లేదా, పిల్లలను వదిలిపెట్టి ఊళ్లకు వెళ్లి పనులు చేసుకోవచ్చని చెప్పారు.


ఆ వసతి గృహంలో తలదాచుకున్న వంశిక ఇప్పుడు అక్కడి పిల్లలందరితో కలసి చక్కగా ఆడుకుంటుంది. డ్యాన్సులు వేస్తోంది. పోషకాహారం తింటూ త్వరగా కోలుకుంటోంది. వంశిక మాదిరే అక్కడున్న వేలాది మంది చిన్నారుల చిరునవ్వులకు కారణమైన అంకిత్, గిరీష్ గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

అంకిత్ మీడియా రంగంలో ప్రముఖ స్థానంలో ఉన్నాడు. గిరీష్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ నిపుణుడు. సామాజిక సేవలో ఎప్పుడూ ముందుంటే వీరు కొద్దికాలానికే ప్రాణస్నేహితులయ్యారు. 2012లో వారికి ఈ ప్రాజెక్టు ఆలోచన వచ్చింది. దేశంలోని ప్రముఖ పీడియాట్రిక్ కేన్సర్ హాస్పటల్స్‌ని సందర్శించడం మొదలుపెట్టారు. 'అక్కడ నెలల పిల్లల దగ్గర నుండి కీమో చికిత్స తీసుకుంటున్న వారు ఉన్నారు. మొదట, వారికి పడకలు ఇవ్వడం, ఆహారం అందించడం చేయాలని అనుకున్నాం. కానీ ఆ తర్వాతే మాకు తెలిసింది. ఆ పిల్లలకు అంతకు మించి ఇవ్వాలని. గుడారాలు వేసుకుని, రోడ్ల మీదే తిని పడుకుంటున్న ఆ కుటుంబాలు పిల్లలకు చికిత్స చేయించకుండానే వెనుదిరగడం మేము చూశాం. ఎంతో ఆశతో బిడ్డను బతికించుకోవాలనుకున్నా, అది నెరవేరకుండానే వెళ్లిపోవడం ఆ తల్లిదండ్రులకు ఎంత కష్టం? ఆ మానసిక పరిస్థితి తలచుకుని ఎంతో బాధేసింది. అందుకే ఆ బిడ్డలు అందరిలా జీవించేలా, వ్యాధి నుండి త్వరగా కోలుకునేలా చేయాలని గట్టిగా నిశ్చయించుకున్నాం.

దాతల నుండి నిధులు వసూలు చేశాం. ఊహించిన దానికంటే పెద్ద మొత్తంలోనే వచ్చాయి. కానీ వసతి గృహాలకు ఇళ్లు ఇచ్చేవారే కనిపించలేదు. ఎంతోమంది తిరస్కరించారు. ఒక్క ఇళ్లు దొరకడానికి ఏడాది కాలం పట్టింది' అంటూ తమ సేవామార్గం తొలి రోజులను గుర్తుచేసుకున్నారు. 'ఈ ప్రయాణంలో గిరీష్ తన ఇంటిని సైతం అమ్మేశాడు. అయినా ఆ విషయం బయటికి చెప్పడానికి కూడా అతను ఇష్టపడడు' అంటూ అంకిత్ స్నేహితుని గురించి గర్వంగా చెబుతాడు.

ప్రస్తుతం 140 కుటుంబాలు 2000 మంది పిల్లల్తో ఈ వసతి గృహాల్లో నివసిస్తున్నాయి. పిల్లలకు పోషకాహారం వండేందుకు కేర్ టేకర్లు నియమించారు. కొంతమందికి స్వయంగా తమ పిల్లలకు వండిపెట్టుకునే సౌలభ్యం కూడా ఇచ్చారు. సాయంత్రం వేళల్లో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రోజంతా విపరీతమైన ఒత్తిడి, అలసట వేధిస్తున్నా, అంతటి బాధను మైమరిపించేలా ఈ కార్యక్రమాలు తీర్చిదిద్దుతున్నారు. జీవితం పట్ల ఆశ కోల్పోయిన ఆ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు చిందింప జేస్తున్న అంకిత్, గిరీష్ లాంటి యువకులు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఎన్టీఆర్‌కు ప్రత్యేక చిత్రంగా 'దేవర' : కొరటాల శివ



'ఎన్టీఆర్‌కు, ఆయన అభిమానులకు 'దేవర' సినిమా ఖచ్చితంగా ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రస్తుతానికి ఇంతకు మించి చెప్పలేను. త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయి' అని దర్శకుడు కొరటాల శివ వ్యాఖ్యానించారు. కొరటాల శివ దర్శకత్వంతో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న యాక్షన్ చిత్రం దేవర'. ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా దీని నుంచి అప్‌డేట్ వచ్చే అవకాశముందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. సముద్రతీరం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోంది. ఈ చిత్రంతో జాన్వీ తెలుగు తెరకు పరిచయమవుతుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. కీలక పాత్రలో శ్రీకాంత్ కనిపించనున్నారు. తొలుత ఈ మూవీ మొదటి భాగాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. అయితే కొన్ని కారణాల వల్ల దీని విడుదలను అక్టోబర్ 10కి వాయిదా వేశారు.



'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ నుంచి సరికొత్త అప్‌డేట్

దేశభక్తితోపాటుగా ఓ మధ్య తరగతి వ్యక్తి జీవిత నేపథ్యంగా తీసిన 'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. తెలుగు దర్శక ద్వయం రాజ్–డీకే తీసిన ఈ సిరీస్‌లో మనోజ్ భాజ్‌పాయ్–ప్రియమణి జంటగా నటించారు. 2019 సెప్టెంబరు 20న అమెజాన్ ప్రైమ్‌లో తొలి సీజన్ రిలీజైంది. కామెడీ, యాక్షన్, దేశభక్తి ఇలా అన్ని అంశాలతో తీసిన ఈ సిరీస్ ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంది. రెండో సీజన్.. 2021 జూన్ 4న రిలీజ్ చేశారు. తొలి భాగమంతా కానప్పటికీ మంచి స్పందన దక్కించుకుంది. అయితే మూడో సీజన్.. కరోనా వ్యాక్సిన్ బ్యాక్ డ్రాప్, రెండో సీజన్ వచ్చి మూడేళ్లు అవుతున్నా ఇప్పటికీ అప్డేట్ లేకపోయేసరికి చాలామంది దీని గురించి మర్చిపోయారు. సరిగ్గా ఇలాంటి టైంలో మూడో సీజన్ షఉటింగ్ మొదలైందని డైరెక్టర్లు ప్రకటించారు. లొకేషన్ నుంచి ఓ ఫొటో కూడా కూడా విడుదల చేశారు. వచ్చే ఏడాది దీనిని విడుదల చేయనున్నారు.

జూన్ 13న 'రాయన్'

ధనుష్ తన సొంత దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. తాజాగా ఈ సినిమా విడుదల తేదీ ఖరారైంది. జూన్ 13వ తేదీ గురువారం ప్రపంచవ్యాప్తంగా రాయన్ సినిమాని విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, దుషారా విజయన్ కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రకాష్ రాజ్, విష్ణు విశాల్, కాళిదాస్ జయరామన్, సందీప్ కిషన్, సెల్వ రాఘవన్, ఎస్ జే సూర్య ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఓ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఏఆర్. రెహమాన్ సంగీతం అందించారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ ఈ చిత్రానిన నిర్మిస్తున్నారు.

చూడాల్సిన సినిమా 'దేశం కోసం భగత్‌సింగ్'



అమరవీరుడు, అసమాన త్యాగధనుడు, దార్శనికుడైన భగత్‌సింగ్ జీవితంపై హిందీలో చాలా చిత్రాలు వచ్చాయి. ఇన్నేళ్లయినా తెలుగులో ఒక్క చిత్రం కూడా రాలేదు. ఆ లోటును పూడ్చుతూ రవీంద్ర గోపాల తెలుగులో 'దేశం కోసం భగత్ సింగ్' పేరుతో ఒక పూర్తి నిడివి చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రం ప్రీమియర్ షో మే 5న ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగింది. భగత్ సింగ్ కేవలం విప్లవ వీరుడే కాదు. చిన్న వయసులోనే చాలా అధ్యయనం చేసినవాడు. మంచి రచయిత. జైల్లో ఉంటూనే ఇంగ్లీష్, హిందీ, పంజాబీ పత్రికలకు వ్యాసాలు పంపేవారు. రష్యాలో జయప్రదమైన సోషలిస్టు విప్లవం భగత్‌సింగ్‌కి చాలా ఉత్తేజమిచ్చింది. దానితో కమ్యూనిస్టు గ్రంథాలను ప్రపంచ పరిణామాలను చాలా లోతుగా అధ్యయనం చేశారు. దేశం మతోన్మాదుల చేతుల్లో పడరాదని దేశ పౌరులను దాదాపు వందేళ్ల క్రితమే హెచ్చరించాడు. అంతటి గొప్ప విప్లవవీరుడి చిత్రానికి దర్శకుడు, పాటల రచయిత బాధ్యతలను కూడా రవీంద్ర గోపాల్ పోషించారు. ప్రముఖ నాటక రచయిత కంచర్ల సూర్యప్రకాశరావు, రవీంద్ర కలిసి ఉమ్మడిగా సంభాషణలు రాశారు. ప్రీమియర్ షో సందర్భంగా దాశరథి ఫిల్స్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వికే మేనేజింగ్ సెక్రటరీ ఎస్, వినయ్ కుమార్, సొసైటీ కార్యదర్శి బిడిఎల్ సత్యనారాయణ, సొసైటీ సంయుక్త కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు రవీంద్ర గోపాల్‌ని సన్మానించారు.



సైబర్ మోసానికి గురైన నటుడి సతీమణి

బాలీవుడ్‌లో నటుడిగా తనకుంటూ గుర్తింపు తెచ్చుకున్న రాకేశ్ బేడీ, ఆయన సతీమణి ఇద్దరూ మోసపోయారు. వీరిద్దని సైబర్ మోసగాళ్లు మోసం చేశారు. 1979 నుంచి సినిమాలు, 1984 నుంచి సీరియల్స్ చేస్తూ రాకేశ్‌బేడీ బిజీగా ఉన్నారు. ఓటీటీల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చి పలు వెబ్ సిరీసుల్లోనూ నటించారు. గతేడాది డిసెంబరులో ఈ నటుడిని ఓ వ్యక్తి మోసం చేశాడు. అతడు తాను ఆర్మీ ఉద్యోగి అని పరిచయం చేసుకున్నాడు. రాకేశ్‌కి చెందిన ఫ్లాట్ కొంటానని నమ్మబలికాడు. మాటల్లో పెట్టి రూ.85 వేలు డబ్బు తన అకౌంట్‌లోకి వచ్చేలా చేసి మోసం చేశాడు. ఇప్పుడు నటుడు రాకేశ్ బేడీ భార్యకు అలాంటి అనుభవమే ఎదురైంది. పొరపాటున తన బ్యాంక్ ఖాతాలోని రూ.5 లక్షలు.. మీ ఖాతాలో జమ అయ్యాయని ఓ అజ్ఞాత వ్యక్తి ఆరాధనకు చెప్పాడు. మొబైల్‌కి వచ్చే ఓటీపీ నంబర్ చెప్తే ఆ డబ్బులు తిరిగి తన ఖాతాలో జమ అయిపోతాయని అన్నాడు. ఇదేదో తేడాగా ఉందని గ్రహించిన ఈమె ఫోన్ కట్ చేసేసింది. కానీ ఈమె ఖాతాలో నుంచి డబ్బులు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఈమె సైబర్ క్రైమ్ పోలీసులని ఆశ్రయించింది. అయితే ఇలా నెలల వ్యవధిలో ప్రముఖ నటుడి దంపతులు సైబర్ మోసానికి గురవడం చర్చనీయాంశమైంది.

క్లీన్‌స్వీప్ దిశగా హర్మన్‌ప్రీత్ సేన

నాల్గో టి20లో బంగ్లాపై 56పరుగుల తేడాతో విజయం



ఢాకా: బంగ్లాదేశ్ మహిళలతో జరిగిన నాల్గో టి20లోనూ టీమిండియా మహిళల జట్టు ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా 14 ఓవర్లకు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 56పరుగుల తేడాతో బంగ్లాదేశ్ మహిళల జట్టుపై గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు 14ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 122పరుగులు చేసింది. స్మృతి మంధాన(22), హేమలత(22), హర్మన్‌ప్రీత్(39), రీచా ఘోష్(24) బ్యాటింగ్‌లో రాణించారు. బంగ్లా బౌలర్లు మరూఫా అక్తర్, ఖాన్‌లకు రెండేసి, షోరిఫాకు ఒక వికెట్ దక్కాయి.

అనంతరం భారత మహిళా బౌలర్లు సమిష్టిగా చెలరేగడంతో బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 14ఓవర్లు పూర్తయ్యేసరికి 7వికెట్లు కోల్పోయి 68పరుగులే చేసింది. బంగ్లా ఓపెనర్ అక్తర్(21), హైదర్(13), ఖాతూన్(11) రెండంకెల స్కోర్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు లభించింది. ఈ గెలుపులో భారత మహిళల జట్టు ఐదు టి20ల సిరీస్‌లో 4–0 ఆధిక్యతలో ఉండగా.. ఐదో, చివరి టి20 గురువారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

భారత మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)రీతు మోని (బి)సోఫియా ఖాతున్ 2, మంధాన (బి)రెబెయా ఖాన్ 22, హేమలత (ఎల్‌బి)మరుఫా అక్తర్ 22, హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్)అక్తర్/నిగర్ 39, రీచా ఘోష్ (సి)అక్తర్ (బి)రెబెయా ఖాన్ 24, సజన (నాటౌట్) 8, పూజ వస్త్రాకర్ (సి)రెబయా ఖాన్ (బి)మరుఫా అక్తర్ 1, అదనం 4, (14ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 122పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/35, 3/60, 4/104, 5/116, 6/122 **బౌలింగ్:** మరుఫా అక్తర్ 3–0–32–2, షోరిఫా ఖాతున్ 3–0–29–1, హబిబా ఇస్లామ్ 2–0–20–0, నహిదా అక్తర్ 3–0–21–0, రబెయా ఖాన్ 3–0–29–2.

బంగ్లాదేశ్ మహిళల ఇన్నింగ్స్: డిలారా అక్తర్ (ఎల్‌బి)దీప్తి శర్మ 21, ముర్షిదా ఖాతున్ (సి)రీచా (బి)దీప్తి 1, రుబ్యా హైదర్ (రనౌట్)మంధాన/రీచా 13, నిగర్ సుల్తానా (ఎల్‌బి)శోభన 1, షోమా అక్తర్ (సి)రీచా (బి)శోభన 5, రితు మోని (సి)షెఫాలీ వర్మ (బి)రాధా యాదవ్ 1, షోరిఫా ఖాతున్ (నాటౌట్) 11, రెబయా ఖాన్ (సి)షెఫాలీ వర్మ (బి)పూజ వస్త్రాకర్ 8, నహిదా అక్తర్ (నాటౌట్) 2, అదనం 5. (14 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 68పరుగులు.

వికెట్ల పతనం: 1/18, 2/38, 3/39, 4/39, 5/47, 6/47, 7/66

బౌలింగ్: టి. సద్ధు 2–0–10–0, పూజ వస్త్రాకర్ 3–0–15–1, దీప్తి శర్మ 3–0–13–2, రాధా యాదవ్ 3–1–12–1, శోభనా 3–0–18–2.





పారిస్ ఒలింపిక్స్‌కు 4x400మీ. రిలే జట్లు అర్హత

బహామాస్: పారిస్ ఒలింపిక్స్‌కు అథ్లెటిక్స్ విభాగంలో మరో భారత్‌కు మరో రెండు బెర్తులు దక్కాయి. బహామాస్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ రిలే ఈవెంట్ 4క్ష్మ400మీ. రిలేలో భారత మహిళల, పురుషుల జట్లు పారిస్‌కు అర్హత సాధించాయి. మహిళ విభాగంలో రూపల్ చౌదరీ, ఎంఆర్ పూవమ్మ, జ్యోతికా శ్రీదండి, సుభా వెంకటేశన్‌లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. హీట్ నెంబర్–9లో భారత మహిళల బృందం 3 నిమిషాల 29.35 సెకన్లలో రేస్‌ను పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచారు. ఆ రేసులో జమైకా బృందం తొలి స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో మహమ్మద్ అనాస్ యహియా, మొహమ్మద్ అజ్మల్, అరోకియా రాజీవ్, అమోజ్ జాకబ్ బృందం 4క్ష్మ400మీ. రిలే బృందం 3నిమిషాల 3.23 సెకన్లలో పూర్తి చేశారు. తమ హీట్‌లో ఈ బృందం రెండో స్థానంలో నిలిచింది. అమెరికా తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. అనాస్, అజ్మల్, అమోజ్‌లు కేరళవాసులు కాగా, రాజీవ్ తమిళనాడుకు చెందిన అథ్లెట్. రెండవ రౌండ్‌కు చెందిన మూడు హీట్స్‌లో టాప్ టూలో ఉండే బృందాలను ఒలింపిక్స్‌కు ఎంపిక చేస్తారు. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్ ఒలింపిక్స్ క్రీడలు జరగనున్నాయి.

ఐపిఎల్‌లో నేడు
ఢిల్లీ × రాజస్తాన్
వేదిక: ఢిల్లీ; రా.7.30గం॥లకు

విజేతలు స్వైటెక్, రుబ్లేవ్





మాడ్రిడ్: డబ్ల్యుటిఎ మాడ్రిడ్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను టాప్‌సీడ్ ఇగా స్వైటెక్, పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రష్యాకు చెందిన రుబ్లేవ్ చేజిక్కించుకున్నారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో స్వైటెక్ 7–5, 4–6, 7–6(7–3)తో అర్యానా సబలెంకాను చిత్తుచేసింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సబలెంకను ఈ ఏడాది స్వైటెక్ చెక్ పెట్టింది. ఈ మ్యాచ్ సుమారు మూడుగంటల 11 నిమిషాలసేపు సాగింది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లో రుబ్లేవ్ 4–6, 7–5, 7–5తో ఫిలెక్స్ అగర్–అలిసెమిని చిత్తుచేశాడు. టోర్నీ ప్రారంభంలో పేలవ ప్రదర్శనతో మొదలుపెట్టిన రుబ్లేవ్ ఏకంగా టైటిల్‌ను చేజిక్కించుకోవడం విశేషం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

Format C-2

For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party
(As per the judgement dated 25 th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)
Name of Political Party: Yuvajana Sramika Rythu Congress Party
Name of Election: General Election 2024 / House of Parliament
Name of the State: ANDHRA PRADESH

1	2	3	4		5		
			(A) Pending criminal cases		(B) Details about cases of conviction for criminal		
SI. No.	Name of Constituency	Name of Candidate	Name of Court, case No. & status of the case(s)	Sections of the Acts concerned & brief description of offence(s)	Name of Court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment Imposed.
1	Ananthapur	Shankar Narayan Malagundla	1) Judicial first class magistrate court, penukonda - CC 295(2019) 2) Executive magestrate, Dharmavaram, - CC No. 19 (2017) 3) Judicial first class magistrate court, Ananthapuram, - CR No. 90 (2017) 4) First Special Magistrate, Ananthapuram - CC No. 1580 (2015) 5) Judicial first class magistrate, Ananthapuram, - CR No. 343 (2013)	1) U/S 341,143,118 r/w 34 IPC 2) U/S 151 CRPC 3) U/S 188 IPC 4) U/S 143,341,427,506 & 353 r/w 149 IPC & Sec of PDPP act & Sec 7(1) & 8 of public security act 5) U/S 188,341,290 r/w 34 IPC	NA	NA	NA
2	Guntur	Venkata Rosiah Kilari	F.I.R.128/2024, Pedakakani P.S.	Secs.No.188, 171-E, 171-F of I.P.C	NA	NA	NA
3	Kadapa	Yeduguri Sandinti Avinash Reddy	RC- (S)/20220/CBI/SC-III/New Delhi, 84 (2019) - Principle Special Sessions Judge for CBI Cases Nampally, Hyderabad, Telangana State, Cr. No. 418/2018, 84 (2019)	1. Sec.120-B, 302, 201, 2. 341, 188, r/w34 IPC	NA	NA	NA
4	Kurnool	Boya Yella Ramaiah	Adoni Court, Cr. No. 68/2024	u/s 188 r/w 34 IPC of Aspari, PS.	NA	NA	NA
5	Narsaraopet	Anil Kumar Polubolina	In the court of Hon'ble Spl. Judge for trail of cases relating to elected MPs and MLAs, Vijayawada, C.C. No. 69/2018	Secs.143, 341, 188 r/w 149 Of IPC	NA	NA	NA
6	Vijayawada	Srinivas Kesineni (Nani)	II Additional Chief Metropolitan Magistrate at Vijayawada. -	1) Secs : 353,188,143,341, r/w 149 of IPC	NA	NA	NA
75	Parchuru	Balaji Yadam	Addl J.C.J. Court Chirala. - FIR No. 224/2020, Chirala –I, TOWN P.S.	1. Violated the promulgated orders of government in view of covid-2019 and caused to spreading dangerous virus Under Sec 188,269,270 r/w 34 IPC	NA	NA	NA
76	Parvathipuram	Alajangi Jogarao	1. Crime No. 57/2024 of Parvathipuram Town P.S, D.D.R. No. 1831/2024. 2. Cr. No. 91/2024 Parvathipuram Rural PS Case number not allotted.	1. Section 188 of I.P.C. Disobedience to orders promulgated by the government servant (MCC Rules) 2. Sections 379, 323 R/W 34 I.P.C 3(1)(S), 3(2)(VA) S.C S.T (POA) Act. For conducting a meeting with volunteers by violating the MCC rules and thereby quarrel took place. On 14.04.2024 at about 13.30 hours while the complaint was present at his party office, he got information that Alajangi Joga Rao, M.L.A	NA	NA	NA
77	Pathapatnam	Shanthi Reddy	Judicial First Class Magistrate, Tekkali, Srikakulam District, A.P. - F.I.R.No.64 / 2024	Sec.188 IPC. (Disobedience to an order lawfully promulgated by a public servant).	NA	NA	NA
78	Pedana	Uppala Ramesh	Judicial First Class Magistrate, Special Mobile Court, Machilipatnam. (summons not served in the case). - CC.No.1306 of 2020 In FIR No. 171 of 2018	Sections 341, 143, 506, R/w 149 of IPC. Unlawful Assembly for wrongful restraint and Criminal intimidation with common intention.	NA	NA	NA

79	Peddapuram	Davuluri Dorababu	On the file of II Additional Judicial First Class Magistrate Peddapuram - FIR No. 136 of 2024 of Peddapuram PS (C.C.No.361 of 2024)	Section s 143, 341, 283, 290, r/w 149 of IPC The offense is that the candidate and some other people formed as unlawful assembly and have organized rally in connection of the general election by violating NCC Rules and 30 police Act without taking prior permission and created nuisance.	NA	NA	NA
80	Penamulur	Jogi Ramesh	1.FIR No:923/2021, TADEPALLI PS, FIR No:605/2017 &IBRAHIMPATNAM PS. 2. FIR No:180/2018, IBRAHIMPATNAM PS. 3. Hon'ble Special Mobile Court,Machilipatnam. - CR.NO.171/2018. 4. FIR No:115/2018. 5. FIR No:96/2018. 6. FIR No: 605/2017, IBRAHIMPATNAM PS.	1. Lodged under Sections 143,506,324, 188,269,270 R/W 34 IPC (DHARNA CASE). 2. Lodged under Sections 143,188,342, 353,452,290,50 6, R/W 149 IPC&sec 7(1) crpc (DHARNA CASE) 3. Lodged under Sections 341,143,506, r/w 149 ipc &sec30 of police act (DHARNA CASE) 4. Lodged under Sections 353,143,R/W 149 IPC (DHARNA CASE) 5. Lodged under Sections 143,506,324, 188,269,270 R/W 34 IPC (DHARNA CASE) 6. Lodged under Sections 143, 145,147. 148, 290,341,353,149 OF IPC &30 OF POLICE ACT (DHARNA CASE)	NA	NA	NA
81	Pendurthi	Annamreddy Adeep	1. C.C.No.179/2018, Principal Civil Judge, Jr.Division, Visakhapatmnam. - F.I.R.No.402/2017, Pendurthi Police Station, Visakhapatnam. 2. C.C.No.293/2022, VI Metropolitan Magistrate For Railway Court, Visakhapatnam - F.I.R.No.C3C/1242(9) 2016, the Sub-Inspector RPF Out Post, Kottavalasa.	1. Sec.309 of IPC., (Attempt to commit suicide) 2. Sec.147 and 174(a) of Railways Act. (Rioting)	NA	NA	NA
82	Prathipadu	Varupula Subba Rao	FIR No. 129/2024 A.Annavaram PS	U/s 143, 290, 286, 171-1 r/w 149 IPC (Unlawful\ Assembly, Committing of Public Nuisance, Dealing with explosive substance, failure to keep election accounts)	NA	NA	NA
84	Rayadurg	Mettu Govindha Reddy	Special Court for Trail of MPs and MLAs, Vijayawada. - CC No. 50 Of 2018	Under sections 143, 188, 447, 186, 506 r/w 149 ipc. Want only giving provocation with intent to cause riot, disobedience to order of public servant, criminal trespass, obstructing public servant in discharge of public functions and criminal intimidation with common object.	NA	NA	NA
85	Srikalahasti	Madhusudhan Reddy Biyyapu	1.AJCJ Court Srikalahasti. - C.C.No. 661 OF 2022. 2.A.C.M.M. Court at Banglore City - C.C.No. 8013 of2022.	1.Wrongful restraint, Promoting enmity between different groups on grounds of religion, race, place of birth, residence, language, etc., and doing acts prejudicial to maintenance of harmony and Public nuisance with common intention. Under Sections 341, 153-A, 290 r/w.34 I.P.C. 2. Under Section 138 of N.I.Act. Dishonor of cheque	NA	NA	NA
86	Vemuru	Ashok Babu Varikuri	1.NA - FIR No 53/2024 Amruthalu PS 2. CC No 166/2018 Jr Civil Judge, Pondi - FIR No 12/2018 Marripadu PS 3. CC No 328/2019 2nd Adl Jr Civil Judge Kandukur - FIR No 102/2018 Kondepi PS 4. SC SPL 20/2022 VII Addl. Dist and Sessons Judge, Ongole - FIR No 192/2018 Tanguturu PS 5. CC No 489/2020 Spl Mobile Court, Ongle - FIR No 167/2017 Marripadu PS 6. CC No 274/2015 1st Jr Civil, Piduguralla - FIR No 221/2014 Piduguralla PS	1. U/s 505(2), 171-C(2)(a) r/w 171-F IPC, 123 (2) (a)(i) RPA 1951 2. U/s 143, 341, 186, 188 IPC r/w 149 IPC 3. u/s 143, 188 r/w 34 IPC 4. u/s 143, 147, 148, 324, 506 r/w 149 IPC, Secs. 3(1) (R S) 3(2) (Va) (Poa) SC ST Act 5. u/s 143, 341, 186, 506, r/w 149 IPC 6. u/s 420 and 506 IPC	NA	NA	NA

తరువాయి 16లో

87	Yemmiganur	Butta Renuka	1). JFMC, Kurnool. - F.I.R.No.61/2014 SHO., II Town Police Station, Kurnool. 2). C.C.No.55, 58, 59 of 2016 before Economic Offences Court of Hyderabad.	1. Sections.171-F, 188 of IPC. 2. Section 276 of Income Tax Act, 1961.	NA	NA	NA
88	Yerragondapalem	Chandra Sekhar Tatiparthi	1.A.J.F.C.M Court Markapur. - Cr.No. 70/2024 2. A.J.F.C.M Court Markapur. - Cr.No. 73/2024 3.A.J.F.C.M Court Markapur. - Cr.No. 74/2024	1. Unlawful assemble and supply of food without permission under sec 171 (h,) 171(f) of ipc and 155(2) of cr.p.c; 2. Voilation of model code of conduct in supply of food in public meeting under sec 171(f) of ipc ; 3. Voilation of model code of conduct in affixing the wall stitches at walls under sec 171(h) of ipc ;	NA	NA	NA
7	Chittoor	M.C. Vijayananda Reddy	1. Charge sheet not yet filed. 2. C.C.No.307/2015 on the file of Hon'ble IV addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Not yet Re Numbered) 3. C.C.No.280/2015 on the file of Hon'ble IV addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Not yet Re Numbered) 4. C.C.No.323/2017 on the file of Hon'ble JFMC, Puttur. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati 5. C.C.No.279/2015 on the file of Hon'ble IV addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Not yet Re Numbered). 6. PRC No 23/2016 (Club Charge sheet is filed both in Crime no 35/2014 and Crime No 74/2014) Hon'ble III addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Re Numbered as PRC No 23/2016). 7. PRC No 23/2016 (Club Charge sheet is filed both in Crime no 35/2014 and Crime No 74/2014) Hon'ble III addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Re Numbered as PRC No 23/2016). 8. C.C.No.278/2015 on the file of Hon'ble IV addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Re Numbered as CC NO.542/23) 9. C.C.No.37/2016 on the file of Hon'ble III addl., JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Not yet Re Numbered). 10. C.C.No.213/2016 on the file of Hon'ble IV Addl., JFMC, Chittoor 11.PRC No 75/2018, AJFCM Piler Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Re Numbered as PRC No 398/2023). 12.C.C.No.822/2019 on the file of Hon'ble Spl. Mobile JFMC, Chittoor. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Not yet Re Numbered). 13. CC No 376/2017 AJFCM, Piler Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Not yet Re Numbered). 14. CC No 354/2017 on the file of AJFCM, Piler. Transferred to Judicial Magistrate of Ist class cum Special court for trail of cases relating to Red sanders smuggling- Tirupati (Re Numbered as CC No 439/23)	1. Violation of Model Code of Conduct Section 379, 353, 307, r/w 34 IPC 2. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 3. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 4. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 5. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 6. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC Illegal transport of red sandal 7. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 8. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 9. Supply of Spurious liquor during election Section 34A of A.P. Excise Act, Section 487, 420, 120B r/w IPC 10. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 11. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 12. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC 13. Illegal transport of red sandal Section 379, 353, 307, IPC	NA	NA	NA
			1.The Court of Principal Special Judge For CBI Cases, Hyderabad - Sc.No.3 of 2021 2. The Court of Principal Special Judge For CBI Cases, Hyderabad - Sc.No.2 of 2021 3.The Court of Principal Special Judge For CBI Cases, Hyderabad - Sc.No.1 of 2021 4. The Court of Principal Special Judge For CBI Cases, Hyderabad [Previous Court: The Court of the Metropolitan Sessions Judge, Nampally, Hyderabad] - Sc.No.1 of 2020(old case No. Sc.No.92 of 2016) 5. Judge, SPL. Court for Trial of cases relating to elected MPs and MLAs, Vijayawada cum VIII Addl. District and Sessions Judge cum V Addl. Metropolitan Sessions Judge, Vijayawada, Krishna District - C.C.No. 33 of 2018. 6. The Court of Principal Special Judge for CBI Cases, Hyderabad - Sc.No.2 of 2018 7. The Court of Principal Special Judge for CBI Cases, Hyderabad - Sc.No.1 of 2018 8. FIR filed with: Nandyala III Town Police Station, AP(No Cognizance	1.Alleged under Section 4 R/w section 3 of prevention of money laundering Act,2002. 2. Alleged under Section 4 R/w section 3 of prevention of money laundering Act,2002. 3. Alleged under Section 4 R/w section 3 of prevention of money laundering Act,2002. 4. Alleged under Section 4 R/w section 3 of prevention of money laundering Act,2002 and Section 8(5). 5. Alleged under Sections 499, 500, 501, 502 r/w section 34 of indian penal code, 1860. 6. Alleged under Section 4 r/w section 3 of prevention of money laundering act, 2002. 7. Alleged under Section 4 r/w section 3 of prevention of money laundering act, 2002. 8. Alleged under Sections 188, 504, 506 of Indian penal code and section 125 of representation of people act, 1951. 9. Alleged under			

తరువాయి 17లో

83	Puli ven dula	Yeduguri Sandinti Jagan Mohan Reddy	taken yet) - FIR No. 192 of 2017 9. The Court of Principal Special Judge for CBI Cases, Hyderabad - Sc.No.2 of 2017 10. The Court of Principal Special Judge for CBI Cases, Hyderabad- FIR No.177 of 2017 11. FIR filed with: Kakinada III TOWN POLICE STATION AP(No Cognizance taken yet) - FIR No. 122 of 2017. 12. FIR filed with: Police Station Ramagiri (No Cognizance taken yet) - FIR No. 23 of 2016 13 FIR filed with:POLICE STATION: MANGALAGIRI (R), GUNTUR URBAN - FIR No. 59 of 2016. 14.FIR filed with:POLICE STATION: MANGALAGIRI (R), GUNTUR URBAN - FIR No. 45 of 2016 15. The Court Of Principal Special Judge For CBI Cases,Hyderabad - Sc.No.2 of 2016 16.The Court of Principal Special Judge For CBI Cases, Hyderabad Previous Court: The Court of The Metropolitan Sessions Judge, Nampally, Hyderabad. - New Case No. ScNo.1 of 2016(Old Case No. SC no. 106 of 2015.) 17.The Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C. No. 26 of 2014. 18. FIR filed at Saroor Nagar Police Station, Cyberabad, Hyderabad(No Cognizance taken yet) - FIR No. 861 of 2013. 19. Court Of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 28 of 2013. 20. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 27 of 2013. 21. . Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C. No. 26 of 2013. 22. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 25 of 2013. 23. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 24 of 2013. 24 Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 12 of 2013 25. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - CCNo. 14 of 2012 26. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 10 of 2012 27. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C.No. 9 of 2012 28. Court of Hon'ble Principal Special Judge For CBI Cases, Hyderabad - C.C No. 8 of 2012 29. FIR Filed With Police Station, Vempalle Police Station Andhra Pradesh	Section 4 r/w section 3 of prevention of money laundering act, 2002. 10. Alleged under Section 125 of representation of people act, 1951. 11. Alleged under Sections 153a & 506 of Indian penal code, 1860 12. Alleged under Sections 116, 153A, 500 OF Indian Penal Code, 1860. 13. Alleged under Sections 425, 427, 505(II) R/W 24 OF Indian Penal Code, 1860 14. Alleged under Sections 500 and 501 of Indian Penal Code, 1860 15. Alleged under Section 4 r/w section 3 of prevention of money laundering act, 2002. 16. Alleged under Section 3, 4 & 8(5) Of Prevention of Money Laundering Act 17. Alleged under Section 120-b, 420, 409 of IPC and u/Sec 11, 13(2) r/w 13 (1) (c) & (d) of Prevention of Corruption Act, 1988 18.Alleged under Section 3 Of Prevention Of Insults To Honour Act, 1971 19. Alleged under Section 120-B R/W 420, 468, 471 Indian Penal Code, 1860 & Sec. 9 Of Prevention OfCorruption Act, 1988 20. Alleged under Section 120-B, 420 of Indian Penal Code & Sec.9 of Prevention of Corruption Act, 1988. 21.Alleged under Section 120-B r/w 420 of Indian Penal Code, 1860 & Sec.9 of Prevention of Corruption Act, 1988. 22. Alleged under Section 120-B, 420 Indian Penal Code, 1860 And 107 Of IPC r/w 13(2) r/w 13(1) (D) Prevention of Corruption Act. 23.Alleged under Section 120-B r/w 420, 420 of Indian Penal Code, 1860 And Sec.9 & 12 of Prevention of Corruption Act, 1988 24. Alleged under Section 120-B, 420 of Indian Penal Code, 1860 And Section 9 of Prevention of Corruption Act 25. Alleged under Section 120-B, 420, 409 of Indian Penal Code, 1860 And Section 9 And 12 of Prevention of Corruption Act 26. Alleged under Section 120-B, 420 & 471 of Indian Penal Code And Section 9 & 12 of Prevention of	NA	NA	NA

				No Cognizance taken yet - FIR No. 11 of 2008.	Corruption Act 27. Alleged under Section 120-B r/w 420, 420 & 471 Of Indian Penal Code, 1860 28.Alleged under section Section 12 r/w 11 of Prevention of Corruption Act and Section 120-B r/w 420 Of Indian Penal			

Sd:/-
Lella Appi Reddy
State General Secretary
Yuvajana Sramika Rythu Congress Party

ఇండియన్ బ్యాంక్ ఫలితాలు ఆకర్షణీయం

- తగ్గిన స్థూల ఎన్‌పిఎలు
- నికర లాభాల్లో 55% వృద్ధి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 55 శాతం వృద్ధితో రూ.2,247 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ ఆదాయం పెరగడంతో పాటుగా మొండి బాకీలు తగ్గడం మెరుగైన ఫలితాలకు దోహదం చేసింది. 2022-23 ఇదే క్యూ4లో రూ.1,447 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.14,238 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ4లో 19 శాతం ఎగిసి రూ.16,887 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆసుతలు 3.93 శాతానికి దిగివచ్చాయి. 2023 మార్చి ముగింపు నాటికి స్థూల ఎన్‌పిఎలు 5.95 శాతంగా ఉన్నాయి. కాగా.. 0.90 శాతంగా ఉన్న నికర నిరర్థక ఆస్తులు.. 2024 మార్చి ముగింపు నాటికి 0.43 శాతానికి పరిమితమయ్యాయి. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9 శాతం పెరిగి రూ.6,015 కోట్లుగా చోటు చేసుకుంది. 2022-23 ఇదే క్యూ4లో ఎన్ఐఐ రూ.5,508 కోట్లుగా నమోదయ్యింది.

2023-24 మొత్తం ఆర్థిక సంవత్సరంలో ఇండియన్ బ్యాంక్ నికర లాభాలు 53 శాతం వృద్ధితో రూ.8,063 కోట్లకు పెరిగాయి. 2022-23లో రూ.5,282 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.52,085 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 22 శాతం పెరిగి రూ.63,482 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024 మార్చి ముగింపు నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 11 శాతం పెరిగి రూ.6,88,000 కోట్లుగా నమోదయ్యాయి. కరెంట్ ఎకౌంట్ సేవింగ్ ఎకౌంట్ (కాసా) డిపాజిట్లు 8 శాతం వృద్ధి చోటు చేసుకుంది. స్థూల రుణాలు 13 శాతం పెరిగి రూ.5,33,773 కోట్లకు చేరాయి. 2023 మార్చి ముగింపు నాటికి స్థూల రుణాలు రూ.4,73,586 కోట్లుగా నమోదయ్యాయి. సోమవారం బిఎస్ఇలో ఇండియన్ బ్యాంక్ షేర్ 1.93 శాతం తగ్గి రూ.533.05 వద్ద ముగిసింది.

ఎన్నికల వేళ ప్రయాణాలు 47% పెరగొచ్చు

- రెడ్‌బస్ అంచనా

హైదరాబాద్ : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల వేళ తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణికుల సంఖ్యలో 47 శాతం పెరుగదల ఉండొచ్చని రెడ్‌బస్ అంచనా వేసింది. మే 13న ఒకే విడతలో జరగనున్న ఎన్నికల్లో తమ విలువైన ఓటుని వేసేందుకు ఓటర్లు ఇప్పటికే వారి ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొంది. దీంతో తమ ప్లాట్ ఫామ్‌లో టిక్కెట్ల బుకింగ్ గణనీయంగా పెరిగిందని రెడ్ బస్ పేర్కొంది. మే 10, 11, 12 తేదీల్లో తమ సొంత ఊర్లకు వెళ్లే వారి సంఖ్య దాదాపు 47 శాతం పెరుగుదల ఉంటుందని రెడ్ బస్ అంచనా వేసింది. బస్ ఆపరేటర్లు రోజుకు 3000 కంటే ఎక్కువ సర్వీసులను నడుపుతున్నారని పేర్కొంది.

ఫోన్‌పే 'అక్షయ తృతీయ' క్యాష్‌బ్యాక్ ఆఫర్

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే ఈ ఏడాది అక్షయ తతీయ సందర్భంగా క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. మే 10న యూజర్లు ఫోన్‌పే యాప్‌లో గోల్డ్‌ను కొనుగోలు చేస్తే రూ.2000 వరకు గ్యారంటీ క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చని పేర్కొంది. ఈ ఆఫర్‌ను పొందాలంటే కనీసం రూ.1000 విలువ చేసే గోల్డ్‌ను ఆర్డర్ చేయాలని తెలిపింది. ఇది 24 క్యారెట్ డిజిటల్ గోల్డ్ కొనుగోలుపై ఒకసారి మాత్రమే వర్తిస్తుందని వెల్లడించింది.

ఆగస్టులో దేశ వ్యాప్తంగా 4జి సేవలు

- బిఎస్ఎన్ఎల్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెలికం సంస్థ బిఎస్ఎన్ఎల్ వచ్చే ఆగస్టు నుంచి దేశ వ్యాప్తంగా 4జి సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడానికి సిద్ధం అవుతోంది. దేశంలో 4జి, 5జి సేవల కోసం బిఎస్ఎన్ఎల్ 1.12 లక్షల టవర్లను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 4జి సేవల కోసం 9,000 టవర్లను ఇన్‌స్టాల్ చేసింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతను ఉపయోగించి ఈ సేవలు అందించనున్నట్లు బిఎస్ఎన్ఎల్ వర్గాలు తెలిపాయి. 700 మెగాహెర్ట్జ్ ప్రీమియం స్పెక్ట్రమ్ బ్యాండ్‌తో పాటు పైలట్ దశలో 2,100 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో రూపొందించిన 4జి నెట్‌వర్క్ ద్వారా సెకనుకు 40-45 ఎంబి స్పీడ్‌తో ఇంటర్నెట్ ఉంటుందని అధికారులు తెలిపారు. నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ఐటి సేవల దిగ్గజం టిసిఎస్, ప్రభుత్వ టెలికాం రీసెర్చ్ ఆర్గనైజేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 4జి పైలట్ ప్రాజెక్ట్ పంజాబ్‌లో చాలా బాగా పని చేస్తోందని అధికారులు అంటున్నారు. గత 4-5 ఏళ్లుగా బిఎస్ఎన్ఎల్ 4జి సామర్థ్యమున్న సిమ్‌లను మాత్రమే విక్రయిస్తోంది.

జీ మీడియా సిఇఒ అభయ్‌కు ఉద్వాసన



న్యూఢిల్లీ : జీ మీడియా కార్పొరేషన్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా ఉన్న అభయ్ ఓజాను ఆ సంస్థ అనుహ్యాంగా తొలగించింది. మే4న జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని జీ మీడియా సోమవారం రెగ్యూలేటరీ సంస్థలకు తెలిపింది. కాగా.. అభయ్ తొలగింపునకు కారణాలను వెల్లడించలేదు. 2022లో చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా చేరిన ఓజా.. గతేడాది సిఇఒగా బాధ్యతలు స్వీకరించారు.

ఆరేళ్ల గరిష్టానికి పి నోట్స్

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లలో ఫిబ్రవరి ముగింపు నాటికి పార్టిసిపేటరీ నోట్స్ (పి-నోట్స్) పెట్టుబడులు రూ.1.5 లక్షల కోట్లతో.. ఆరేళ్ల గరిష్ట స్థాయికి ఎగిశాయి. ఎలాంటి రిజిస్ట్రేషన్, గుర్తింపు లేకుండా విదేశీ ఇన్వెస్టర్లు పి-నోట్స్‌లో పెట్టుబడులు పెడతారు. జనవరి ముగింపు నాటికి రూ.1,43,011 కోట్లుగా ఉన్న పి-నోట్స్.. ఫిబ్రవరి ముగింపు నాటికి రూ.1,49,517 కోట్లకకు చేరాయని సెబీ గణంకాలు వెల్లడించాయి. 2017 జూన్‌లో రూ.1.65 లక్షల కోట్లతో గరిష్ట పెట్టుబడులు నమోదయ్యాయి.

బిఎఎస్ఎఫ్ నుంచి ఎఫికాన్ కీటకనాశిని



హైదరాబాద్ : ప్రముఖ వ్యవసాయ క్రిమిసంహారకాల కంపెనీ బిఎఎస్ఎఫ్ కొత్తగా ఎఫికాన్ కీటకనాశినిని విడుదల చేసింది. దీనిని సోమవారం హైదరాబాద్‌లో బిఎఎస్ఎఫ్ అగ్రికల్చర్ సొల్యూషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రు సిమోన్ బర్గ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిమేన్ మాట్లాడుతూ.. గుచ్చి తిను, రసంపీల్చు పురుగులను సమర్థవంతంగా నియంత్రించేందుకు ఎఫికాన్ మద్దతునిస్తుందన్నారు. ఎఫికాన్ కీటకనాశిని తొలిసారి 2023లో ఆస్ట్రేలియాలో అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతులకు మద్దతునివ్వడానికి భూమిపై అతిపెద్ద పని అయిన కీటకాల నుంచి పంటలను రక్షించడం, ఉత్పాదకతను పెంచడమే భారీ సవాలును విజయవంతంగా ఎదుర్కొనేందుకు సహాయపడటానికి తమ నైపుణ్యాన్ని వినియోగిస్తున్నామన్నారు.

పూర్తికాని 'పెట్టుబడి' వ్యయం పనులు

- అసంతృప్తి వ్యక్తం చేసిన పిఎజి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో అమలు జరుగుతున్న పెట్టుబడి వ్యయం పనుల్లో పూర్తికాని పనులపై ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం ఆరా తీస్తోంది. ఈ పనులకు సంబంధించిన వివరాలు ఇప్పటివరకు తమకు సమర్పించకపోవడాన్ని ఎత్తి చూపించింది. వార్షిక లెక్కలు ఖరారు చేయాలంటే ఈ వివరాలు తప్పనిసరి అని పిఎజి అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆరు శాఖల నుంచి ఈ వివరాలు రాలేదని పిఎజి అధికారులు రాష్ట్ర ఆర్థికశాఖకు లేఖ రాసారు. ఇందులో రోడ్లు భవనాలశాఖ, నీటి పారుదల శాఖం ప్రజా ఆరోగ్యశాఖ, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, జాతీయ రహదారులు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఉన్నాయి.ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పనుల్లో అనేక పనులు ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితుల్లోనే ఉన్నాయి. నిధులు లేక కొన్ని, కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితుల్లో కొన్ని, న్యాయస్థానాల్లో ఉన్న కేసుల కారణంగా మరికొన్ని పనుల పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. అనేక సంవత్సరాల క్రితమే ప్రారంభమైన పనుల్లో పురోగతి లేకపోవడంతో ఆ విషయాన్ని బాహాటంగా వెల్లడించేందుకు ప్రభుత్వం వెనుకాడుతోంది. అందుకే ఈ వివరాలు ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయానికి కూడా వెల్లడించడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే తాజాగా పిఎజి కార్యాలయం రాసిన లేఖలో ఈ అసంపూర్తి పనుల వివరాలను ఈ నెల 30వ తేదీలోగా పంపించాలని నిర్దేశించింది.

బాబువి ఆచరణ సాధ్యం కాని హామీలు

- వైసిపి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో



రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సంక్షేమపథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేక రాష్ట్రాన్ని శ్రీలంకలా మారుస్తున్నారని విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు ఇపుడు ఎలాగైనా అధికారంలోకి రావాలని అడ్డగోలుగా ఆచరణ సాధ్యంకానీ హామీలను ఇస్తున్నారని వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి గౌతంరెడ్డి విమర్శించారు. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు బిసిలను ఓటుబ్యాంక్‌గా చూస్తే జగన్‌మోహన్‌రెడ్డి పార్టీకి బ్యాక్‌బోన్‌గా గుర్తించి అనేక కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. గతంలో ఏ పార్టీ ఇవ్వని రీతిలో పదవుల్లో బిసిలకు అవకాశం కల్పించారని అన్నారు. చంద్రబాబు ప్రకటించిన హామీలు అమలు చేయాలంటే ఏడాదికి రూ 1.5లక్షల కోట్ల బడ్జెట్ కావాలని అంత డబ్బును ఎక్కడి నుండి తెస్తారో ప్రజలకు వివరించాలని అన్నారు. ఇంగ్లీష్ మీడియంతో తెలుగు నష్టపోతుందని అంటున్న కేంద్రమంత్రి అమిత్‌షా వారి పిల్లలను ఏ మీడియంలో చదివిస్తున్నారో చెప్పాలని వైసిపి ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ యార్లగడ్డ వెంకట రమణ ప్రశ్నించారు. 2014 మేనిఫెస్టోలో మోడీ ఫోటో వుండి ఇపుడు ఎందుకు లేదో తెలుగుదేశం, జనసేనలు చెప్పాలని డిమాండ్ చేశారు.ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను అసెంబ్లీలో మంచి చట్టం అని చెప్పిన తెలుగుదేశం పార్టీ ఇపుడు రాజకీయాల కోసం ఆ చట్టంపై దుష్ప్రచారం చేయడం తగదని వైసిపి అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ అన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కొనుగోలు యత్నాలు

- కళ్యాణదుర్గంలో వివాదం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మొదలవ్వడంతో అనంతపురం జిల్లాలో ఓట్ల కొనుగోలు ప్రయత్నాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం ఈ రకంగా ఉద్యోగులకు డబ్బుతో ఎరవేసే ప్రయత్నాలను అధికార వైసిపి చేపట్టింది. దీన్ని గుర్తించిన టిడిపి నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. టిడిపి నాయకుల వివరాల మేరకు..అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కానిస్టేబుల్ శివ అనే వ్యక్తి ఓటింగ్‌కు వస్తున్న ఉద్యోగులకు డబ్బులు ఎరవేసే ప్రయత్నాలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అధికార వైసిపికి అనుకూలంగా ఓటు వేస్తే రెండు వేల రూపాయలు ఇస్తామని ఆశ చూపుతుండగా టిడిపి నాయకులు గుర్తించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య వివాదం చోటు చేసుకుంది. పరస్పరం రాళ్లు రువ్వుకునే వరకు వెళ్లింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఇదే విధంగా అనంతపురంలోని జూనియర్ కళాశాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి వచ్చిన వారికి కొంత మంది డబ్బులు ఆశ చూపే ప్రయత్నం చేశారు. ఉద్యోగులు దీన్ని తిరస్కరించారు. అనంతపురం జిల్లాలో మొత్తం 26,150 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో ఇప్పటి వరకు 10499 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. ఇక హోం ఓటింగ్‌కు 1247 మంది దరఖాస్తు చేసుకుని ఇప్పటి వరకు 296 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు కలెక్టర్ తెలిపారు.

9.5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - వీరులపాడు (కృష్ణా జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలం సీలేరులో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. సీలేరుకు చెందిన సురేష్ అనే వ్యక్తి నుంచి హన్మకొండ జిల్లా శాయంపేటకు చెందిన అబ్దుల్ రహీ, మధ్యప్రదేశ్‌కు చెందిన మరోవ్యక్తి కొనుగోలు చేశారు. గంజాయిని వారికి ఇచ్చేందుకు చింతపండు, యూరియా బస్తాల మాటున బస్సులో హన్మకొండకు సురేష్ తీసుకొచ్చారు. బస్సులోని వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించడంతో వారి తనిఖీలు చేసి 9.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెటులో దీని విలువ రూ.2.35 లక్షల విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గిరిజనంపై బిజెపి దాడి

- ప్రజా వ్యతిరేక చట్టాలపై నోరు మెదపని వైసిపి, టిడిపి
- ఇండియా వేదిక గెలుపుతోనే ప్రజలకు రక్షణ
- ఎన్నికల ప్రచార సభల్లో బృందా కరత్



గుమ్మలక్ష్మీపురంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న బృందా కరత్, అరకు, కురుపాం అభ్యర్థులు అప్పలనర్స, రమణ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

గడిచిన పదేళ్లలో గిరిజన జీవన విధానాలపై బిజెపి దాడి చేయడంతోపాటు గిరిజన, అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో అనేక ప్రజా వ్యతిరేక చట్టాలు చేసినప్పటికీ రాష్ట్రంలోని వైసిపి, టిడిపి ఎంపిలు నోరు మెదపలేదని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా వేదిక గెలుపుతోనే ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులకు మద్దతుగా పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో జరిగిన సభలోనూ, పార్వతీపురంలో రోడ్ షోనూ సోమవారం ఆమె పాల్గొని ప్రసంగించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక దేశానికి గుండెకాయలాంటి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నించిందన్నారు. గిరిజనులకు, రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా చట్టాలు చేసిందని వివరించారు. ఇప్పటి వరకు జరిగిన రెండు విడతల పోలింగ్‌లో బిజెపి ఓటమి కనిపిస్తోందని, దీంతో, ఆ పార్టీ భయపడుతోందని తెలిపారు. బిజెపి టైర్లు పంచర్ అవుతున్నాయని, వాటిని సరి చేయాలంటే గాలికొట్టి పైకి లేపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకు చంద్రబాబు స్టెఫినీలా ఉపయోగ ఉపయోగపడుతున్నారని విమర్శించారు. బిజెపి పాలనలో గిరిజనులు, ముస్లిములపై దాడులు పెరిగాయని, మణిపూర్‌లో బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ ఉండడంతో గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదం రేపిందని అన్నారు. ఆ పార్టీని ఒంటరి చేసేందుకు దేశంలో అనేక పార్టీలు ఇండియా వేదికగా ఏర్పడ్డాయని తెలిపారు. బిజెపికి టిడిపి వంతపాడుతూ పొత్తు పెట్టుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మాజీ మంత్రి, పార్వతీపురం మాజీ ఎంపి కిశోర్ చంద్రదేవ్ టిడిపి నుంచి బయటకు వచ్చారని, ఇండియా వేదిక తరపున సిపిఎం నుంచి పోటీ చేస్తున్న అరకు ఎంపి, కురుపాం అసెంబ్లీ అభ్యర్థులను బలపరిచారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన యుపిఎ -1 ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం తెచ్చిందన్నారు. ఆ చట్టం ప్రకారం ప్రతి గిరిజనుడికీ గరిష్టంగా పది ఎకరాల వరకు సాగు పట్టాలు ఇచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ, రెండున్నర ఎకరాలకు మించి ఇవ్వలేదని తెలిపారు. దేశ వ్యాప్తంగా సాగు పట్టాల కోసం సుమారు 50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 20 లక్షల మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారని వివరించారు. ఈ భూములపై గిరిజనులకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారన్నారు. అటవీ సంరక్షణ చట్టం పేరుతో గ్రామసభలు పెట్టి గిరిజనుల అభిప్రాయం తీసుకోవాల్సిన అవసరం లేకుండా గిరిజన చట్టాన్ని సవరించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే గిరిజన ప్రాంతంలోని గనుల దోపిడీ మరింతగా పెరుగుతుందన్నారు. ఇన్ని జరుగుతున్నా వైసిపి ఎంపిలు పార్లమెంట్‌లో నోరు విప్పడం లేదని తెలిపారు. సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, కురుపాం ఎంఎల్‌ఎ అభ్యర్థి మండంగి రమణలను గెలిపిస్తే గిరిజనుల తరపున పార్లమెంట్, అసెంబ్లీలో పోరాడుతారన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు వీరిద్దరు చాలాకాలంగా పోరాడుతున్నారని గుర్తు చేశారు. దీనికి ముందు ఎల్విన్‌పేట వద్ద బృందా కరత్‌కు సిపిఎం కార్యకర్తలు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి భద్రగిరి మీదుగా జిఎల్ పురం వరకూ ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గంగునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర నాయకులు సిహెచ్ నరసింగరావు, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స, కురుపాం అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్, విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు పాల్గొన్నారు.

ఏప్రిల్ జీతాలు విడుదల చేయాలి

- సిఎస్‌కు సమగ్రశిక్షా ఎంప్లాయీస్ ఫెడరేషన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకూ ఏప్రిల్ జీతాల బడ్జెట్‌ను జిల్లాలకూ వెంటనే విడుదల చేయాలని ఎపి సమగ్రశిక్షా కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు బి కాంతారావు సోమవారం లేఖ రాశారు. సమగ్ర శిక్షాలోని ఉద్యోగులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ జీతాలు కూడా సకాలంలో రాకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఏప్రిల్ జీతాల బడ్జెట్‌ను వెంటనే జిల్లాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా ముందస్తు బడ్జెట్ కేటాయింపు చేయాలని కోరారు.

విద్యాహక్కు చట్టం కింద 25 వేల సీట్లు భర్తీ

- బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హులైన 25,125 మంది పిల్లలకు విద్యాహక్కు చట్టం కింద ఉచితంగా ప్రవేశాలు కల్పించినట్లు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా వారికి ఎటువంటి ఫీజులూ వసూలు చేయకుండా ప్రవేశాలు కల్పించాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాదిలో అత్యధిక సీట్లు గణనీయంగా పెరిగాయన్నారు. విద్యాహక్కు చట్టం పనితీరుపై విద్యాశాఖ సమన్వయంతో బాలల హక్కుల కమిషన్ పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించి ప్రవేశాలు కల్పించాలని, ఉల్లంఘనకు పాల్పడిన విద్యాసంస్థలపై కమిషన్ ద్వారా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రవేశాలపై ఇబ్బందులు ఎదుర్కొంటే కమిషన్ కార్యాలయానికి apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు.


శ్రీరాములు భౌతికకాయంపై జెండా కప్పి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు కన్నుమూత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

సిపిఎం శ్రీకాకుళం జిల్లా సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు (90) కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం వేకువజామున నగరంపల్లిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య యశోదమ్మ కరోనా సమయంలో మృతి చెందారు. శ్రీరాములుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. 1934 ఏప్రిల్ 20న బమ్మిడి అప్పయ్య, అప్పలమ్మ దంపతులకు మూడో సంతానంగా జన్మించిన ఆయన, చిన్న వయసులోనే ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయడం ప్రారంభిం చారు. నగరంపల్లి కేంద్రంగా పలాస ప్రాంతంలో అనేక ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి, ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేశారు. 1968 నుంచి 1975 వరకు అజ్ఞాతంలో ఉన్నారు. పార్వతీపురం కుట్ర కేసులో 1975లో అరెస్టయిన ఆయన రెండున్నరేళ్ల పాటు జైలులో నిర్బంధించబడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, జిల్లా కమిటీ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా సుదీర్ఘకాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేశారు. ఇటీవల జీడి రైతుల పోరాటం వరకూ అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు తదితరులు శ్రీరాములు భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళ్లర్పించారు. శ్రీరాములు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. అంతిమయాత్రలో సిపిఎం నాయకులు జి.సింహాచలం, ఎస్.ప్రసాదరావు, ఎన్.మోహనరావు, లిబరేషన్ నాయకులు టి.సన్యాసిరావు, న్యూడెమోక్రసీ నాయకులు వి.మాధవరావు, తామాడ త్రిలోచన, బొడ్డు వాసుదేవరావు, పలు ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


నందిగామ సురేష్‌ను పరిచయం చేస్తున్న సిఎం జగన్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం

- చంద్రబాబువి అబద్ధపు హామీలు
- మీ ఇంటి భవిష్యత్ కోసం వైసిపిని గెలిపించండి
- రేపల్లె, మచిలీపట్నం, మాచర్లలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- యంత్రాంగం

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చేందుకు అబద్ధపు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబు అలవాటుగా మార్చుకున్నారని విమర్శించారు. బాపట్ల జిల్లా రేపల్లె, కృష్ణా జిల్లా మచిలీపట్నం,పల్నాడు జిల్లా మాచర్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో గెలవలేమని భావించి ఐవిఆర్ నుంచి ప్రజలకు ఫోన్‌కాల్స్ చేసి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భూ సర్వేలు లేకపోవడం వల్ల వివాదాలు ఏర్పడి కోర్టుల చుట్టూ భూ యజమానులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని, ఈ సమస్యను పరిష్కరించి భూములపై యజమానులకు సంపూర్ణ హక్కులు ఉండేలా ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడమే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అని వివరించారు. భూ యజమానులకు టైటిల్ ఉండేలా ఒక చట్టం తీసుకు రావడమే దీని ఉద్దేశమన్నారు. గతంలోనూ గంజాయి, మత్తు పదార్థాలపై కూటమి నేతలు అసత్యాలు ప్రచారం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబుకు ఓటేస్తే మరోసారి మోసపోతారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు తీసివేస్తారని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే.. అతను చేసే మోసాలు ఏ స్థాయిలో ఉంటాయో గుర్తించాలన్నారు. గతంలో కూటమి పేరుతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోడీ ఫొటోలతో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నేరవేర్చలేదని విమర్శించారు. పొత్తులో భాగంగా మళ్లీ ఈ ముగ్గురు కలిశారని, మేనిఫెస్టో పేరుతో సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి చెందుతుందన్నారు. మహిళల పేరుతో 31 లక్షల మందికి నివేశన స్థలాలు, అక్క చెల్లెమ్మల సాధికారత, స్వావలంబన కోసం ప్రత్యేక పథకాలు ఏనాడైనా చూశారా? అని ప్రశ్నించారు. ఐదు సంవత్సరాల్లో చేసిన మార్పులు సంస్కరణలు మరో 15 సంవత్సరాలలో వెలుగులోకి వస్తాయన్నారు. పేదవాడి బతుకులు మార్చేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గుర్తు చేశారు. మరో వారం రోజుల్లో జరగనున్న ఎన్నికల కురుక్షేత్ర మహాసంగ్రామంలో మీ ఇంటి భవిష్యత్తు కోసం, మరో ఐదు సంవత్సరాల సంక్షేమ పాలన కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైసిపిని గెలిపించాలని కోరారు. జగన్‌కు ఓటేస్తేనే ఇంటింటికీ భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎంపి నందిగం సురేష్, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గణేష్, మచిలీపట్నం పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖర్, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సిపిఎం ప్రచారం

వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ అభ్యర్థులు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల రోడ్ షోలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ప్రజా సమస్యలపై నింతరం పోరాడే వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మోడీ కూటమికి, నిరంకుశ వైసిపికి మరోసారి అధికారమిస్తే దేశం, రాష్ట్రం రెండూ నాశనమైపోతాయని హెచ్చరించారు.

విజయనగరం జిల్లా మెంటాడలో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పాల్గొన్నారు. తొలుత మెంటాడ సినిమా హాలు వద్ద నుంచి డప్పుల వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ.. గిరిజనులను మోసం చేస్తున్న నరేంద్ర మోడీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు తాగునీరు, రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మోడీ తన అనుయాయులైన అంబానీ, అదానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం తెచ్చి 15 ఏళ్లు కావస్తున్నా గిరిజన నిరుపేదలకు సెంటు భూమి ఇవ్వలేని పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని ఆగ్రహించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పూటకో పార్టీ మారుతున్న బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత రూ.400 కోట్లు అక్రమంగా దోచుకున్నారని విమర్శిం చారు. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో ఉందని, ఇటువంటి వ్యక్తులను గెలిపిస్తే దేశ భవిష్యత్తు దెబ్బతింటుం దని హెచ్చరించారు. అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స పేదలపక్షాన పోరాడుతున్నారని, ఆయనను గెలిపించాలని కోరారు.



విజయనగరం జిల్లా మెంటాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి

విజయవాడ 29వ డివిజన్ బావాజిపేట, దుర్గాపురం, గులాబితోట, హనుమాన్‌పేట, గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి చిగురుపాటి బాబూరావు రోడ్ షో నిర్వహించారు. సాయంత్రం 59వ డివిజన్ సింగ్‌నగర్‌లో జరిగిన ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకొని ఓట్లు అభ్యర్థించారు. స్థానిక ప్రజలు హారతులు, దండలతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజా మద్దతుతో ఎర్రజెండా ఎగురవేస్తామన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ప్రజల మద్దతుతో సిపిఎం గెలవబోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపికి, దానికి మద్దతిస్తున్న టిడిపి, వైసిపిలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. సిపిఎం అభ్యర్థులను చట్ట సభలకు పంపాలని కోరారు.

నెల్లూరు నగరంలోని కపాడిపాళెం ప్రాంతంలో ఆ నియోజకవర్గ అభ్యర్థి మూలం రమేష్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ.. కపాడిపాళెం ప్రాంతంలో డ్రెయినేజీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించలేని స్థితిలో పాలకులు ఉన్నారన్నారు. నెల్లూరు నగరాభివృద్ధికి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మన్నూరు భాస్కరయ్య పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం వడ్లపూడిలో నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకరరావు రోడ్ షో ద్వారా ప్రచారం చేశారు. వాహనం పై నుండి ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. అనేక ప్రజా సమస్యలపై పోరాడుతున్న తాము చట్టసభల్లోనూ ప్రజావాణి వినిపించేందుకు వీలుగా తనకు ఓటు వేయాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం బొజ్జరాయి గూడెం, టేకులొద్ది, అభిచర్ల, గొమ్ము అయ్యవారిగూడెం, కొండాయిగూడెం, విఆర్.పురం మండలం కుంజవారిగూడెం, మోసంగుంపు, మడివి గుంపు, పిసం గుంపు, సరియం గుంపు, పొడియం గుంపు, మధ్య గుంపు తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరారు.

విశాఖ జిల్లా గాజువాక పరిధిలోని తోకాడ, గాజువాక ఆటోనగర్, స్వతంత్రనగర్, కుంచుమాంబ కాలనీల్లో ఆ నియోజకవర్గ అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. తోకాడలో ఉన్న 22 'ఎ' సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా ఉంటేనే గాజువాక ఆటోనగర్‌కు వర్క్ ఆర్డర్లు రావడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు.

నంద్యాల జిల్లా గడివేముల మండలంలో సిపిఎం పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌస్ దేశాయ్, కాంగ్రెస్ శ్రీ నంద్యాల ఎంపి అభ్యర్థి జంగిటి లక్ష్మీ నరసింహయాదవ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలు తెచ్చి రైతులను రోడ్డున పడేసిందన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి కూడా మోడీకి అనుకూలంగా వ్యవహరించి రైతులు, పేదలు, కార్మికులను మోసం చేసిందన్నారు.

బిజెపికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు (వైఎస్ఆర్)

బిజెపికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. చంద్రబాబుకి, జగన్‌కి ఇద్దరికీ మోడీ కావాలని, ఇద్దరూ మోడీని పట్టుకొని వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరూ రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులోని పలు కూడళ్లలో నిర్వహించిన ప్రచారంలో ఆమె ప్రసంగించారు. ఎంపి అవినాష్‌రెడ్డి ఏనాడైనా ప్రజల కోసం కొట్లాడారా? ఎంపిగా కడప స్టీల్ కోసం పోరాటం చేశారా? అని ప్రశ్నించారు. ఆయన కోసం తప్ప ప్రజల కోసం ఏనాడు ఢిల్లీకి వెళ్లలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరుస్తారని జగన్‌కి ఓటు వేస్తే నెత్తిన కుచ్చుటోపీ పెట్టారని అన్నారు. సొంత చిన్నాన్న వివేకా హత్యకేసు నిందితుడికి మళ్ళీ పట్టం కట్టారని, వైఎస్ఆర్, వివేకా వంటి ప్రజా నాయకులు మళ్ళీ దొరకరని తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే యథేచ్ఛగా బెట్టింగ్‌లు, గుట్కా, మట్కా వ్యాపారం, దొంగనోట్ల బిజినెస్ చేస్తూ మూడు పువ్వులు..ఆరు కాయలుగా దోపిడీలు చేస్తున్నారని ఆరోపించారు. దోచుకునే వారు ఎవరు? పని చేసే వారు ఎవరు? అనేది ఆలోచన చేసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి నజీర్ ప్రసంగిస్తూ ప్రాంతీయ పార్టీల ద్వారా అభివృద్ధి జరగదని, విభజన హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీకి మద్దతివ్వాలని కోరారు. ఆమ్ ఆద్మీ తరపున పోటీలో ఉన్న దస్తగిరి ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ అభిమానులు, మహిళలు పాల్గొన్నారు .


ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ షర్మిల

డిఎస్‌సిలో అప్రెంటిస్ రద్దు

- ముస్లిం రిజర్వేషన్లు కాపాడతాం
- ప్రజాగళం సభలో చంద్రబాబు హామీ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తాము డిఎస్‌సిలో అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. తాము ముస్లిం రిజర్వేషన్లు కాపాడతామని, అధికారంలో ఉండి ఉంటే ఐదేళ్లలో అన్ని ప్రాజెక్టులు పూర్తిచేసే వాళ్ళమని, జగన్ వచ్చి అన్నింటిని అటకెక్కించారని విమర్శించారు. తల్లిని చూసుకోని వారు ప్రజలను చూసుకుంటారా? అని ప్రశ్నించారు. చెల్లి చీర గురించి మాట్లాడడం మానసిక వైకల్యం అవునా? కాదా? అని ప్రజలను అడిగారు. ఏ కేసులు లేకున్నా తమను నంద్యాలలో అరెస్టు చేశారని అన్నారు. కర్నూలుకు న్యాయ రాజధాని వచ్చిందా? అంటూ ప్రశ్నించారు. జగన్ ఐదేళ్లు పరదా కట్టుకొని తిరిగి చెట్లన్ని నరికేశారని, ఇప్పుడు ఓట్ల కోసం ప్రజల దగ్గరికి వస్తున్నారని విమర్శించారు. ప్రజా వేదికను కూల్చి విధ్వంసానికి నాంది పలికారని, రాజధానిని, పోలవరాన్ని నాశనం చేశారన్నారు. ఈ ప్రభుత్వంలో ఎవరైనా బాగు పడ్డారా? అని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక నల్ల చట్టమని, ఆస్తులు కొట్టేసేవాడు కావాలా ఆస్తులు పెంచేవాడు కావాలా అని ప్రజలనుద్దేశించి కోరారు. మళ్లీ అన్న క్యాంటీన్, రంజాన్ తోఫా, దుల్హన్, పండుగ కానుకలు కావాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. పాణ్యం నియోజకవర్గానికి ప్రతిరోజు నీళ్లు ఇస్తామని, హంద్రీనీవా ద్వారా ఓర్వకల్లు, కల్లూరుకు నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. సభలో టిడిపి ఎంపి అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు.


ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు